సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 10
11.11-53

విజయ ఆశ్వయుజ శుద్ధ పంచమి, బుధవారం



'శిలువ నెక్కించండి'

(ఏసుక్రీస్తు జీవిత చరిత్రలోని చరమ ఘట్టం!

తైలవర్ణ చిత్రం : కె. సి. పణికర్. (అభ్యుదయ చిత్రకారుల సంఘ కళాప్రదర్శనలోనిది).

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

సినీతార శ్రీమతి భానుమతి

అక్షర తూణీరం

శాసనసభ 'చెద' రంగం
ఎరుపు తెలుపు బలాలు.
తోసిరాజు ఆటకట్టి
మాధవ చందూలాలు.

టంగుటూరి సత్యభామ
కోపగృహాంకరన్నాలు.
విశ్వనాథ తెన్నేటికి
శాంభోపాంజా 'రోలు.'

గుడారాంధ్రధాని వెనక
మంచి గూడుపుఠాణీ.
ఈ మినిస్ట్రీ కాంపొజిషన్
మాంగ తేంగ బట్టాణీ.

కీర్తి మేఘునీలం సం
జీవరెడ్డి నీలం
పన్నినింద్రజాలం దీ
నంతటికీ మూలం.

గోడమీది పిల్లితంతు
గోగిపూలరంగా.
లెఫ్టురైటు లెఫ్టురైటు
డాటులేదు నిజంగా.

ఒకేరంగు వేదికపై
ఒక్కొక్కని కొక పార్టీ.
ప్రతీప్రజా వేషలిస్టు
కోరు తనకు అధార్టీ.

ప్రతికూలీ, ప్రతి రైతూ
'రాజకీయ బాధితుడే.'
ఎంచరికని భూదానం
దాతలకే చాలందే ?

ఆంగ్రేజీ దొర బుర్ఖా
కాంగ్రేజీ తొడిగిందా
గాండీవం కలమై వా
గ్గేయాస్త్రం విసిరిందా?

—సవ్యసాచి.

ఉండడం ధర్మంకాదనిన్నీ, అది పాపకర్మ అనిన్నీ, సత్యమార్గమును అనుసరించేవానికి చాటుమాటు రహస్య విషయం, ఉండడం అసంభవం అనిన్నీ, ఆ సంపాదకీయ వ్యాసంలో కత్తివిరిచినట్లుగా, ఢంకామీద దెబ్బకొట్టినట్లుగా చాటించాడు. మర్మం వెంట మాయ ఛాయగా ఉంటుంది. జ్ఞానం అనేది తేజం. అది పట్టపగటి వెల్తురువంటిది. కటికచీకటి వంటిది కాదు. మర్మావయవములను కూడా మంత్రసాని విద్యా విశారదులయ్యేడివారికీ, వైద్యశిఖామణులయ్యేడివారికీ వివరించి బోధించగల విపుల గ్రంథములు అపారంగా ఉన్నాయి. అటువంటి సందర్భములో ఇటువంటి అద్భుత కూలంకష జ్యోతిష విషయ గ్రంథములను అంధకారంలో బంధించి ఉంచవలసిన అగత్యం ఉన్నదంటే అసత్యం. అచింత్యం. మర్మశాస్త్రంలోనే మర్మంలేని స్థితిలో యీ నాడీగ్రంథముల రహస్య నాడి అంతు చిక్కని గూఢ గమనంలో ఉండడం సజీవమైన సత్తా లక్షణంకాదు. ఏ గ్రంథానికైనా వకలు సకల జనోపయోగకరము. దానిలోని సత్యంవల్లనే దాని సత్తా ఉంటుంది. అది సత్యమై నిత్యమై ఉంటుంది. కాని, సత్తుగాని చిత్తుగాని లేనిది ఉత్త చెత్తయై చెదలకు భుక్తి అయితే, అదే దానికి బంధ విముక్తి అవుతుంది.

మన మంత్రశాస్త్రములు అతి రహస్యంగా ఉంచబడినవంటారు. నిజమే - అవి యోగవిద్యకు సంబంధించినవై యోగిపుంగవుల సాధనానుష్ఠాన యోగ్యములై ఉంటూ ఉండేవి. మనస్సు ఏకాగ్రచిత్తంగా ఉంటేనేగాని యోగియైనవాడు యోగశక్తి ప్రభావమును ప్రదర్శించలేడు. అందుకొరకై మనస్సు నిర్మలంగా ఉండాలి. ఆహార విహారములకు సంబంధించిన నియమనిష్ఠ కూడా ఉండాలి. మత్తుపదార్థములను సేవించేవానికి బుద్ధి నిర్మలంగా నిలుకడగా ఉండదు. మనస్సును కలవరపరచేటటువంటి ఉద్రేకములు, ఆవేశములు, వ్యామోహములు ఎంతవరకు అరికట్టగల్గితే అంత ఎక్కువగా బుద్ధిబలం ఎక్కువై యోగశక్తి ప్రబలమవుతుంది. కనుక బాహ్యాభ్యంతరశ్శుచి యోగసాధన చేసేవానికి చాలా అవసరం. ఇటువంటి అర్హతగాని యోగ్యతగాని ఉన్నటువంటివానికే యోగులైనవారు మంత్రోపదేశములు చేసేవారు. ఎందుచేతనంటే, అర్హత లేనివానికి తుపాకీ అమ్మినట్లవుతుంది. ఈ కారణంచేత యోగిపుంగవులు తమ మంత్రవిద్యలను రహస్యంగా ఉంచితే ఉంచియుండవచ్చు - కాని, ఆ విద్యను తమవద్దనే రహస్యంగా ఉంచి ప్రయోగించి ధనం సంపాదించాలనే నేరం వారికి ఆపాదించుటకు అవకాశము లవలేశమూ లేదు. అంతేగాక, అచ్చు యంత్రాలు లేనిదినములలో వివిధ శాస్త్ర గ్రంథాలతోబాటు మంత్రశాస్త్రగ్రంథాలు కూడా తాటియాకులమీదనే వ్రాయబడి చాటుమాటున ఏయింటి యజమాని అటక మీద్దనో అంతఃపురకాంతలవలె ఘోషాలో శోషిస్తూ ఉండేవి. గురువు లేకుండా సంగీత శాస్త్రగ్రంథసహాయంతో సంగీత విద్వాంసుడుకావడం ఏవిధంగా సాధ్యం కాదో, అదేవిధంగా గురువులేకుండా యోగశాస్త్ర గ్రంథంగాని మంత్రశాస్త్ర గ్రంథంగాని నమిలి నెమరువేయుటకు వీలైన తమలపాకుల కవిలె కట్టకాదు. ఆ కారణంచేతనే అవి రహస్యంగా, అతిరహస్యంగా, "భావమున జీర్ణమయ్యె సుభాషితంబు" అన్నట్లుగా అంతర్ధానమైనాయి. యోగులు గుహలలో దాగితే, యోగశాస్త్రం యోగుల హృదయ గహ్వరములలో దాగి వారి విభూతిభస్మంతో సమం అయిపోయింది. అదిన్నీగాక మన పురాతన గ్రంథము లనేకము తేనెతుట్టెల వలె అక్కడక్కడ దాచియుంచబడగా, తురుష్కులు, మొగలాయీలు, యవనులు ఆగ్రంథకోశములను నాశనం చేసిభస్మం చేశారు.

అయితే, గుట్టు అనేది లేకపోతే మంత్రమే కాదు, మందుకూడా పట్టివ్వదు. ఆ మాటలో ఘాటు లేకపోలేదు. బొట్టు కాటుక పెట్టి, కురులుదువ్వి విరులుచుట్టి, బుటాసిల్కు రవిక తొడిగి, జలతారు చీర కట్టి, బంగారు నగలతో సింగారించినట్లయితే, ముదిఅయిదువకూడా ముద్దులొల్కు ముదితయై మన్మథుని ఆరోబాణం లాగున, సర్వజన సమ్మోహనాస్త్రంలాగున, తిన వాడి వేడి లేడి చూపులతో దాడివెడలి, విరాగులనైన రాగులనుచేసి తన గులాములను చేయగలదు. అయిదోతనానికి మించిన ఆరోతనం ఆవేషంలో ఆకలికి తుటారి మిటారములలో ఉన్నదని అంగీకరించాలి. కొంత వశీకరణశక్తి వేషంలో ఉంది. అది వేషంలోనుంచి పుట్టిన సమ్మోహనశక్తి. అది వేషజం - అదే విధంగా భాషలో ఉండే మాధుర్యంవల్లను గాంభీర్యంవల్లను ఒక విధమైన వశీకరణశక్తి ఉద్భవిస్తుంది. అటువంటిశక్తిని భాషజం అనవచ్చు— కాని, వైద్యం చేసేవానికి వేషజం,

(52-వ పేజీ చూడండి)

రచయితలకు మనవి

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్‌పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతోనే చేర్చిపంపాలి.

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి. నెగటివ్‌లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి. రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం. ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెల్పియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎవ్విధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము.

— సంపాదకుడు.

[illegible]ల్లో గూనిబతుకు

"గుడారంలో నిదురించే సోల్జరూ! బడాయిలెందుకు పలుకుతావోయ్? బతుకిల్లా భగ్గుమంటుంటే అదీ, యిదీ సాధించాలంటూ ఆశలతో అర్జులు చాచుతావెందుకూ? కలగా పులగం కాయగూరల పులుసు త్రాగుతూ కలిగినంతలో సుఖంగా, తృప్తిగా ఉండడానికే ప్రయత్నించు! ఇంటావిడపైనా, ఆవకాయపైనా బెంగ పుడితే మేఘసందేశం పంపుకో! ఉదయానే హంద్రీనదిలో అఘమర్షణ స్నానమాచరించు! బిక్కమొహం పెట్టక కర్మాగారం రాజధానిలో రెక్కలు విరుచుకు పని చెయ్యి! భావిభాగ్యోదయం నీభుజస్కంధాలపై ఆధారపడి వున్నదని గుర్తు వుంచుకో! జై ఆంధ్ర!!"

మిత్రుడు రాసిన ఉత్తరం చదువుకొని నీరసంగా కుర్చీలో కూలబడ్డాడు హరీంద్ర. మద్రాసు సెక్రటేరియట్‌లో తనతోపాటు పనిచేసిన స్నేహితుడు ఇప్పటికి రెండు ఉత్తరాలు వ్రాశాడు. కాని, తనేం చేశాడు? ఒక్కటికూడా వ్రాయలేదు — ఇక్కడకు చేరుకున్న నాటినుంచీ తన జీవిత మొక యంత్రంలా తిరుగుతున్నది. అందులో కొట్టుమిట్టాడటం తప్ప తనకు బయటి ప్రపంచపు గొడవే పట్టదు.

జీవిత మెల్లకాలమూ పూలబాటలో పయనించదని ప్రభుత్వోద్యోగంలో పదేళ్లు అనుభవంకల్గిన హరీంద్రకు తెలియనిది కాదు. అయినా తన మాతృదేశాభ్యున్నతికై పాటుపడుతున్నానన్న ఆత్మసంతృప్తి అతనిలో కానరావడంలేదు. ఎందుకనో...

కొద్దిసేపట్లోనే ఇతర మిత్రులు మరికొందరు రావాలి, కార్యక్రమం ప్రారంభం కావాలి, లేకపోతే తెమకీరాత్రి గడవదు —

"రండి! రండి!! గానాబజానా లేకపోతే గుడారం చిన్నబోతున్నదిరా భాయీలూ!"

"అయితే ప్రస్తుతం మనం ఏకపాత్రాభినయం ప్రారంభించబోతున్నాం. చిల్లర మల్లర వేషాలన్నీ సిద్ధంకావాలి. అవసరాన్ని బట్టి అప్పర్, లోయర్ తరగతులవారిభయులూ చేర్చుకోబడతారు. తదనంతర కథాక్రమం చిత్తగించవలెను!"

"శివోహం. శివోహం"

"ఏమి స్వామీ! ఏమని సెలవు?"

"ఏమున్నదిరా శిష్యా, మానవులు కొందరు యదార్థం గ్రహించక అంతా తమ ప్రయోజనమనుకొని విర్రవీగుతూవుంటారు. కాని అదంతా నిర్హేతుకమని జ్ఞానదృష్టితో గమనించినవారికి అర్థమౌతుంది. అందుకనే యోగిపుంగవు లిలా ప్రవచించారు:—

"ఏనాడు ఏతీరో
　యెవరు చెప్పాగలరు
　　అనుభవించుట సిద్ధమన్నా!
హరిశ్చంద్రు డంతటివాడు
　అతివనింటిలో విడచి
డేరాలలో యేడ్చెరన్నా
　గుడారాలలో కూలెనన్నా!
　　　ఏనాడు..."

"బాగుబాగు, అయితేస్వామీ, అర్థాంతరంగా సంక్రమించిన యీ జీవిత యాతనకు తరణోపాయం ఉందంటారా?"

"లేదు నాయనా, లేదు — నా దృష్టికందినంతవరకు భవిష్యత్తు అగమ్యంగానే వున్నది, తరువాత భగవదిచ్ఛ."

"మిత్రమా! ఈరాత్రి మనకు శివరాత్రేనంటావా? హా! హతోస్మి! అంతదియింతాయింది. ఇంతది మరెంతౌతుంది స్వామీ!"

"ఎంతైనా కావచ్చునోయ్! అడిగినచోటనల్లా సర్వసౌభాగ్యాలూ వొనగూడి రావాలంటే యెలాగోయ్? 'ఒకచో నేలను బవ్వళించు నొకచో నొప్పారు పూసెజ్జపై' — కార్యసాధకుడు కష్టసుఖాలు లెక్కకు రానీయడు నాయనా!"

"త్యాగం చెయ్యాలంటారుగదా, యీ యాగానికి ఫలితమున్నదా స్వామీ?"

"నీ తలకాయున్నది — నా కసలే మలేరియా వెన్నున జీర్ణించింది. దానిబారినుండియెలా తప్పుకోవడమా? అనుకుంటుంటే, పొద్దున్న హెల్తాఫీసరు వచ్చి కలరా ఇంజక్షన్ పొడిచివెళ్ళాడు. అబ్బా... రెక్కలేవడం లేదు, ఒళ్లంతా పులకరించింది ఏం జెయ్యమంటావ్?"


"ఇంత మాత్రానికే దిగులుపడి చచ్చేవాడికి దేశభక్తి అంటే ఏమిటో తెలియదంటాను. ఎందరెందరు ఎన్ని త్యాగాలు చేస్తే మనమీనాడు యీ డేరాలో కూర్చోగలిగామంటావ్?"

"ఇంత తొందరలో యీరాష్ట్రం వస్తుందని తెలిస్తే పెళ్ళైనా మానుకొనేవాడినురా! ఇప్పుడు త్యాగం చెయ్యమంటే అది నావల్ల కాదురా భాయీ! — గొంతెత్తి ఆకాశం అవులించేలా అరుస్తాను.

"ప్రేయసీ, ప్రేయసీ,
　ప్రియుడనే ప్రేయసీ,
వేయికన్నులుదాల్చి
　వెదకుచున్నానే!"

"మనవాడిపని రసకందాయపు పట్టులోనే పడింది. నేనుమాత్రం యెందుకూరుకోవాలి?"

"ఓజాబిలీ, ఓవెన్నెల!
　ఓమలయమారుతమా!
ప్రియురాలికి విరహాగ్నిని
　వెంపుచేయుమా! —
ఎంతఘాటు ప్రేమయో..."



"ఇంటావిడపైనా, ఆవకాయపైనా బెంగపుడితే మేఘసందేశం పంపుకో."

"ఇన్నాళ్ళా సున్నానికీ, తమలపాకులకూ ఉన్న ఘాటు ప్రేమకు కూడా యెక్కించి మన ప్రాణాలు నిలువునా తోడేశారురా బ్రదర్."

[illegible]



"ఈ పట్నంలో కాలం గడవని వారి కాలక్షేపంకోసం హంద్రీనది అవతలిగట్టున."

"సోదరులారా! అచ్చమైన ఆంధ్ర రాష్ట్రంలో బ్రదర్ అనే పదానికి బటా చోర్ అని అర్థం చెప్పాలంటాను."

"నీ సాహిత్యాభిమానం మండినట్టే వుంది."

"ఎవడురా నా సాహిత్యాన్ని దూషించే ధూర్తుడు?"

"చిత్తం! చిత్తం, భావకవిగా రిక్కడ చాటుగా నక్కివున్నా రనుకోలేదు. వెలుగులోకి రండిసార్!"

"ఆకాశం అంబరమైతే
అవకాశం అందరికొకటే
పాయసమ్ము పట్టుకరావోయ్
వాయసాలు వచ్చేస్తాయోయ్"

"వీడికి నిజంగానే మతి చెడింది. రేపు పొద్దున్న గవర్నరుగారు సతీసమేతంగా విచ్చేసినప్పుడు మనవాడిని ముందు పెట్టుకొని గుడారాల సువ్వరం వెల్లించుదామంటారా స్వామీ?"

"శివోహం"

"జై! పరమేశ్వరీ లైన్ సర్కస్ కీ జై! అయ్యా సమస్తమైనవారికీ తెలియజేసేదేమనగా—ఇక్కడ, యీ పట్నంలో, కాలం గడవక, నిద్రపట్టక, అర్థరాత్రులు మేల్కొని ఉండేవారందరికీ, వినోదంకోసం విలాసంకోసం హంద్రీనదికి అవలిగట్టున ఎగ్జిబిషన్, ఏర్పాటు చేయపమైన దోహోయ్!"

"ఇదేదో మన ప్రాణానికి అమృతం వర్షిస్తున్నట్టుంది. వెడదాంరా భాయీ?"

"బాగు, బాగు - ఇదొక యెత్తోయ్, దొంగ వెధవలు. మనమంతా అక్కడకు చేరుకోగానే మూక ఉమ్మడిగావచ్చి మన గుడారాలు దోచుకోడానికి పన్నిన పన్నాగ మిదంతా—"

"ఇక్కడ దొంగతనాలంటావేమోయ్, పరువు తక్కువ-మన కేసరి గర్జారావం వినలేదేమో ..దొంగవెధవలు."

"అదంతా మనకే సరి - ఇక్కడ దొంగతనం మంచి పకడబందుగా జరుగుతుందని విన్నాము - ఒకడు ఇంట్లో దోచుకుంటూంటే నాలుగువైపులా నలుగురూ పహారాలు కాస్తుంటారట, రోకళ్లతోను, పచ్చడి బండలతోను—"

"శివోహం, శివోహం—"

"ఆగండాగండి! మనమీదికేదో దాడి వస్తున్నట్టుంది. అందరం కలసి యెదుర్కోవాలి. ఇన్‌క్విలాబ్ జిందాబాద్"

"శివోహం! శిష్యులారా. ఏమిటీ గడబిడ?"

"స్వామీ, మీ కింకా తెలియనేలేదా? అవిగో చూడండి! ఈ పట్టణంలో వున్న గాడిదలన్నీ కలిసి కట్టుగా మనమీదకు దాడి వెడలుతున్నయ్, ఎదుర్కోవాలి!"

"అందరం వొక్కపెట్టున ఎదురువెళ్లి ఓంప్రపెట్టాలి!"

"లాచిక పుల్లలూ పిట్టచితకులూ పోగుచెయ్యండి! మరేమున్నాయోయ్? బ్రహ్మచారిగాళ్లకు పచ్చడి బండలన్నా లేవు"

* * *

"వాటిని తిప్పికొట్టేసరికి ప్రపంచ సంగ్రామ మంతయింది!"

"ఒరే భాయీ! నిజం చెప్పమంటావా? అబద్దం చెప్పమంటావా?"

"ఏదో వొకటి తొందరగా అఘోరించవోయ్!"

"ఈ దురాక్రమణను అవియెన్నడూ సహించవు! ఈ బంగరుభూముల్లో మనం కులుకుతూ కాపరాలు వెలగబెట్టాలంటే, అవి మరోకచోటుకు వలసపోతయ్యా? ఈ వూరు వాటిది మాత్రం కాదురా!"

"చంపావ్ పో! ఈ మాట బిగ్గరగా



"ప్రకృతి ప్రయోగించిన అగ్ని మండలం."



"ఈ యాతనా ప్రపంచాన్నుంచి బయటపడాలంటే మనల్ని బ్రతికించే సంజీవికొండలు రెండు ప్రభుత్వానికి అండగావున్నయ్!"

అంటే మనకు పుట్టగతులుండవ్. అదిగో ఆ కనుపించేది సెక్రటరీగారి బంగళా - తెలుసునా?"

"అందుకనే - యీ సైన్యాన్ని అటు మళ్లించాం."

"ఇదుగిదిగో ఇటుచూడు! నా పెడమీద ఏదో పాకుతున్నట్టున్నది."

"ఓహూ-ఇంకేమున్నది? మనపై ప్రకృతి ప్రయోగించిన అగ్నిమండలం - (పురుగు)- ఏం వొళ్లంతా మంటలు పెట్టడం లేదు కదా! ఒరే బ్రదర్, రేపట్నించి మనమొక పనిచేస్తూ వుండాలి, ఏమిటంటావా? ఒక అర్థమణుగు చింతపండు పులుసు కలిపి అట్టే పెట్టుకోవాలి!"

"ఇదేమిటోయ్ కొత్తపద్ధతి మొదలు పెట్టావ్?"

"నీకు తెలీదులే, వర్షాలు అధికంగాపడిన దగ్గిర్నుంచీ రుబ్బి మందలు మందలుగా మనమీదకు దాడి జరుపుతూవుంటయ్, అప్పుడీ పులుసు పట్టిస్తే - ఇక చూసుకో, చచ్చి స్వర్గానవున్న తెలుగు పెద్దలంతా ఒక్క దెబ్బలో కనబడతారనుకో..."

"మనంకూడా వాళ్ళలో చేరాలంటావా?"

"చేరగానే సరికాదు, మనం చేరటం, యీ రాజధాని మారటం ఒక ముహూర్తానే జరుగుతయ్, నామటుకు నేనిలా గానం చేసుకుంటాను—

"ఏను మరణించుచున్నాను
ఇటు నశించు
నాకొఱకు చెమ్మగిలు నయనమ్ము
లేదు

★ గుడారాల్లో గూనిబతుకు ★

నా మరణశయ్యాపరచుకొన్నాను
నేనె
నేనె నాకు వీడ్కోలుపు
విన్పించినాను.
ఇదియె నాచితి..."

"ఆగుమాగుము ధూర్తుడా! పెండ్లిపందిరిలో తద్దినం మంత్రాలు మొదలు పెట్టావేమిరా?"

"లేక చావమంటావురా భాయీ? వాడింకా భూమిని పట్టుకు దేవుళ్ళాడుతున్నాడు, నేను స్పెషల్ ట్రైనులో స్వర్గపురానికి చేరుకొన్నాను.

"దిగి రాను దిగి రాను
దివినుండి భువికి
నాయిచ్ఛయేగాక
నాకేల వెఱపు?"

"స్వర్గమంటే మరెక్కడో వున్నదని భ్రాంతి పడుతున్నాడు మన సోదరుడు. మనం ఏనాడు మద్రాసులో స్పెషల్ రైలు ఎక్కామో...ఆనాడే స్వర్గపురానికి మన ప్రయాణం ప్రారంభమైనదన్న మాట! 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'!"

"ప్రస్తుతం మనవాడి స్వర్గప్రయాణాన్ని తెలియజేస్తూ శ్రీమతి కోక టెలిగ్రాం యివ్వటం మంచిదేమో..."

"అంతకంటె ఆతురసన్న్యాసం పుచ్చుకొని ప్రపంచంతో సంబంధం లేక ఏమూలనైనా పడిపోవటం మంచిదేమో?"

"వెరీగుడ్! ఇంత మంచి ఆలోచన తట్టినందుకు నిన్ను వేయివిధాల అభినందిస్తున్నాను. సన్న్యాసాన్ని గూర్చిన ప్రాస్పెక్టస్ కావాలి అంటె, స్వామీ సీతారాం దగ్గర్నుంచి ఇప్పుడే తెప్పించుతాను"

"అంతకంటె పొట్టి శ్రీరాములుగారికోక ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం కొట్టడం అవసరమంటాను. ఏమంటారా? 'కడుపులో నీళ్లు కదలకుండా ఏ సీమలోనో బ్రతికే మనుష్యుల్ని - రాష్ట్రం సాధించి యిక్కడికెందుకు తరలింపజేశారూ?' అని"

"ఒకే బ్రదర్! ఒక్క విషయం ఋచ్చితంగా చెబితే నీనోరు కట్టడుతుందేమో..."

"ఏడిశావులే - నోరు కట్టెయ్యడమంటే గుడారం కట్టినంత తేలిక అనుకున్నావా?"

"విను, విను: మనకసలు చావనేదే ఉండదు. ఒక వేళ యీ యాతనా ప్రపంచాన్నుంచి బయటపడాలని అంతపని చేసినా, మనల్ని బ్రతికించే సంజీవికొండలు రెండు ప్రభుత్వాని కండగా నిలబడివున్నయ్!"

"ఇంత చేటుగా వాగుతున్నందుకు మనవాడి గొంతులో గుక్కెడు తులసినీళ్లు పొయ్యండిరా!"

"బాగు, బాగు! ఆమాటను మనవాడు సాభిప్రాయంగానే వదిలాడంటాను. మామూలు మంచినీళ్లు అష్టమైనచోట్లా త్రాగుతుంటే కలరామతల్లి కౌగలించుకుంటూందని, అందులో తులసిదళాలు నానేస్తున్నారు-క్రిమి సంహారంకోసం!"

"ఎవడికివాడు క్రిములు, కీటకాలను చంపుకోవడమేనా? ప్రాణం కడట్టియేడ్చే పాపాయికి జోలపాడడం వున్నదా?"

"అదేదో నువ్వే మొదలుపెట్టు! మేమంతా వంతపాడుతాము."

"హు...ళ-ళ-ళ-హాయీ! -
ఏడవకు ఏడవకు
మాచిట్టి పాపాయి!
ఏడిస్తె నిన్నెవ్వ
రెత్తుకొంటారూ?
మద్రాసు గిద్రాసు
మరి వదలిపోయింది
తుంగభద్రమ్మ నీ
తొట్టికట్టిందీ...హాయీ"

"అనగనగా ఆంధ్రసీమా
అందమైనా కందనోలూ
అమరెనోయీ!"

"ఏడ్చావంటే, తాతయ్యను పిలుస్తానమ్మాయ్ - నిన్నకాక మొన్నపుట్టి ఇంతగడుసుతనమాబ్రీ! అసలు నీకోరి కేమిటో చెప్పు!"

"దానికి కోరికలు చాలా వున్నయ్ రా తమ్ముడూ! పక్కకింద పలుగురాళ్ళాయె, సుఖనిద్ర యెలా పడుతుందీ?"

"దానికి పూర్వజన్మస్మృతి పూరాగా వున్నది. ఒకప్పుడు మహోన్నత సామ్రాజ్య వైభవంలో ఆకాశమంటి, ఇప్పుడు, ఇక్కడ - గులకరాళ్ల గలగలలు వింటూ గుడారంలో గూని బ్రతుకు బ్రతికమంటే అదెలా వొప్పుకుంటుందోయ్?"

"చీమలు పెట్టిన పుట్టల్లో పాములు దూరగలవు గానీ కేసరు లెలాయివడగలవోయ్?"

"చీమలపేరు చెప్పుకొని బ్రతికే హక్కు మనకసలు లేదంటాను. మనకంటె అవి యెప్పుడూ, ఒక అడుగుముందు వుంటయ్. అనువైనచోట, ఆహారం దొరికేచోట ఆశ్రయం వెతుక్కుంటయ్. గూని బ్రతుకంటే సుతరాముగిట్టదు, రాజకీయాల పేరుతో బ్రతికే వాజమ్మలు వాట్లలో తక్కువ - తలకొక పెత్తనం అంతకంటే సున్న. నిజమేనంటారా స్వామీ?"

"శివోహం"

"మనది పురోగమనమా తిరోగమనమంటారా గురూ?"

"త్రిశంకు గమనంలా తోస్తుందోయ్! అంతా వట్టి విశ్వామిత్ర సృష్టి"

"పిడివాదం పెట్టినభిక్ష
నడినెత్తిన మోపినకక్ష
ఏదీ నీవాదన శిక్ష?
ఏదీ నీజాతికి రక్ష - -"

"కీలు గుఱ్ఱముమీద
బాలీసు వేసుకొని
ప్రాణాలు లేనట్టి
భగవంతుడొచ్చాడు
మానావమానాలు
దానమివ్వండిరా!
గానా బజానా
సాగించ రండిరా!!"

"కొక్కొరో - కో -"

"తెల్లవారెను కోడికూసెను
పిల్లలందరు గొల్లునేడ్చిరి
పులుగులకు పాటలను నేర్పే
తెలుగు వీరుడ మేలుకో -"

"ఎడారిజీవిత మెదురైనది లే
గుడారమేయిక గతియైనది లే" *



కొంతకాలం కిందట ఒక డిపార్టుమెంట్‌లో - ఏ డిపార్ట్‌మెంట్‌లోనని మీరు అడగకూడదు, నేను చెప్పకూడదు. ఈ డిపార్టుమెంట్లు, రెజిమెంట్లు, కోర్టులు, ప్రభుత్వశాఖలు ఇవన్నీ వున్నాయే, వీటిని యీ రోజుల్లో ఏమనడానికి వీల్లేకుండా పోతోంది. ఏ ఉద్యోగిని పల్లెత్తుమాట అన్నా సరే, దేశమంతటినీ అవమానించినట్లు భావిస్తాడు. ఈమధ్యనే ఒక జిల్లాపోలీసు అధికారి పై అధికారులకు ఒక ఫిర్యాదు పంపిస్తూ, ప్రభుత్వశాఖలన్నీ భ్రష్టమైపోతున్నాయనీ, ఆఖరికి జార్ చక్రవర్తిగారు కూడా ప్రజల నోళ్ళలో పడి భ్రష్టులవుతున్నారనీ అన్నాడు. దీనికి ఋజువుగా ఆయన తన ఫిర్యాదుతోపాటు ఒక రొమాంటిక్ నవలకూడా జతచేసి పంపించాడు. ఆ నవలలో ప్రతి పది పేజీలకీ ఒకసారి చొప్పున జిల్లాపోలీసు అధికారి రప్పించబడ్డాడనీ, ఆ రప్పించబడ్డంలో కూడా సురాపానంతో వొళ్ళూపయీ తెలియని స్థితిలో రప్పించబడ్డాడనీ అతగాడు ఫిర్యాదు చేశాడు. అందుచేత అనవసరంగా ఇటువంటి మనస్తాపాలెవరికీ కలగకుండా, ఇందాక నేను పేర్కొన్న డిపార్ట్‌మెంట్‌ని “ఒకానొక డిపార్ట్‌మెంట్” అని ఉదహరించడమే మంచిది. ఆ “ఒకానొక డిపార్ట్‌మెంట్‌లో ఒకానొక ఉద్యోగి వుండేవాడు. ఆట్టే చెప్పుకోదగినంత మనిషేమీ కాదు; పొట్టిగా వుంటాడు; వొంటినిండా స్ఫోటకం మచ్చలు, ఎర్రటిజుట్టూ, బట్టతలా, ముడతలు పడిన దవడలు, కందగడ్డలాగ జేవురించిన వొళ్ళు, ఇత్యాది విలక్షణాలు కలిగిన మనిషి. అతనికిలాంటి ఆకారం కలగడానికి సెంట్ పీటర్స్‌బర్గ్ వాతావరణమే కారణం. ఇక అతని ఉద్యోగం - (మన రష్యన్లకి ఉద్యోగం సంగతి చెబితేగాని ఆమనిషి చప్పున అర్థంకాడు) అతడు ఆ డిపార్ట్‌మెంట్‌లో గుమాస్తాగిరీ వెలిగిస్తున్నాడు. నోరులేనివాళ్లని పట్టుకుని విమర్శించడం అనూచానంగా వచ్చే సత్సంప్రదాయం గనక కొందరు రచయితలు ప్రత్యేకించి యీ పదవిని పట్టుకుని ఏడిపిస్తూ వ్రాయడం అందరూ ఎరిగినదే.

> ## నికొలాయ్ గొగోల్
>
> 1809 నుండి 1852 వరకూ జీవించిన రష్యన్ రచయిత. నవలలు, కథలు, నాటకాలు వ్రాశాడు. రష్యన్ సారస్వతంలో వాస్తవికతను ప్రారంభించిన మూలపురుషుల్లో ఒకడు. ఆనాటి రష్యన్ నిరంకుశత్వం గొగోల్ రచనలతో గగ్గోలు పడింది. ప్రస్తుత అనువాదానికి అతని “దిక్లోక్” (‘కోటు’) అనే కథ ఆధారం. “మనమంతా గొగోల్ కోటులోంచి వచ్చిన వాళ్లమే” అని ఒక రష్యన్ రచయిత చమత్కరించాడు.

ఆ గుమాస్తా యింటిపేరు బాష్‌మాచ్‌కిన్. ఈ పేరు బహుశా బాష్‌మాక్ (బూట్లు) అనే మాటనుంచి వచ్చివుంటుంది; ఎప్పుడు, ఏ కాలంలో, ఏవిధంగా వచ్చిందో మటుకు చెప్పలేను. మనకున్న చారిత్రికాధారమల్లా, అతని తండ్రీ, తాత, ముత్తాత, అసలు బాష్‌మాచ్‌కిన్ వంశస్థులందరూ నిత్యమూ బూట్లు తొడుక్కునేవాళ్ళు; వాటికి ఏడాదికి రెండుమూడుసార్లు అడుగు వూడిపోవడం, తిరిగి వేయించుకోవడం జరిగేది. అతని పేరు అకాకీ అకాకి యెవిచ్. పాఠకులకి యీ పేరు చిత్రంగాను, తెచ్చిపెట్టుకున్నట్టుగాను కనిపించవచ్చు. కాని

అనువాదం: నండూరి రామమోహనరావు

★ శని దేవత రథ చక్రం ★

అది ఏమాత్రమూ తెచ్చిపెట్టుకున్న పేరు కాదనీన్నీ, మరో పేరు పెట్టడానికి వీల్లేని అసాధారణ పరిస్థితులు ఏర్పడడంవల్లనే ఆ పేరు పెట్టవలసి వచ్చిందనీ నేను నిర్ధారణగా చెప్పగలను.

ఆ అసాధారణ పరిస్థితులివి: నాకు జ్ఞాపకమున్నంతవరకూ, అకాకీ అకాకియెవిచ్ మహాశయుడు మార్చి 28 వ తేదీ సాయంత్రం పుట్టాడు. అతని తల్లి ఒకానొక ప్రభుత్వోద్యోగి భార్య; మంచిమనిషి. తన కుమారుని నామకరణ మహోత్సవానికి అన్ని యేర్పాట్లూ చేసింది. ఆ సందర్భానికి చుట్టాలు పలువురు హాజరయ్యారు. చుట్టాలు ఎన్ని పేర్లు

సూచించినా వొక్కటీ ఆవిడకి నచ్చలేదు. "ఛీ, ఏం దరిద్రపు పేర్లు! ఇది నా ఖర్మ గాకపోతే అన్నీ వెధవ పేర్లే మా నోటికి రావాలా?" అని విసుక్కుంది ఆ తల్లి. "ఇక వీడికి వీడి తండ్రి పేరే గతి. ఆయన పేరు అకాకీ. వీడికీ ఆ పేరే పెడదాము," అన్నది. ఈరీతిగా పైన పేర్కొనబడిన గుమాస్తాకి అకాకీ అకాకియెవిచ్ (అకాకీ కుమారుడైన అకాకీ) అనే పేరు పెట్టబడింది. ఈ పేరు పెట్టేటప్పుడు అభం శుభం తెలియని ఆ శిశువు తను కూడా తండ్రిలాగానే గుమాస్తా కాబోతున్నానని దివ్యదృష్టితో గ్రహించినవాడిలాగ గొల్లున ఏడ్చాడు.

ఈవిధంగా అతని కాపేరు వచ్చింది. నేనేమీ అతిశయోక్తులు చెప్పలేదనీ, ఇంకే పేరూ పెట్టడానికి వీల్లేకనే అతని కాపేరు పెట్టారనీ పాఠకులకు విదితం కాగలందులకే యీ వుదంతం వ్రాయవలసివచ్చింది.

అతడు ఎప్పుడు ఎలా ఆ డిపార్ట్‌మెంట్‌లో ప్రవేశించాడో, అతని కెవరు వుద్యోగ మిచ్చారో, వగైరా వివరా లెవరికీ తెలియవు. ఎంతమంది డైరెక్టర్లు, అధికార్లు మారినా, అతడు మాత్రం మారలేదు. అదే స్థలంలో, అదే భంగిమలో, అదే పనిలో కనిపించేవాడు. అతనిపని ఉత్తరాలకు నకళ్లు వ్రాయడం. అతన్ని చూసి చూసి కొందరు అతడా వేషముతోనే, ఆ బట్టతలతోనే పుట్టాడనికూడా నిర్ధారణ చేశారు. ఆ డిపార్ట్‌మెంట్‌లో అతన్ని మర్యాదగా చూడ్డం ఎవరికీ అలవాటు కాలేదు. ఆఖరికి గేటు దగ్గర బంట్రోతు కూడా అతడు లోనికి వస్తుంటే నుంచునేవాడు కాదు; అతనికేసి చూడనైనా చూసేవాడుకాదు; పక్కనించి పురుగు పోతుంటే ఎలా వూరుకుంటాడో అలా వూరుకునేవాడు. అతనిపై అధికారులు జబర్దస్తీగా ప్రవర్తించేవారు. హెడ్ గుమాస్తా మోచేతికింది నీళ్ళుతాగే అసిస్టెంటు ఒకడొచ్చి, తలవంచుకుని వ్రాసుకుంటున్న అకాకీ బల్లమీద ఒక కాగితం పడేసి—"ఇది కాపీ చెయ్యి," లేక "ఇవ్వాళ మంచి వుత్తరం వచ్చింది, చదివి చూడు," అని మాట్లాడించనైనా మాట్లాడించకుండా వెళ్ళిపోయేవాడు. అకాకీ వంచిన తలఎత్తకుండా, అది అక్కడ పడేసిన దెవరో, అలా పడేసే అధికారం ఆ మనిషికుందో లేదో ఆలోచించకుండా, ఆ కాగితం తీసుకునేవాడు. వెంటనే కాపీ చెయ్యడం మొదలెట్టేవాడు.

ఆ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే యువక ఉద్యోగులు, తమ అధికారపు హోదా వీలిచ్చినంతవరకూ, అతన్ని వేళాకోళం చేసేవారు; అతడు వింటుండగానే అతన్ని గూర్చి కట్టుకథలు చెప్పుకునేవారు; ముఖ్యంగా అతని యింటి యజమానురాలు డెబ్బయ్యేళ్ల ముసలావిడకీ అతనికీ గల సంబంధాన్ని గూర్చి చర్చించేవారు; ఆవిడ అతన్ని రోజూ చావగొట్టి చెవులు మూస్తూవుంటుందని ప్రచారం చేసేవారు; "పెళ్లెప్పుడు మహానుభావా?" అని మొహానే అడిగేవారు; నెత్తిమీద కాయితం ముక్కలుపోసి 'మంచు' అనేవారు. అకాకీ అన్నిటినీ సహించేవాడు; తన పక్కన మనుషులే లేనట్టు కిక్కురుమనకుండా తన పని తను చేసుకుపోయేవాడు. చుట్టూ ఇంత పరాభవ కోలాహలం రేగుతున్నా, అతని వ్రాతలో ఒక్క తుడుపు, ఒక్క తప్పు వచ్చేదికాదు. కాని మిత్రుల వేళాకోళం హద్దుమీరిపోయినప్పుడు మాత్రం - అంటే, తలపట్టుకుని వాళ్ళు కుదిపి కుదిపి చంపుతూ పనికి అడ్డం వస్తున్నప్పుడు మాత్రం, అతి హీనస్వరంతో "నన్నెందు కేడిపిస్తారు? నన్ను పనిచేసుకో నివ్వండి," అని వేడుకునేవాడు.

ఆ వేడుకోవడంలోనూ, అకాకీ కంఠస్వరంలోనూ ఏదో అవ్యక్తమైన బాధ ప్రతిధ్వనించేది. ఒకసారి ఒక యువకుడు కొత్తగా ఆఫీసులో చేరాడు. ఇతరులను చూసి తనుకూడా అకాకీని ఏడిపించడం నేర్చుకున్నాడు. కాని అకాకీ వేడికోలు మాటలు వినగానే, హఠాత్తుగా ఆగిపోయాడు. తనచుట్టూ వాతావరణం హఠాత్పరిణామం చెందినట్టు అనిపించింది. పెద్దమనుషులు, మర్యాదస్థులు అని భావించి తను స్నేహంచేసిన స్నేహితుల నిజస్వరూపం ఒక్కసారిగా బయటపడినట్టు రోతపుట్టింది. ఆ తరవాత చాలరోజుల వరకూ, ఎంత సంతోషంతో కేరింతలు కొట్టే సమయంలోనైనా సరే, ఆ పొట్టి బట్టతల గుమాస్తా, "నన్నెందు కేడిపిస్తారు? నన్ను పనిచేసుకో నివ్వండి," అనే ములుకులవంటి పలుకులు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చి హృదయం కదిలి గంభీర వదనుడయ్యేవాడు. అకాకీ కంఠస్వరంలో "నేను నీతోటి మానవుణ్ణి సుమా!" అనే హెచ్చరిక వినిపించేది. ఆతరవాత ఎన్నోసార్లు మనిషిలోని అమానుషత్వం కనిపించినప్పుడల్లా నిలువెల్లా వణికిపోయేవాడు. గౌరవనీయుడని ప్రపంచం భావించే మనిషిలోనే, చదువు, సంస్కారం, తెలివితేటలు వీటి పొరలకింద దాగి బుసలుకొట్టే విషసర్పం కనిపించినప్పుడల్లా కళ్ళకి చేతు లడ్డం పెట్టుకుని శరాఘాతం తిన్నట్టు తొలగిపోయేవాడు.

ఉద్యోగంకోసమే బ్రతికే అకాకీలాంటి మనిషిని ఇంకొకణ్ణి చూపించడం కష్టం. అకాకీ ఉత్సాహంతో పనిచేసే వాడంటే చాలదు; అల్లారుముద్దుబిడ్డను సాకుతున్నంత ప్రేమతో తన పనిని సాకేవాడు. ఉత్తరాలకు నకళ్లు వ్రాయడంలో అతనికి మనశ్శాంతి లభించేది. ధ్యాన సమాధిగతుడైన యోగిలాగ అతని ముఖంపై ఆ ప్రశాంతి వెల్లివిరిసేది. కొన్నిరకాల ఉత్తరాలంటే అతనికి ప్రాణం లేచివచ్చేది. వాటిని చూడగానే అక్షరాల పరదాలు తొలగించుకుని మందహాసం తొంగిచూసేది. ఒక్కొక్క మాటా కూడబలుక్కుంటూ, అతని ముఖంలోనే ప్రతి అక్షరం ప్రతిఫలిస్తున్నంత ఏకాగ్రతతో వ్రాసేవాడు. అతని ఉత్సాహంతో తులదూగేటంత జీతమే అతనికివ్వాలని నిర్ణయిస్తే, ఈపాటికి అతడు శాసనసభ్యుడయిపోయేవాడు. కాని పాపం, అతని సహోద్యోగులన్నట్టు, కేవలం గానుగెద్దులాగ తన గాడిలోనే తిరుగుతూ పని చేసేవాడు.

అయితే, అతన్నందరూ వట్టి నిర్లక్ష్యభావంతో చూసేవారని చెప్పడానికి వీల్లేదు. ఆ డిపార్ట్‌మెంట్‌లోని ఒక డైరెక్టరుకు అకాకీమీద ఎందుకో దయ కలిగింది. అతని సేవానిరతిని మెచ్చుకున్నవాడై, కేవలం నకళ్లువ్రాయడంకంటె ముఖ్యమైన పని ఇవ్వాలని భావించాడు. తదనుగుణంగా, ఇంకొక డిపార్ట్‌మెంట్‌కు ఒక నివేదిక తయారుచేసి పంపించమని ఆజ్ఞాపించాడు. ఈ పనిలో కష్టమేమీ లేదు; హెడ్డింగ్ మార్చడం, ఉత్తమపురుషనుంచి ప్రథమ పురుషకు వాక్యాలు మార్చడం తప్ప ఇంకేమీ చేయనక్కరలేదు. కాని ఈపని చెయ్యబూనేసరికల్లా, అకాకీకి ముచ్చెమటలు పోశాయి; చెమట తుడుచుకుని "సార్! ఇది వద్దులెండి. ఏదన్నా కాపీ చెయ్యడానికివ్వండి," అని వేడుకున్నాడు. అందుచేత అతనికి నకళ్ళువ్రాసే ఉద్యోగమే ఖాయపరిచారు.

నకళ్ళు వ్రాయడం తప్పించి అతనికి మరో ప్రపంచమే లేదు. తన బట్టల్ని గూర్చి ఆలోచించేవాడే కాదు. ఆ బటలకి పోనుపోను ముక్కిపోయి పులుసుగా, పులమగా తయారయ్యే రంగు వచ్చింది. కాలరు కిందికి వాలిపోయివుండేది. అందుచేత అతని మెడ అట్టే పొడుగ్గా లేకపోయినా, పొడుగ్గావున్నట్టు కనిపించేది. అదీగాక అతని కోటుకు ఎప్పుడూ గడ్డిపరకో, కాయితం ముక్కో, ఏదో ఒకటి అంటుకుని వుండేది. పైగా ఒక విషయంలో అతనికి నేర్పువుండేది—వీధిలో నడుస్తూ,

(48-వ పేజీ చూడండి)

గాడి తప్పిన జీవితం

మహత్తరమైన కార్యాల వెనక మహత్తరమైన కారణాలే ఉండే నవసరం లేదు. స్వల్పాతి స్వల్పమైన కారణాల వలన మహత్తరమైన కార్యాలు జరగటం అపురూపమేమీ కాదు. కైకేయి ఆ చిన్న వరాన్ని దశరథుణ్ణి అడగకుండానే ఉన్నట్లయితే, రామాయణాన్ని మరొక రకంగా వ్రాయవలసి వొచ్చేది వాల్మీకి. ధర్మరాజు జూదంలో ఓడిపోక పోయినట్లయితే భారతం మరొకవిధంగా నడిచి ఉండేది. హరిశ్చంద్రుడు ఆ వాగ్దానం విశ్వామిత్రుని కివ్వకుండా ఉన్నట్లయితే, హరిశ్చంద్రుని చరిత్ర మనకు తెలుసుకో వలసిన అవసరం ఉండేదనిపిస్తుంది. అంత మాత్రంచేత, ప్రతి స్వల్పకారణమూ, గొప్ప కార్యాలను సాధిస్తుందనీ కాదు; గొప్ప గొప్ప కార్యాలకు గొప్పగొప్ప కారణాలు ఉండవనీ కాదు. 'కారణం'యొక్క చిన్నా, పెద్దా తారతమ్యాలకంటే, 'కారణం' చుట్టూ ఆవరించివున్న వాతావరణం ఎక్కువ ప్రాముఖ్యత వహిస్తుంది. అప్పటి సందర్భమూ, ఆ సందర్భం వెనక నున్న పరిస్థితులుగూడా అత్యంత ప్రధానము లవుతాయి.

* * *

ఒకప్పుడు శివయ్య కేలోటూ లేదు. పాతిక ఎకరాల పల్లపు పొలం వుంది. పెద్దలు కట్టించిన లంకంత లోగిళ్లు రెండున్నాయి. కాస్తో కూస్తో వడ్డీమీద తిరుగుతున్నది. జత ఎడ్లు, ఒక జీతగాడు, ఊళ్లో గౌరవము - ఇవన్నీ ఉన్నాయి. శివయ్య జీవిత శకటం హాయిగా నడుస్తున్నది. అతని కితర బాదరబందీ లేవీ లేవు. ఒకళ్ళ జోలీ శొంఠీ పట్టించుకోడు. అతని కెవ్వరూ విరోధులు లేరు. అత నెవరికీ విరోధి కాడు. అటువంటి శివయ్య రెండు సంవత్సరాలు తిరిగొచ్చేసరికి ఎందుకూ కొరగాని వాడయ్యాడు. అతనంటే ఎవ్వరికీ గౌరవం లేకుండాపోయింది. అతను అన్ని విధాలా దాదాపు పతనం పొందాడు. న్యాయంగా అయితే ఆ సమయాన అతని కెంతో సానుభూతి సమాజంవల్ల లభించవలసి ఉంది. ఆ విధంగా తన కర్మముంచే తారా పథంనుండి అగాధంలోకి కూలిపోయినవారిపట్ల సమాజం సానుభూతి చూపి తీరుతుంది. కానీ శివయ్య పీటికినోచుకోలేదు. అతని పతనం చూసి విచారించిన వాళ్లు లేకపోగా; సంతోషించని వాళ్ళుకూడా లేరు.

అయితే యిది అచ్చగా సమాజం తప్పు కానే కాదు. సమాజాని కొక కొలతబద్ద ఉన్నది. అది సజావైనదా, కాదా అన్న విషయం వేరు. ఒక్కొక్కరి దృష్టి కది మంచి కొలబద్ద కాకపోవొచ్చు. కానీ సమాజం తన కొలబద్దమీద గట్టి నమ్మకముంచుకొన్నది. దాని దృష్టికది ఉత్తమోత్తమమైనది. ఆ బద్దతో అది కొలుస్తుంది. సరిపోతే మంచివాడంటుంది. లేదో? అంత దౌర్భాగ్యుడు మరొకడు లేడంటుంది. సర్వదా అటువంటివాడి పతనం కోసం నిరీక్షిస్తుంటుంది. సర్వనాశనం చేయాలని సర్వశక్తులనూ కూడగట్టుకొని సర్వప్రయత్నాలూ చేస్తుంది. వీటన్నింటినీ అధిగమించి నిలబడతారనుకో. అప్పుడు మేరుసమానధీరు డంటుంది. నెలబడి మట్టికరిచాడనుకో, గుణశిక్షణ మయినందుకు సంతసిస్తుంది. సమాజానికి రెండువిధాలా లాభమే మరి!

శివయ్య చేసిన పని సమాజం అభినందించలేనట్టిది. అందుకే అతని పతనాన్ని చూసి జేజేలు కొట్టిందది. ఆ తరవాత శివయ్య చాలా పశ్చాత్తాపపడ్డాడు. కాని చేయిమించిపోయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకొంటే ప్రయోజనమేముంది?

"అత నారాత్రి ఆ నాటకానికి వెళ్ళకుండా ఉన్నట్లయితే ఈ గొడవ రానే రాదు. ఇంత డబ్బూ నష్టపడేవాడు గాడు. ఇంతకూ శివయ్య కొంప నిలువునా ముంచింది ఆ పాడు నాటకం" అంటుంటారు ఇప్పటికీ ఆ ప్రాంతాల్లో.

వాళ్ళన్న మాట ఒకరకంగా నిజమే! నిజంగా శివయ్య గనక ఆ రాత్రి నాటకానికి వెళ్ళకపోతే ఏ చిక్కూ ఉండకపోను. అతన్నిగురించి అనుకోవలసిందీ ఉండేదు. అయితే ఆ రాత్రి శివయ్యతోబాటు ఇంకా కొన్ని వందలమంది ఆ నాటకానికి వెళ్లారు గదా? వాళ్ళందరకూ చుట్టుకోని చెడవ ఒక్క శివయ్యకే చుట్టుకోవాలా? వాళ్లందరకీ లేని పతనం ఒక్క శివయ్యకే వచ్చిందా?

లేదు గానీ శివయ్యకూ మిగతా వాళ్ళకూ అక్కడే కొంచెం భేదమున్నది. మిగతా వాళ్ళు నాటకం చూసి ఇంటి కొచ్చారు. శివయ్య అందులో హీరోయిన్ వేషం వేసిన దానింటి కెళ్లాడు. ఆ క్షణంనుండే ప్రారంభమైంది పతనం. రెండు సంవత్సరాల్లో చెప్పుకోదగ్గ పరిణామాలు బోలెడన్ని జరిగాయి. ముఖ్యమైన దేమిటంటే; హఠాత్తుగా శివయ్యకు నాటకకళమీద అభిమానం పుట్టుకొచ్చింది. స్వంతంగా ఒక కంపెనీ పెట్టాడు. చాలా నాటకాలాడించాడు. ఈనాడు సినిమారంగంలో కాస్తో కూస్తో నటించి పేరు తెచ్చుకొన్న వారిలో చాలా మందికి ఒకప్పుడు శివయ్య కంపెనీతో ఏదో ఒక సంబంధం ఉండే ఉంటుంది. అతని కళాభిమానంవల్ల నాటకరంగం కాస్త బాగు పడ్డది. కొంతమంది జనాభాకు ఆర్థిక సమస్యలు తీరాయి. కొత్తకొత్త నటశేఖరులు, నటీమణులు తెలుగు ప్రేక్షకులకు పరిచయం చెయ్యబడ్డారు. ఆ ఊపుతో వాళ్లు సినీమా పరిశ్రమ గేట్లో పడి ప్రస్తుతం మాంఛి ఫేంలో ఉన్నారు. మరికొంతమంది వెలగటమూ ఆరటమూగూడ పూర్తిచేసి విశ్రాంతి ననుభవిస్తున్నారు. ఈ కళా సమరంలోని శివయ్య చావుదెబ్బతిన్నాడు. అట్టడుగున నిలబడి సహాయంకోసం నాలుగు వేపులా చేతులు చాపాడు శివయ్య. ఇదివరకు అతనిచుట్టూ చేరి, అతని సొమ్మంతా తెగతిన్న గుంపులో ఏ ఒక్కరూ అతన్ని ఆదుకొన్న పాపానికి పోలేదు. చివరికి తను గాఢంగా ప్రేమించిన ఆ హీరోయిన్ గూడా - తన నదివరకు అంతగా ఎరుగనట్లే మాట్లాడింది. ప్రస్తుతం ఆమెకి శివయ్యతో పనేమీ లేదు. ఆమె సినిమా [illegible] ఇప్పటి శివయ్య ఏవిధంగానూ ఉపయోగించడు. ఇంకా ఈ తద్దినం తనకుమాత్ర మెందుకు? ఇందులో తను చేసిన మోస మేమీ లేదనుకొన్నది హీరోయిన్. శివయ్య నాటకాలకోసం కొంత డబ్బు తగలేసిన మాట నిజం! అందులో తను బాపుకు చచ్చిందేమీ లేదు. ప్రతి ఉమ్మాయి జగ్గాయి అతనిదగ్గర పాతిక పరకా పుచ్చుకొన్నదానికి తనేమీ బాధ్యురాలు కాదు. అయితే తన కొక మేడ కట్టించినమాట



"వివాహం చేసుకోవటానికి నాకున్న అభ్యంతరమల్లా ఒక్కటే పిల్లే!"

ఉబద్ధుడని తానెప్పుడూ అనుకోలేదు. [illegible] సంవత్సరాలపాటు శివయ్యకు తను శరీర సౌఖ్యమిచ్చింది. ఈ ఐదేళ్లలో అత [illegible] అనుభవించటానికి వీలులేని అపురూపమైన ఆనందం తాను అతని పాదాల క్రింద [illegible] చేసింది. నిజం మాట్లాడితే తనకే శివయ్య ఇంకా [illegible] ఉంటాడు. ఇప్పుడు శివయ్యను తానేమీ కోరుకున్నది లేదు. మరో నాలుగేళ్లు తరవాత శివయ్య తన ఇంటి [illegible] తన అలుసులు తియ్యటానికి అభ్యంతరం [illegible]

అభ్యంతరం పెట్టేదో లేదో గాని, శివయ్య [illegible] అతి నీ దుగులతోనే [illegible] మరణించాడని కొందరంటారు. కానీ అది నిజమే కావచ్చు. ఎందుకంటే శివయ్య [illegible] నాటికి రెండెకరాల పొలం కంటే ఎక్కువలేదు. అదియినా తన [illegible] లేదు. ఎదుగుతున్న ఇద్దరి పిల్లల క్షేమం నిమిత్తం భార్య తన పేర వ్రాయించుకొన్నది. పోతే - ఉన్న రెండిళ్ళలోనూ, ఒకటి తాకట్టులో ఉన్నది. తాకట్టు బాకీ తీర్చే డబ్బుతో అటువంటి యిళ్లే ఇంకొకటి సునాయాసంగా కట్టించవచ్చు. కొట్టే అది ఉండికూడా లేనిదాంట్లోనే జమ. అవిగాక ఇంకా చిల్లరమల్లర బాకీలు కొన్ని ఉన్నాయి.

ఏది ఏమయిపోయినప్పటికీ భాగ్యమ్మ - శివయ్య భార్య - మంచిపని చేసింది. లేకపోతే తన [illegible] తన బిడ్డల గతేమిటి? ఆ రెండెకరాలన్నా ఉంపెట్టి కొంతలో కొంత నయం! లేకపోతే, తనూ, బిడ్డలూ దేశిమ్మ కొకుతే పోవటం తప్ప వేరే మార్గమేముంది?

చివరి రోజుల్లో ముఖ్యులైనవాళ్ళు వచ్చి శివయ్య పశ్చాత్తాప పడినట్టు [illegible] లున్నాయి. అయినా అతని స్థితికి జాలిపడి నట్టు మాత్రం [illegible] కుంటుందో సమాజం ఏప్పటిలో శివయ్య పోయినంత [illegible] పారలు కమ్మేసినా [illegible] కూడుకున్నారు. దానితో అన్ని [illegible] బుద్ధులూ శివయ్యకు [illegible] దంతా స్వంతం చేసుకొన్నారు. [illegible] దిక్కూ మొక్కూ లేకుండాపోయినాకు. అతనిమీద సామనుభూతి [illegible] అవసరం సమాజానికి [illegible]? [illegible] పదవోరణాల మాహాత్మ్యంలో లేదు. [illegible] కొంత ఆలోచనాశక్తి ఉన్నా [illegible]. అది [illegible] చిస్తుంది. న్యాయాన్యాయాలు [illegible] రీతిని నిర్ణయిస్తుంది. [illegible] అమలు జరుపుతుంది. ఒక్కోసారి [illegible] గింజకు [illegible] ఒక్క మాటన్నా అనదు. ఒక్క చేయన్నా [illegible] యివ్వదు. మరొకసారి [illegible]

★ గాడితప్పిన జీవితం ★

రం అది 'కొందరి పాదాలముందు రాశి పోస్తుంది. మూడు తరాలవరకూ సరిపోయే సహాయం మూడు దిశలా ముసురుతుంటుంది. సమాజాన్ని విమర్శించి లాభంలేదు. దాని తీరే అటువంటిది!

దరిద్రం మంచిలక్షణం కాదు. అది కుష్టు రోగంలాంటిది. ఒక్కసారి ఒకడికి కుష్టు రోగం పట్టుకొన్న దనుకో. వాడి బిడ్డ బిడ్డ వంశమూ ఆ రోగానికి పాల్పడక తప్పదు(!!). ఒక్కసారి దరిద్రం సర్కిల్ లోకి వెళ్లారో, శ్లేష్మంలోపడ్డ ఈగలాగా ఇంక దాంటోంచి రాలేరు. ఒకవేళ ఎక్కడన్నా అట్లా వొచ్చిన నిదర్శనం ఎవరైనా చూపించవచ్చు. అయితే అది సజావయిన పద్ధతి అయిఉండదని వెంటనే గ్రహించాలి. ఎందుకంటే "సన్మార్గం" ద్వారా డబ్బు సంపాదించటం అసంభవం...దరిద్రం అటువంటి మాదర్చోద్ వ్యాధి. దురదృష్టవశాత్తూ ప్రపంచంలో చాలామంది ఈ వ్యాధితో నిత్యమూ బాధపడుతున్నారు. తన్నివారణార్థం రకరకాల 'మందులు' కనిపెడుతున్నారు. కొత్త ఆయుధాలు సృష్టిస్తున్నారు. యుద్ధాలు చేస్తున్నారు. బాంబులతో పట్టణాలకు పట్టణాలను, దేశాలకు దేశాలను బూడిద గాస్సుల్లో ముంచెత్తుతున్నారు. అయినా ఈ జబ్బు పెరుగుతున్నదే కాని తరుగుతున్నట్లు లేదు.

దరిద్రం యాతనామయమే కానీ, దుర్భరమైంది కాదు. ఇందులో విస్తుపోవటానికేమీ లేదు. పుట్టుకనుండీ దరిద్రం అనుభవిస్తున్నవాడికి దాని బాధ అంతగా పీడించదు. వాడు దానికి ఏనాడో అలవాటయిపొయ్యాడు. కానీ కొంతకాలంపాటు డబ్బు ఇవ్వగలిగిన అన్ని సుఖాలు అనుభవించినవాడికి దరిద్రం కంటే వేరే నరకముక్కర్లేదు. వాడికి ప్రతిక్షణమూ దుర్భరంగానే ఉంటుంది. ప్రతి ఘడియా పెను గండంగానే ఉంటుంది.

ప్రస్తుతం భాగ్యమ్మగారు ఇదే స్థితిలో ఉన్నది. ఇదివరకు ఆమెకు దేనివిషయంలోనూ దిగులులేదు. ఇప్పుడామె కన్నీ దిగుళ్లే కలిగిస్తున్నాయి. మొగుడు తనదారిన తాను పోయినాడు. పిల్లలా రెపరెప ఎదుగుతున్నారు. శంకరం చదువు ఈఏటితో ఈ వూళ్లో పూర్తవుతున్నది. పై చదువులు చదవాలంటే విధిగా గుంటూరు వెళ్ళక తప్పదు. పై చదువులంటే కానీతోనూ, దమ్మిడీతోనూ గట్టెక్కవని భాగ్యమ్మకు తెలుసు. ఎంత తూతూ మంత్రంగా అంచనావేసినా మూడునాలుగు వేలు కావాలి. ఇప్పుడు ఆమె దగ్గర చిల్లిడబ్బు లేదు. పొలం మీద ఏదో కొంత రాకపోదు. వొచ్చిన ఆదాయమంతా శంకరం చదువుక్రింద ఖర్చుచేస్తే తనూ పద్మా, ఎట్లా పొట్ట గడుపుకోవాలి? అన్నట్టు పద్మ గూడా పెళ్ళీడు కొస్తున్నది. ఏదో శుభముహూర్తాన దానికో మూడుముళ్ళూ వేయందే తనకు మనశ్శాంతి ఉండదు.

పాపం! భాగ్యమ్మ ఇటువంటి గొడవలు పడ్డ మనిషి కానేకాదు. ఒకదాని తర్వాత మరొకటి; ఇసకపాతరల్లే వొస్తున్న సమస్యలకు తను పరిష్కారం చెప్పుకోలేక పోయింది. ఆమెకు నిజంగా కాలు చెయ్యి ఆడలేదు. అవును మరి!

తన మనస్సులో ఉన్న ఉద్దేశ్యాలను బైటబెట్టిన రోజున భాగ్యమ్మకు చాలామంది చాలా సలహాలిచ్చారు.

"కుర్రవాడు తెలివైనవాడు. ఒక్క క్లాసూ తప్పకుండా స్కూలు ఫైనలు గణుపు దాటాడు. ఈ చదువుతో వాడి కొట్టే మంచి ఉద్యోగం దొరకదు. అథవా దొరికినా అరవై డెబ్భయ్ రూపాయల్లో వాడికీ వాడి కుటుంబానికీ గడుస్తుందా? వాడి చదువుకు చాలా ఖర్చవుతుంది మరి! కానీ ఈ పాడురోజుల్లో - అసలు బియ్యే తోకన్నా లేనిదే లాభం లేదు. పోతే పిల్లదా? శంకరం ప్రయోజకుడు కావాలేగానీ, చెల్లెలి పెళ్ళి చెయ్యలేక పోడు, నిలుచున్న పళంగా పిల్లదాని నెత్తిన అక్షింతలు వెయ్యాలంటే, ఉన్న ఈ రెండెకరాల చెక్కా అమ్మకోక తప్పదు. అటు చదువూలేక ఇటు ఆస్తీలేక శంకరం ఏమవుతాడు?"

భాగ్యమ్మ ఒక నిర్ణయాని కొచ్చింది. ఏదైతే అదే అవుతుంది. పైన భగవంతుడున్నాడు. తనింతవరకూ బుద్ధిపూర్వకంగా ఒకళ్లకు హానిచేసి ఎరగదు. నారుపోసినవాడు నీరు ఎట్లాగూపోస్తాడు. పిల్లదానికోసమని వాణ్ని అప్రయోజకుణ్ని చేయటం దేనికి? భగవంతుడి దయవల్ల వాడా బియ్యే పాసయితే చెల్లెలి పెళ్లిచెయ్యకపోడు గదా! అప్పటికయినా పద్మ ఈడుమించిపోదు. రెండున్నా రెండు నాలుగున్నా, పదమూడు, పదిహేడు. శంకరం బియ్యే అయ్యే నాటికి పద్మకు పదిహేడు నిండి పద్దెనిమిదో ఏడు వొస్తుంది. పద్దెనిమిదేళ్లు ఈ కాలంలో పెళ్ళీడు మించిన ఏళ్ళు కానేకావు. పాతిక ఏళ్ళు దాటినా యింకా పెటాకులు లేకుండా తిరుగుతున్న వాళ్ళను తనెందరిని రోజూ చూడటల్లేదు? వాళ్లందరకూ రాని నామోషి తనొక్కదానికే వొస్తుందా ఏమిటి? ఏమో? అప్పటికీ కట్నం తీసుకోకుండా పద్మను పెళ్ళిచేసుకో నేవాడే దొరుకుతాడేమో? ఎవరు చెబుతారు? అన్నట్టు - ఇంకా తనా సంగతే ఆలోచించలేదు. శంకరం బియ్యేఅయితే వాడే పద్మ కట్నం తన పెళ్ళిద్వారా సంపాదించగలడు. ఈలోపుగా పద్మగూడా బడికెళ్లిందంటే నయమే! చదువుకొన్న పిలవిషయంలో కట్నంకోసం అంతపట్టింపులు ఉండకపోవొచ్చు. ఎన్నివిధాల చూసినా తను పిల్లవాణ్ని చదవెయ్యటమే శ్రేయస్కరంగా తోచింది భాగ్యమ్మకు.

* * *

అనుకొన్నవి అనుకొన్నట్లు జరిగితే ఎంతబాగుండును! కానీ అదేం కర్మమో ఒక్కటిగూడా అట్లా జరగదు గదా! భాగ్యమ్మ అనుకొన్నట్లు నాలుగేళ్లకు గాక ఆరేళ్లకు శంకరం బియ్యేపాసయినాడు. ఈ లెక్క ప్రకారం చూస్తే పద్మకిప్పుడు పంధొమ్మిది వెళ్ళి ఇరవై ప్రవేశించి ఉంటుంది. ఆమె ఊహించినట్లు జరిగిఉన్నట్లయితే శంకరం ఇప్పటికే ఏ గజెటెడ్ఆఫీసరో కావాలిసింది. పద్మకు పెళ్ళి గిళ్ళీ జరిగిపోయి, సుఖోపాయంగా మొగుడుతో కాపురంచేసుకొంటూ; దేవుడు మేలుచేస్తే ఒక బిడ్డను ఎత్తుకోవలసింది. వీటిల్లో ఏ ఒక్కటీ జరగలేదు. శంకరంతో బాటు పద్మ గూడా చదవటంవల్ల డబ్బు అంచనామించి ఖర్చయింది. రెండెకరాల పొలమూ అలవ సులవ ధరకు తెగనొట్టుకొన్నారు. ప్రాణగండమొస్తే ఇల్లు అమ్ముకోవలసివచ్చింది. వెధవది! ప్రాణంకంటే ఆస్తి ఎక్కువేముంది? అయినా ఆపదలో అక్కరకు రాకపోతే ఆ ఆస్తి ఉంటేనేం లేకపోతేనేం? ఇప్పుడు భాగ్యమ్మకు - 'నా' అని చెప్పుకోదగ్గదేమీ లేదు. కొడుకు బియ్యే అయినాడనే తృప్తి తప్ప వాడివల్ల

కానీ అదా లేదు. కేవలం డబ్బు కటకట వల్లనే పద్మ ఇంటరు పూర్తి చెయ్యలేక పోయింది. అమ్మకొచ్చిన బాపతు ఇంకాసిని పిచ్చికలుంటే మార్చుకుతింటున్నారు. ఇవి కాసినీ అయిపోతే ఆతరువాత ఎట్లా గడవాలో భాగ్యమ్మకు అర్థం గాలేదు. ఎంత బిజిలిగా వాడితేమట్టుకు నాలుగురోజు లొచ్చే డబ్బు నాలుగు నెలలు రాదుగదా!

ఈ సమయంలోనే ఆమె కొక ఉత్తమోత్తమమైన ఆలోచన వచ్చింది. ఈ ఆలోచన ఇదివరకు ఆమెకు రానిదేమీ కాదు గానీ, అప్పట్లో దానికాట్టే ప్రాముఖ్యం లేదు. ఇప్పుడు దానికున్నంత ప్రాముఖ్యం మరి దేనికీ లేదు. తను సరో సరోపడి శంకరానికి పెళ్ళిచేస్తే కొంతలో కొంత విశంబరంగా ఉంటుంది. వాడి కేమీ? నిక్షేపంలా బియ్యేఅయినాడు. అధమ పక్షంచూసుకున్నా అయిదారువేలుకట్నం రాకపోదు. ఆ డబ్బుతో పద్మ పెళ్లిచేస్తే తన బెడద వొదిలిపోతుంది. పిల్లనిచ్చిన మామగారే అల్లుడి ఉద్యోగం చూసుకొంటాడు. పద్మ తనింటికి తను పోతుంది! తన సంగతా? అప్పుడు తనెక్కడున్నా దిగులులేదు. అయితే ఈ ఆలోచనను ఛిద్రం చేసి పారేశాడు శంకరం. వాడు పెళ్ళికి ఒప్పుకోలేదు.

"ఎందుకనిరా నాయనా!" అన్నది భాగ్యమ్మ.

"ఈ స్థితిలో నాకు పెళ్ళేమిటమ్మా? ఎవరన్నా వింటే నవ్వుతారు. నీ దగ్గరఉన్న ఆ నూటపాతిక రూపాయలూ అయిపోతే మనం కట్టకట్టుకొని గంగలో దూకటం కన్న గతిలేదే! ఈ స్థితిలో ఇంకెవర్నో తెచ్చి నా కంటగట్టి - అందరం కలిసి చావాలని కోరుకుంటున్నావుటే అమ్మా నువ్వు? అదే నీ ఉద్దేశ్యమైతే, నేను దానికి ఒప్పుకోను. మనమీ గానిగలోబడి నలుగుతున్నాం సరేసరి! ఇంకొకరు మనకు తోడెందుకూ? ముందు మనం బైటికొద్దాం. ఆ తరవాత నువ్వు చెప్పినవాటిని గురించి ఆలోచిద్దాం. అందాకా నువ్వేమీ మాట్లాడకు" అన్నాడు శంకరం.

"అదిగాదురా!" అంటూ భాగ్యమ్మ తన ఆలోచనంతా కొడుక్కి చెప్పింది. తన ఈ ఉత్తమోత్తమమైన ఆలోచనకు కొడుకు దిమ్మతిరిగిపోతాడని భాగ్యమ్మ ఊహించివుంటే, అది పూర్తిగా భ్రమ అనే చెప్పాలి. తల్లి వెలిబుచ్చిన ఈ ఆలోచన వినంగానే శంకరం ఒక్కరవ్వయినా తల్లిని మెచ్చుకోలేదు సరిగదా, ఆమె యిటువంటి బిబిరిగొట్టు ఆలోచన చేసినందుకు అసహ్యించుకొన్నాడు కూడాను.

తను కోపంగా మాట్లాడినందుకు, అందులో నిజం మాట్లాడినందుకు - తల్లి ముఖం మాడ్చుకోవటం గమనించాడు శంకరం. అతనికి తల్లినిచూస్తే ఆ క్షణాన చాలా జాలికలిగింది. ఆమెను నొప్పించినందుకు క్షణకాలం విచారించాడు. ఆమెను తిరుగా ఉత్సాహపరచటం ఎందుకైనా మంచిదనుకొన్నాడు.

"నాకు తోచిందేదో నేను చెప్పాను. నేను చెప్పింది నిజంకాకపోవొచ్చు. పోనీ నువ్వు చెప్పినట్లే చేస్తాను. వివాహం చేసుకోవటానికి నాకు ఉన్న అభ్యంతరం ఒక్క డబ్బే! డబ్బు విషయం ఫరవాలేదు నువ్వు ఎట్లా యిస్తున్నావో గానీ, నా భరవాసా యిస్తున్నావు. ఇందాక నువ్వు మాట్లాడిన ధోరణినిబట్టి నువ్వు నన్ను మరొకలాగా అర్థం చేసుకొన్నావని నే అర్థం చేసుకొన్నాను. నే ఎవర్నీ ప్రేమించనూ లేదు. ప్రేమలో నాకు విశ్వాసమూ లేదు. ప్రేమ పేరుతో పగటికలలు కనటం నాకు చేతకాదు. నన్ను

★ గాడితప్పిన జీవితం ★

...తే డబ్బునుబట్టే ప్రేమలో తారతమ్యాలుంటాయంటాను... ఉండు. నన్ను చెప్పనివ్వు అమ్మా! ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే? నేను పెళ్లిచేసుకోక పోవటానికి నేనెవర్నీ లోగడ ప్రేమించి ఉండలేదని నీతో చెప్పటంకోసరమే! నీవు మెచ్చిన పిల్లను తీసుకురా. నేను నిరభ్యంతరంగా పెళ్ళాడేస్తాను. మరి ఆపైన బరువు భారమూ నువ్వు తీసుకొంటావా? ఊఁహూ... నువ్వేమీ అనుకోకు. అదిగాదమ్మా! ఈ స్థితిలో మనకు పిల్లనిచ్చే దెవరే? అందులో కట్నంతో వస్తేనేగానీ మనప్లాను నెరవేరదే? అటువంటివాళ్ళున్నారంటావా? ఉంటే మట్టుకు నాకేమీ అభ్యంతరం లేదు." అన్నాడు శంకరం.

భాగ్యమ్మగారి చుట్టూ మళ్ళీ చీకటి ఆవరించుకొన్నది. శంకరం చెప్పింది నిజమే! ఈ స్థితిలో తమకు పిల్ల నెవరిస్తారు? తనలాంటి స్థితిగతులు గలిగినవాళ్ళే వచ్చి పద్మ నివ్వమంటే - కట్నం లేకుండానే గావొచ్చు - తను వొప్పుకుంటుందా మరి? తా నేపనైతే చెయ్యలేదో, అదేపని ఇతరులు తనపట్ల చెయ్యాలని తనెందుకు కోరుకున్నది?

అమ్మా, అన్నయ్యల సంభాషణ ఇంతసేపూ పద్మ వింటూనే ఉన్నది. కానీ ఆవిడ ఎటూ చెప్పదలచుకోలేదు. ఒక్కొక్కసారి అమ్మచేసే ఆలోచన దివ్యంగా, నిరపాయంగా, మహా సులువుగా ఉంటుంది. కానీ ఆ ఆలోచన అన్నయ్యదగ్గర కెళ్ళేసరికి నీళ్ళు కారిపోతుంది. శంకరం దానిని ఈకకు ఈక, తోకకు తోక లాగి బొమిక ముక్క చూపించుతాడు. అంతవరకూ దివ్యంగాఉన్న ఆలోచన కాస్తా, దానంత దరిద్రపు గొట్టుది మరొకటి లేకుండా పోతుంది. ఏమయితే నేంగానీ తన అన్నయ్య మంచివాడనే ఇంతవరకూ పద్మ అభిప్రాయం. కానీ ఈ అభిప్రాయాన్ని ఒక్కొక్కసారి శంకరం చేతులారా ధ్వంసం చేసుకొంటాడు. అటువంటి పనే వాడీపూట తల్లితో మాట్లాడుతూ చేశాడు.

శంకరం వివాహం చేసుకోనన్నంతవరకూ పద్మ కేమీ పేచీలేదు. కానీ వాడు తనకు తెలియని విషయాలు గూడా తెలిసినట్లు మాట్లాడితేనే, తనకు మండుకొస్తుంది. కాకపోతే వాడు ప్రేమనుగురించి మాట్లాడ టెందుకూ? తనే అమ్మాయినీ ప్రేమించలేదని వాడే ఒప్పుకొంటున్నాడుగా! అంటే ఆ విషయం వాడి కేమీ తెలియనట్లు తేలిపోతుందాయె మరి. ఏమో! కామెర్లరోగికి ప్రపంచమంతా పచ్చగా కనిపిస్తుందట. అంతమాత్రం చేత ప్రపంచం పచ్చగా ఉన్నట్లు కానేకాదు. శంకరానికి ప్రేమలో విశ్వాసం లేకపోవొచ్చు. తను కాదనదు. కానీ డబ్బునుబట్టే ప్రేమలో తారతమ్యాలుంటాయంటేమట్టుకు ఛస్తే తను వొప్పుకోదు. వాడు ఊహించి చెబుతున్నాడు. తను అట్లా కాదు. అన్నయ్య చెప్పిందే నిజమయితే, మరి విశ్వం తన నెందుకు ప్రేమిస్తాడు? తనను తప్ప మరొకర్ని పెళ్లి చేసుకోనని ఎందుకు మాట ఇస్తాడు. తన కోసం కుక్కలాగా ఎందుకు తిరుగుతాడు? తనను వెంటేసుకొని సినిమాలకు గ్రటకు ఎందుకు ఖర్చు పెడతాడు? ఇవన్నీ అబద్ధమై ఒక్క శంకరం చెప్పిందే నిజమా? తను ఊరికే తాత్సారం చేసోంది కానీ, ఒక్కసారి అమ్మతో చెబితే ఎగిరి గంతు వెయ్యదూ? ఇదే గనక తను అన్నయ్య ఎదట రుజువు చేస్తే, వాడేమయిపోతాడు?

పద్మ ఎంత ఊహించినా, తను రుజువు చేసినప్పుడు శంకరం ముఖం ఎట్లా వెలాతెలా పోతుంటుందో బొమ్మ కట్టలేకపోయింది... నిజమే మరి! పద్మ ఒకసారి ఒక స్నేహితురాలింటి కెళ్ళింది. అదే సమయానికి అదే స్నేహితురాలు ఇంకెక్కడికో వెళ్ళింది. ఆ విషయం పద్మ హాల్లోకి రాగానే తెలిసింది. అయితే స్నేహితురాలు వచ్చేదాకా తను ఆగటమా వెళ్ళటమా? ఏ విషయమూ తేల్చుకోకముందే "కూర్చోండి మా చెల్లి ఇప్పుడే వొస్తుంది" అన్నాడు విశ్వం. అతను తన స్నేహితురాలి అన్నగారని పద్మ వెంటనే పోల్చుకొన్నది. లోగడ అనేకసార్లు తన అన్ననుగురించి ఆ స్నేహితురాలు పద్మకు చెప్పింది. పద్మ కాదనలేక స్నేహితురాలు వొచ్చేదాకా కూచున్నది. ఆ తరవాత ముగ్గురూ కలిసి సినిమాకెళ్లారు. అదేదో హిందీ సినిమా. అందులో ఒక్క "ప్రేమ" తప్ప ఇంకేమీలేదు. నాయికా నాయకులు అమితంగా ప్రేమించుకొంటారు. మధ్యలో కొందరు దుర్మార్గుల వలన విడిపోతారు. చివరికి కలుసుకొంటారు. ఆనందంగా పాడతారు. రెండు పావురాళ్లు ముక్కుకు ముక్కు ఆనించుకొంటాయి. ఆట అయిపోయింది. ఇంటికివస్తూ ముగ్గురూ ఆ సినిమానుగురించి చర్చించారు. ఆ సినీమాలో హీరోయిన్ పండ్లు అమ్ముకొనే మనిషి. హీరో జమీందారుగారబ్బాయి. చూసీచూడటంతోనే గబగబా ఆ అమ్మిని ప్రేమిస్తాడు. "నువ్వుతప్ప నాకు ప్రపంచం లేదు" అంటాడు. ఇవన్నీ ఆ ముగ్గురి సంభాషణలోకి వొచ్చినై.

"అయితే చూడవోయ్" అన్నది పద్మ స్నేహితురాలి భుజంమీద చెయ్యవేసి "ఆ పిల్ల అంత పేదదిగదా! వాడు రిచ్ ఫెలో గదా! అటువంటప్పుడు లవ్ క్రియేట్ అవుతుందంటావుటోయ్"

ఈ ప్రశ్నకు విశ్వం సమాధాన మిచ్చాడు. "ఎందుకు కాదు? మన తెలుగువాళ్లయితే ఫిల్ములను ధ్వంసంచేసి పారేశేనారు, అటువంటి ఘట్టాల్లో. అక్కడే ఉంది హిందీ డైరెక్టర్ల ఇంటెలిజెన్స్." అన్నాడు విశ్వం.

చెల్లెలు అతురాలా నిజమేనన్నది. అని పైగా "మా అన్నయ్య ఇటువంటి సినిమాలు చూసి పొత్తిగా కొరకరాని కొయ్య అవుతున్నాడు పద్మా! మా నాన్నగారు మంచి సంబంధాలు రెండు మూడు తెచ్చారు. ఈ దొరగారు తను ప్రేమించిన పిల్లను తప్ప - చేసుకోనంటున్నాడు. అందులోనూ పేదదయినా సరేట." అని కలిపింది.

పద్మ తనకున్న సందేహాన్ని కాస్తా బైటపెట్టింది. "మరి బ్యూటీయో?" అని విశ్వంవేపు చూసింది.

విశ్వం నవ్వాడు. విశ్వం చెల్లెలు నవ్వింది. పద్మగూడా నవ్వింది. ఆ తరవాత ఎవరిళ్లకు వాళ్ళు వెళ్ళారు.

పద్మ; తన రొట్టె విరిగి నేతిలో పడ్డదని భావించింది. ఆవిడ చిన్నదీ చితకదీ కాదు. ఇరవైఏళ్ళున్నాయి. పైగా చదువుకొన్నది. చాలా ఆలోచించిగానీ విశ్వానికి "చనువు" ఇవ్వలేదు. తనకేమో భగవంతుడు ఏమాత్రమో తో అందమిచ్చాడు. ఈ దరిద్రానికి దు ఇది గూడా లేకపోతే తనపాట్లు కుక్కలుగూడా పడవని పద్మ అనుకుంటుంది. తన అందం చాలామంది కుర్రకారుని కవ్వించుతున్నదని ఆమె ఏనాడో గ్రహించింది. కానీ ఎవ్వరికీ ఆమె "చోటు" ఇవ్వలేదు. ఇదీ కొంత మంచిదే అయింది. వెనవది; తనకు పెళ్ళి కాదనేమాట అబద్ధంగానీ, ఈ విధంగా, అన్ని విధాలా తగిపోయిన విశ్వం వంటివాడు దొరుకుతాడా దొరకడా అనేదే సందేహం. ఇప్పుడదిగూడా లేదు. విశ్వానికి అటువంటి టేస్టు ఉండటం పద్మకు మంచిదే అయింది. లేకపోతే విశ్వంవంటి బంగారు పిచ్చుక పద్మకు ఈ జన్మలో భర్తగా దొరకటం కష్టం.

అమ్మా, అన్నయ్యా తన పెళ్ళినిగురించి అనుకొంటున్నప్పుడల్లా పద్మకు ఊరికే నవ్వు వొస్తుండేది. ఒక్కొక్కసారి చప్పున నిజం చెప్ప బుద్ధేస్తుండేది. కానీ సమయం కాదని తిరిగి మానుకొంటుండేది. ఇప్పుడు

అట్లా చెయ్యగూడదనుకుంది పద్మ. ఇంకేం దుకూ? విశ్వం తన పేరెంట్సుతో చెప్పడానికి వాళ్ళ ఊరెళ్ళాడు. రేపో ఎల్లుండో దిగుతాడు. ఈలోపుగా తను వీళ్లతో చెప్పి అన్నీ సెటిల్ చేస్తే తీరిపోతుంది. తరవాత మళ్ళీ బోలెడంత టైం వేస్టు కాకుండా ఉంటుంది. పెళ్ళి ఎటుగూడీ చాలా మోడరేట్ గా అయిపోతుంది. అవగానే ఏ ఊటికో వెళ్ళాలి. లేకపోతే ఈ గుంటూరు ఎండలు మరీ భండాలంగా ఉన్నాయ్!

కుమారి పద్మ ఇన్ని ఆలోచనల తరవాత గానీ తల్లికి ఈ విషయం చెప్పింది గాదు. భాగ్యమ్మ ఏమాత్రమో వొణికింది.

"ఎందుకమ్మా! అట్లా ఇదవుతావ్? చూసుకో రేపీపాటికి విశ్వం రాకపోతే నన్ను మారుపేరుపెట్టి పిలువు. నేను నీ కడుపున బుట్టినా నీ అంత తెలివితక్కువదాన్ని కాదు. ఇన్నిమాట లెందుకూ? రేపు విశ్వాన్ని చూసిన తరవాత నువ్వు ఫిట్టువచ్చి పడిపోతావ్" అన్నది పద్మ.

భాగ్యమ్మగారు పది నిమషాలకు గానీ తేరుకోలేదు.

"అయితే ఇంతకాలం నాతో ఎందుకు చెప్పలేదే అమ్మాయ్!... నేను నీ పెట్టెలో అయిదారు కొత్త చీరలు చూశాను. ఏ స్నేహితురాలివో ననుకొన్నాను గానీ నీవ ననుకోలేదు. ఈకాలపు పిల్లలు ఎంతకైనా తెగుదురే మాయమ్మా! ఓరి నీ సోద్యం కూలిపోను......" అని ఆశ్చర్యపడసాగింది భాగ్యమ్మ.

"అన్నయ్యేడీ?" అన్నది పద్మ.

"ఎక్కడో పని దొరకుతుందని ఎవరో చెప్పారట. అక్కడి కెళ్ళాడు. ఏమోగానీ పద్మా! రేపు మీ విశ్వంతో చెప్పి శంకరానికి ఎక్కడన్నా కాస్త పనిచేయించవే"

పద్మ మాట్లాడలేదు.

విశ్వం రానూ వచ్చాడు. పద్మ అతన్ని కలుసుకోనూ కలుసుకొంది.

"ఏమైంది?" అంటూ ఆత్రుతగా ప్రశ్నించింది పద్మ.

విశ్వం జరిగిన యావత్తు గ్రంథమూ చెప్పాడు.

"అయితే నాగతేమిటి విశ్వం"? అన్నది పద్మ ఏడుపుగొంతుతో.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. సజావైన మార్గం ఒకటీ కనిపించటం లేదు. మామూలప్పుడు అంత క్విక్ గా వర్కు చేసే బ్రెయిన్ కాస్తా సమయం వచ్చేసరికి చప్పున పనిచెయ్యటం మానేసింది. నిన్నెట్లా రక్షించటమా అని నేనూ దోవపాడుగునా ఆలోచించాను. కానీ - ఒక్కటీ సరైన ఆలోచనే రాలేదు." అన్నాడు విశ్వం.

"చివరికి నువ్విట్లా అంటావని నేనెప్పుడూ అనుకోలేదు విశ్వం,"

"నేనుమాత్రం అనుకొన్నానా మరి?" అన్నాడు విశ్వం. "నాకు నువ్వంటే అభిమానముంది. కానీ నామాట చిల్లిదమ్మిడీ విలువకటలేదు మా నాన్న. నన్నేం చేయమంటావో చెప్పు?"

పద్మకు దుఃఖం పొర్లుకొచ్చింది. కుర్చీలో కూలబడి బావురుమని ఏడిచింది. విశ్వం జేబులోనించి వందరూపాయల కాగితాలు ఐదు తీసి పద్మ వేపు విసిరాడు.

"ఆడబ్బు తీసుకొని వెళ్ళు. ఇంకెప్పుడూ ఇక్కడికి రావద్దు. వచ్చినందువల్ల నాకేమీ అభ్యంతరం లేదు. కానీ సొసయిటీలో నీ కాస్త గౌరవం ఉండదనుకొంటాను. ఈ అయిదువందలు పట్టుకెళ్ళి సుఖంగా బతుకునే వేడుతున్నాను." అన్నాడు విశ్వం.

కాండ్రించి ముఖాన ఊసినట్లయింది పద్మకు. ఆ అవమానం భరించలేకపోయింది.

"నే నేం భోగందాన్ననుకొన్నావా నీ డబ్బు కాశించటానికి? ఈ వెధవ డబ్బు నాకేం అక్కర్లేదు. ఇవిగూడా నీ ముఖం మీదనే వేసుకో"

విశ్వం పోతున్నవాడల్లా ఆగి ముందు కొచ్చాడు.

"పాపం! చాలా కోపంలో వున్నావు గనక ఏం మాట్లాడుతున్నావో నీకే తెలియటల్లేదనుకొంటాను. నువ్వు మాట్లాడినదానికి నేను సరయిన సమాధానమిస్తే నువ్వు మరీ ఫూల్ అవుతావు. డబ్బు నువ్వన్నట్లు వెధవదే గానీ, దానికున్న పవర్ ఇంక దేనికీ లేదు. నాదగ్గర లక్షల ఆస్తి లేకపోతే నువ్వు నన్ను చేసుకొంటానికి వొప్పుకొంటావని నేను నమ్మను. రెండోది ఏమిటంటే, భోగంవాళ్ళకోసం కొంత డబ్బు ఖర్చు పెట్టాలిసొస్తుంది. నీబోటివాళ్ళకోసం అటువంటి దేమీ అక్కర్లేదు. ఇందులో బలవంత మేమీ లేదు పద్మా! నీ యిష్టమైతే నే తీసుకో. ఒదిలి వెళ్లితే నేనేమీ కాదనను. నేను వెడుతున్నాను. ఆలోచించుకొని నీ యిష్టమొచ్చినట్లు చెయ్యి."

పది సంవత్సరాల అనుభవం ఒక్కసారి లభించినట్లయింది పద్మకు. ఆలోచిస్తే విశ్వం అన్నదాంట్లో కొంత నిజం లేకపోలేదు. నిజంగా విశ్వానికి ఆ ఆస్తి లేకపోతే తను అతన్ని లవ్ చేస్తుందా? చెయ్యదని అంతరాత్మ చెబుతున్నది. తను అయిదు నెలలు విశ్వంతో తిరిగింది. అయిదు వంద రూపాయల నోట్లు తన కాళ్లముందున్నాయి. లెక్కప్రకారం చూస్తే నెల వొకటింటికి తన అందంఖరీదు వందరూపాయలన్నమాట!

పద్మ అయిదు వంద కాగితాలూ రొంటిన దోపుకొని ఇంటికొచ్చింది,

"ఏమయిందే?" అన్నది భాగ్యమ్మ.

"ఏమవుతుంది? నేను చెప్పలేదుటే? అంతా రైటే అయింది" అన్నది పద్మ.

"ఒరే అబ్బాయ్! శంకరం!! పద్మతల్లి పెళ్ళి ఖాయమయిందిరా" అంటూ భాగ్యమ్మ లోపలి కెళ్ళింది.

ఈ పూట పద్మకు అలసటేమీ లేదుల్లి నర్స్ ఇంతక్రితమే వచ్చి వెళ్లింది. బాబిగాడు గూడా నిద్రపోతున్నాడు. పధ్నాలుగు నెలల తర్వాత కలము కాగితము తీసికొని అన్నయ్యకు ఉత్తరం వ్రాయసాగింది పద్మ:

కల్యాణపురం
15-3-52

ఈ ఉత్తరం వ్రాయడానికి ముందు నేను చాలా ఆలోచించి వ్రాసిఉంటానని నువ్వు గ్రహించాలి. నీ కెప్పుడు మనస్సుకు కష్టం తోస్తే అప్పుడు దీన్ని చింపి పారేయి. నేను సుఖంగా వున్నాను. బాబిగాడు గూడా కులాసాగానే ఉన్నాడు. నేనిక్కడ ఒక నాటక కంపెనీలో వేషాలు వేస్తూ మొన్నమొన్నటిదాకా గడిపాను. ఒక రోజున మా నాటకం చూడటానికి చాలామందితో బాటు ఒక లక్షాధికారి గూడా వచ్చాడు. జనమంతా ఇళ్లకు వెళ్ళారు. నేను రంగు కడుక్కోకుండానే నా బస కొస్తున్నాను. నా వెనకాతలే బసదాకా వచ్చాడు. నన్నూ, నా నటననూ అమితంగా పొగిడాడు. అప్పుడే వేలినున్న ఉంగరం బహుమతిగా యిచ్చాడు. ఉదయం కాఫీకి రమ్మన్నాను. వచ్చాడు. అంతే!! నేనంటే అతనికి చాలా ప్రేమట. నేను ఒప్పుకొంటే ఏమి కావాలన్నా యిస్తానన్నాడు. విశ్వం ధర్మమా అంటూ నా అందపు విలువ గ్రహించాను. అందుకోసమని ఆయనకు థాంక్స్ చెప్పాలి. పోతే: నాకోసమని, తనకున్న రెండు మేడల్లోనూ వొకటి ఖాళీచేసి నాకిచ్చాడు. నేను ప్రస్తుతం ఆ మేడలోనే ఉంటున్నాను. మేము కొద్ది రోజుల్లోనే ఒక సినిమా తియ్యబోతున్నాము. అందుకు కావలసిన డబ్బు ఆయనగారు పొలాలు అమ్మి, ఇళ్ళు తాకట్టుబెట్టీ తెస్తున్నారు. మూడు నాలుగు వారాల్లో మదరాసులో ఇల్లుతీసుకోబోతున్నాము. నీకు యిష్టమైతే ఇక్కడకు రా! మా కంపెనీలోనే నెలకు మూడువందల జీతంమీద పని యిప్పిస్తాను. ఇష్టమైతే అమ్మనుగూడా రమ్మను. నాకేమీ అభ్యంతరం లేదు. ఉత్తరంలో ఇంకా చాలా సంగతులు రాద్దామనే ఉంది. బాబిగాడు లేచి ఏడుస్తున్నాడు. ఉంటాను.

—పద్మ

ఆ ఉత్తరం అందినరోజున తల్లీ కొడుకులు మల్లగుల్లాలు పడ్డారు. ఎవరుముందు బైటబడితే పలచనగా ఉంటుందో నని ఇద్దరూ తొక్కిసలాడారు. చివరకు భాగ్యమ్మే తెగించి అడిగింది.


"ఏమిటమ్మా?" అన్నాడు శంకరం.

గాడితప్పిన జీవితం

"మీరా లేదురా!...అదే...ఆ ఉత్తరం.. దత్త... వ్రాసింది ... ఏమిటంటావ్ ?" అన్నది నీళ్ళు నములుతూ.

"ఏమనటాని కేముంది? నేను రాత్రి బండికి వెళదామనుకొంటున్నాను. మరి నీ యిష్టమేమిటో నువ్వు బైటపెట్టనే లేదు," అన్నాడు శంకరం.

"బైటపెట్టటాని కేముందిరా నాయనా! నీ యిష్టమే నా యిష్టం! ఈ ముసలితనంలో బిడ్డలమాట వినలేదనే అపనింద నాకుమట్టు కెందుకురా?" అన్నది భాగ్యమ్మ. ★



9

కాలోపినంతసేపు దిక్కూ తెన్నూ కానక పరుగెత్తాడు కవి. వీధిమలుపుల గోడలకు తల కొట్టుకొని, వాననీటి గుంటలలో తపబడుతూ, సుడులు మెలికలు తిరుగుతూ వీథులవెంట ప్రాణభయంతో పరుగెత్తాడు పరుగెత్తి పరుగెత్తి చివరి కాయాసంతో ఒకచోట నిలిచాడు. నిలిచి ఊపిరి తీసుకున్నాడు. తరువాత మనస్సులో ఒక యోచన తోచింది. "ఇదేమిటోయ్! మాస్టర్ పీర్ గ్రింగైర్! ఇలా చేశావేమిటి?" అనుకున్నాడు తనలో తానే. ఒక వేలితో ముక్కు తాటించి ఇలా అనుకున్నాడు: "ఎంత మందమతివైనావు! ఎందుకీ పారిపోవడం? నువ్వెంత భయపడ్డావో, నిన్ను చూసి ఆ కుర్రకుంక లంతకంటె ఎక్కువ భయపడ్డారని తెలియదూ? నువ్వేమో ఉత్తరపు దిక్కుకి పరుగెత్తితే, కుర్రవాళ్ళు దక్షిణానికి పరుగుతీశారు. వాళ్ళు పారిపోయారే అనుకో—అంటే ఆ పీచుపరు పక్కడే ఉందన్నమాట. అంటే—మేరీకన్యను స్తోత్రంచేస్తూ నువ్వు రాసిన అద్భుతగీతాల కామె ప్రసన్నురాలై నీకు పాన్పు పంపింది విశ్రాంతికోసం. ప్రొద్దుటినుంచీ దేనికోసం వెదకులాడుతున్నావో, అది నీకోసం అక్కడ ఏర్పరచబడివుంది. వాళ్ళు పారిపోలేదే అనుకో. అప్పుడు వాళ్ళు దానికి నిప్పు పెట్టి ఉంటారు. ఇప్పుడు నీకు ముఖ్యంగా కావలసింది చలిమంట. కాబట్టి చలిమంటగా ఉపయోగపడినా, పాన్పుగా వినియోగపడినా ఆ పీచుపరుపు నీకు దేవతాప్రసాదం అని తెలుసుకో. నీకోసమే మేరీకన్య ఇనప అంగడివాడికి పరలోకప్రాప్తి కలిగించిఉంటుంది. పోలీసుని చూసిన దొంగ మాదిరిగా కాలికి బుద్ధి చెప్పడం మాత్రం అవివేకం. కాబట్టి వెనక్కి తిరుగు."

గ్రింగైర్ వెనక్కి తిరిగాడు. చీకటిలో కన్నుపొడుచుకు చూస్తూ, చెవులు నిక్కబెట్టుకుని వింటూ నడిచాడు. పీచుపరు[illegible] కోసం వెతుక్కుంటూ గబగబ అడుగులు వేశాడు. కాని అత[illegible] యత్నం వ్యర్థమయింది. కవి గమ్యానికి వీధిమలుపులు, ఇరు[illegible] నిరోధాలౌతున్నాయి. ఒక్కొకప్పుడు అయిదువీథులు, ఆరువీథుల కలిసేచోట నిలబడి ఏదారీ నిర్ణయించలేక విసుగుచెందాడు: "ఈ[illegible] నగరం నిర్మించిన బుద్ధిహీనుడెవడో నాకు పరమశత్రువు."

తిరిగితిరిగి ఒక కూడలిలో నిలిచి చూశాడు. ఒకవీధి కొన[illegible] చివర చిన్నమంట, గుడ్డి వెలుగు కానవచ్చాయి. "ఆ! అదే! అదిగో నా పరదేవత!" అన్నాడు. పరదేవత అని మేరీకన్యనే స్తుతి[illegible] చాడో, అగ్నిశిఖనే స్తుతించాడో తెలియదు. వెంటనే ఆబా[illegible] ననుసరించాడు.


ఆవీధిలో కొద్దిదూరం వెళ్ళేసంతలో అతడికి చిత్రవిచిత్రమై[illegible] ఆకారాలు గోచరించాయి. నడిచినకొద్దీ ఆవీధిలో బురద అధిక[illegible] మయింది. దారి పల్లమౌతున్నది. ఒక ఆకారమంటూ లేని నల్ల[illegible] పెద్దపెద్ద ముద్దలేవో గునగున నడిచిపోతున్నాయి. ఆ ఆకారాలన్నీ వెలుగువైపుకే పోతున్నాయి.

నిర్ధనుడైనవాని సాహసానికి అంతుండదు. గ్రింగైర్ గబగ[illegible] నడిచాడు. అకస్మాత్తుగా అతడికి ఎవరివో మాటలు వినవచ్చాయి[illegible] కిందికి వంగి చూశాడు. సుమారు మూడడుగుల ఎత్తుగల ఆకార[illegible] దొన్నెఎత్తి ఏదో అన్నది. "ఇది ఇటాలియన్ భాష కాబోలు[illegible] ముష్టివెధవ!" అనుకున్నాడు. ముష్టివాడు రెండుచేతులమీద గెంతుతూ పోతున్నవాడు ఆగి భిక్షమడిగాడు.

"అదేభాషో నాకు తెలియదు" అంటూ గ్రింగైర్ ముందుక[illegible] నడిచాడు. మరొక ఆకారం దారి కడ్డువచ్చి నిలిచింది. చేతులూ కాళ్లూ వంకరైన అవిటివాడతడు. "ఓహో! విశ్వకర్మ ముక్కా[illegible] పీటలాగున్నాడు!" అన్నాడు కవి. ముక్కాలిపీట గౌరవ సూచ[illegible]

మూలం:
విక్టర్ హ్యూగో

అనువాదం:
సూరంపూడి సీతారామ్


GS

...కంగా టోపీతీసి అభివాదం చేశాడు. టోపీ గ్రింగైర్ గడ్డంకింద చూనిపి ఏదో వాగాడు: "ఇది స్పానిష్ కాబోలు" అన్నాడు గ్రింగైర్ "నాకైతే నువ్వు చెప్పిందేమీ బోధపడటంలేదుకాని నీకైనా తెలుస్తుందా?" అన్నాడు. పక్కకు తప్పుకొని నడవబోయాడు. ఇంకొక ఆకారం అడ్డు తగిలింది ఈ ఆకారానికి పెద్ద గడ్డం ఉంది. గుడ్డివాడు ఒక కర్ర చేతబట్టి తెడ్డుతో నావ నడుపుకున్నట్లు బాటలో ఈదుతున్నాడు. వెనక ఒక పెద్ద కుక్క ఉంది. అది అతణ్ని ముందుకి గెంటుతూవుంది అతడేదో గొణిగాడు: "ఈ భాష తెలుస్తోందిలే ఇది ఫ్రెంచిభాష, అమ్మయ్య! ఏమిటన్నావ్? ధర్మమా! బాగా అడిగావ్. నాకు మిగిలిన ఆఖరి చొక్కా అమ్మేసి వారంరోజులయిందప్పుడే. ఇప్పుడు నా జేబు ఖాళీ."

గుడ్డివాడిని తప్పించుకు నడిచాడు గ్రింగైర్. గుడ్డివాడు కన్నులున్నవాని మాదిరిగానే అతడివెంటపడ్డాడు. మిగిలిన ఇద్దరూ గునగున నడిచివచ్చారు. గ్రింగైర్ పాదాలనంటి పరుగెత్తి యాచనారంభించారు ముగ్గురూ మూడుభాషల్లో ప్రార్థిస్తున్నారు

కవి చెవులు మూసుకున్నాడు: "అబ్బబ్బ! ఇదెక్కడి చెవిటిదర్బారు?" అని విసుక్కున్నాడు.

గ్రింగైర్ శక్తికొద్దీ పరుగెత్తనారంభించాడు. గుడ్డివాడు పరుగెత్తాడు. కుంటివాడు పరుగెత్తాడు. ముక్కాలిపీట పరుగెత్తాడు. ఆ పైన అనేకమంది మరుగుజ్జులు, వికలాంగులు, కుష్ఠరోగులు కవిని చుట్టుముట్టారు. చీకటికోణాలలోనుంచి అప్పటికప్పుడు పుట్టుకొచ్చినట్లు బిలబిలమంటూ అసంఖ్యాకంగా వచ్చిపడ్డారు భిక్షుకగణం. అరుస్తున్నారు, మొరుగుతున్నారు, ఓండ్రపెడుతున్నారు. రకరకాల ధ్వనులు చేస్తూ కవిని వెంటాడించారు.

గ్రింగైర్ విభ్రాంతుడై పరుగెత్తాడు. భిక్షుకులు లగ్గుపడ్డారు. గ్రింగైర్ చుట్టూ కలయజూశాడు. పారిపోవటం కష్టమనిపించింది. కళ్లుమూసుకుని పరుగెత్తాడు. వీధిచివర విశాలమైన ప్రదేశం కానవచ్చింది. ఆ మైదానంలో అనేక దీపాలు గుడ్డివెలుగు ప్రసరిస్తూ రెపరెపలాడుతున్నాయి. ఆదృశ్యమంతా పీడకలవలె గోచరించింది. కాళ్ళముందున్న వికలాంగులన్నీ పడగొట్టి ముందుకు సాగాడు. ముక్కాలిపీట అమాంతంగా కాళ్లు సాచిలేచి నిలబడ్డాడు. గ్రింగైర్ నిశ్చేష్టుడైనాడు. మామూలుమనిషి ముక్కాలిపీట ఎలా కాగలిగాడు! ఇనపకొన్ని తీసి కవినెత్తిమీద బోరించాడు. గుడ్డివాడు తిరిగి నిలబడి కవిముఖంలోకి తీక్షణంగా చూశాడు

"అరె! ఇదేమిటి? నే నెక్కడున్నా నిప్పుడు?" అన్నాడు కవి.

"మాయానిలయం."

"మాయ! నిజం! ఇక్కడ గుడ్డివాళ్ళు చూడగలరు; కుంటివాళ్ళు పరుగెత్తగలరు నిజంగా మాయే!"

దీనికి వికటాట్టహాస మొక్కటే జవాబు వచ్చింది

పాపం కవి దీనంగా చుట్టూ చూశాడు. నిజంగానే వంచకుల మధ్యకు వచ్చిపడ్డాడు. పారిస్‌లో పరువుగలవారెవ్వరూ ఈ చోటికి రారు. అర్ధరాత్రి సమయంలో ఈ చోటు నెవ్వరూ చూడలేదు. సాహసించి ఈ వ్యూహంలో అడుగుపెట్టిన పోలీసులు, అధికారులు యెవ్వరూ బ్రతికి బైటపడలేదు ఇది దొంగలకు నిలయం. పారిస్ నగరానికి కళంకం. దుర్వ్యసనపరులు, వంచకులు చోరులు, జారులు, దుష్టులు, భిక్షుకులు అందరూ ప్రతి ఉదయం ఇక్కడనుంచే నగరంమీదికి వరదలా వ్యాపిస్తారు. మురికి కాలువలన్నీ ఒకేలక్ష్యానికి ప్రవహించినట్లు తిరిగి రాత్రికి అందరూ అన్ని వీధులగుండా ఇక్కడికే వచ్చిపడతారు. చౌర్యం, దోపిడీ దౌర్జన్యాలవల్ల రాబట్టిన సకలవస్తుసముదాయం రాత్రికి ఇక్కడ చేరుతుంది. జిప్సీలు, వివిధదేశాలనుంచి బహిష్కృతులు, అన్యజీవనాధారంలేక వంచకశిల్పంపైనే బ్రతుకు గడిపేవారు, పగలు ముష్టి అడుక్కుంటూ రాత్రి దొంగతనాలు చేసేవారు, సర్వస్వం కోల్పోయి నగరంలో ముఖం చూపలేక పారిపోయినవారు, క్రైస్తవులు, యూదులు, మహమ్మదీయులు మొదలైన సకలమతస్థులూ, స్పానిష్, జర్మన్, ఇటాలియన్ మొదలైన అన్ని జాతులవారూ ఇక్కడ చేరతారు. విధివంచితుల కిది ఆశ్రయం. చోరహత్యా వ్యభిచారాది మహానాటకానికి పాత్రధారులు వేషాలు మార్చే నేపథ్యమిది.

అక్కడక్కడ చలిమంటల ముందు వింత వింత ఆకారాల వ్యక్తులు గుమిగూడి ఉన్నారు. అరుపులు, పెడబొబ్బలతో ప్రదేశమంతా అల్లకల్లోలంగా వుంది. మొరటు నవ్వులు, పిల్లల ఏడుపులు, స్త్రీల కేకలతో రణగొణ ధ్వనులతో చెవులు గింగుర్లెత్తుతున్నాయి రెపరెపలాడే మంటల వెలుగులలో మనిషిని పోలిన కుక్క, కుక్కను పోలిన మనిషి తిరుగాడడం కనపడుతుంది. ఇక్కడ జాతిమతవివక్షత లేదు; స్త్రీపురుష భేదం లేదు. ఆ గుడ్డి వెలుగులోనే పాత కొంపలు, పాడుపడిన యిళ్ళు, పూరిళ్ళు కనపడుతున్నాయి అక్కడక్కడ పీచు జుట్టులతో ముసలమ్మల ఆకారాలు దయ్యాలవలె తచ్చాడుతున్నాయి

ఈదృశ్యం చూసేసరికి గ్రింగైర్‌కి వణుకు పుట్టింది. అతడి ముష్టివాళ్లు విడిచిపెట్టలేదు. మతిపోతున్నది. అతని యోచనాశక్తి నీగిపోయింది; తాను చూస్తున్నది కలా నిజమా అని నిర్ధారణ చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. తన కళ్లను తాను నమ్మలేకపోతున్నాడు. "నేను నిజమా? ఇదంతా నిజమా? ఏది నిజం?" ప్రశ్నించుకున్నాడు.

ఇంతలో గంభీరకంఠధ్వని ఒకటి వినవచ్చింది.

"మహారాజువద్దకు తీసుకురండి వాణ్ణి."

"ఇక్కడొక మహారాజా! తీరా ఏ మేక మహారాజౌతుందో" అని గొణుక్కున్నాడు కవి.

కవిమీద విరుచుకుపడ్డారు వికలాంగులు. కాని ముందున్న ముగ్గురూ కవిని గట్టిగా పట్టుకుని మిగిలినవారందరినీ అడ్డగించి "విడిచిపెట్టండి. వీడు మావాడు. మేం పట్టుకున్నాం" అని హెచ్చరించారు.

అసలే చినిగిన అతనికోటు ఈసారి పేలికలయింది. ముగ్గురూ అతణ్ణి లాక్కుపోయారు.

ముగ్గురి చేతుల్లో గట్టిగా చిక్కిన కవికి ఈమారు ఇది కలగా తెలిసివచ్చింది. క్రమక్రమంగా జాగ్రదవస్థలోకి వచ్చాడు. క్రమంగా చుట్టూ పరిస్థితులు బోధపడుతున్నాయి. తానున్నది మరోలోకంకాదనీ ఈలోకమేననీ, తనచుట్టూ ఉన్నవారు భూతాలూ రాక్షసులూ కారనీ దొంగలనీ, తన ఆత్మ నరకంలో పడలేదనీ ప్రాణానికిమాత్రమే ముప్పున్నదని తెలిసివచ్చింది. అతడి ప్రాణానికి నిజంగానే ముప్పు వచ్చింది. ఈ ముప్పును కాపాడగల పణం అతనివద్ద లేదు.

అతణ్ని గుహవంటి ఒక యింటిలోనికి లాక్కువెళ్లి పెట్టారు. అక్కడ దృశ్యం చూచేసరికి కవి కల్పనాశక్తి హరించుకుపోయింది

అక్కడొక పెద్ద నెగడి మండుతున్నది. ఉవ్వెత్తున లేస్తున్న మంటల వెలుగులలో అమరికలేని మేజాలు, కుర్చీలు కన...

'ఎంత దిష్టి తగిలిందే నాతల్లీ!'
చిత్రకారుడు:—గోలి శేషయ్య (తెనాలి)

న్నాయి. వక్రడంగిపనితనం రుచిమూడని బల్లచెక్కలతోనూ కర్ర ముక్కలతోనూ నిర్మించబడిన మేజాలు కుర్చీలూ చిత్రమైన ఆకారాలలో ఉన్నాయి. కొందరక్కడ కూర్చుని మద్యం సేవిస్తున్నారు. ఉత్తుత్తిగాయంపై కట్లువిప్పుకుంటూ కుండంత పొట్టగలవాడొకడు ఈలపాట పాడుతున్నాడు. అతడివెనుక ఒక దొంగ దరీ కూర్చుని బూతుపాటలు పాడుతున్నాడు. ఒకచోట ఒక లుడు ఎలా మూర్ఛపోవాలో నేర్చుకుంటున్నాడు. చిన్న సబ్బు ముక్క నమిలి నోటిచివర నురుగెలా తెచ్చుకోవాలో వాడికి పెద్దవాడొకడు ప్రమాణసహితంగా నేర్పుతున్నాడు. ఆ సాయంకాలం దొంగిలించితెచ్చిన ఒక పసిబిడ్డకోసం నలుగురు స్త్రీలు ఒకచోట కొట్లాడుతున్నారు. ఇట్టి 'మాయానిలయం' ఫ్రెంచినాటకాలలో కెక్కిందంటే ఆశ్చర్యంలేదు.

[illegible]లలా మొరటు నవ్వులు, బూతుపాటలు, దౌర్జన్య చారిత కంఠధ్వనులు వినవస్తున్నాయి. ఒక పెద్దకుక్క నిప్పుల ముందు కూర్చుని దీర్ఘాలోచన చేస్తున్నది. ఇక్కడ బాలబాలికలు కూడా అనేకమంది ఉన్నారు.

సెగడి సమీపంలో బోర్లించిన ఎత్తైన ఒక తొట్టిపైన 'మహారాజు' ఠీవిగా కూర్చున్నాడు. తొట్టి అతడిసింహాసనం. గ్రింగైర్ క్కడ నిలబడ్డాడు. క్షణంసేపు అంతటా నిశ్శబ్దం వ్యాపించింది. గ్రింగైర్‌కి కన్నెత్తిచూసే ధైర్యంలేదు. అతణ్ణి తీసుకువచ్చిన ముగ్గురిలోనూ ఒకడు స్పానిష్ భాషలో ఏదో సమాధాన మిచ్చాడు. వెంటనే అతడి నెత్తిపైనున్న టోపీ ఎగరవేశాడొకడు.

"ఎవడురా ఈదాసుడు...?" అన్నాడు 'మహారాజు...'

గ్రింగైర్ తలెత్తి చూశాడు. ఉదయం న్యాయ సభామందిరంలో అతిథివేదిక క్రింద ఒక కమ్మిపైనెక్కి కూర్చుని యాచించిన వాడే ఈ 'మహారాజు.' పేరు క్లోపిన్. అయితే మహారాజు దుస్తులు మారలేదు. ఉదయం ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలానే ఉన్నాడు. చేతిమీద గాయంమాత్రం ఇప్పుడు లేదు. చేతిలో ఒకతోలు కొరడా ఉన్నది. ఆరోజుల్లో జనసమూహాలను కట్టడానికి రాజభటు లుపయోగించేవా రీకొరడాలు. అతడొక చిత్రమైన టోపీ ధరించాడు. అది పసిబిడ్డల కుచ్చు టోపీయో, రాజులకుచ్చు కిరీటమో చెప్పడం కష్టం. రెండూ సుమారు ఒకే పోలికనుంటాయి.

'మహారాజు'ను గుర్తించగానే ఎందుకో కవికి కొంతలో కొంత ఆశ జనించింది.

"అయ్యా! దేవరా! మహాప్రభూ! తమరినెల్లా సంబోధించాలో తెలియడంలేదు" అన్నాడు కవి.

"మహాప్రభూఅన్నా సరే, భాయీ అన్నా సరే, ఏదో ఒకటి చెప్పదల్చుకున్నది గబగబా చెప్పెయ్యి. నీ నేరానికి నువ్వేం సమర్థించుకుంటావో త్వరగా తేల్చెయ్యి." అన్నాడు మహారాజు.

"సమర్థించుకోడమా! నాలాటివాడు.....ప్రొద్దుట అంత గొప్ప నాటకం..."

"ఆపవోయ్ ఆపు. నీ పేరేమిటి? ఇటుచూడు. నువ్వెవరి సమక్షంలో ఉన్నావో తెలుసా? వంచక రాజ్యాధిపతిని నేను. ఇప్పుడు నీ నేరం విచారించడానికి న్యాయనిర్ణేతలు ముగ్గురం. నేనుగాక ఇంకొకడు జిప్సీలకు రాజు; మరొకడు సకల దేశాల దొంగల భాషానుశాసకుడు. అన్యరాజ్యానికిచెందిన పౌరుడవు నువ్వు అనుమతి లేనిదే మా రాజ్యం ప్రవేశించావు. మా నగర శాసనాల నతిక్రమించావన్నమాట. నువ్వు శిక్షకు పాత్రుడవు. దొంగతనం, జేబుదొంగతనం, దోపిడి, వంచన, ముష్టి మొదలైన వృత్తులలో ఆరితేరినవాడవైతే నీకేం భయం లేదు. నీ గుణగణా లేమిటో నీ ప్రజ్ఞ లేమిటో తెలియపరుచుకో."

కవి నిస్పృహచెందాడు. "అయ్యో! నా కంతటి అదృష్టం, గౌరవం లేవే! నేను కవిని మాత్రమే!"

"చాలింక ఆపు" అని అరిచాడు క్లోపిన్. "నీకు ఉరిశిక్ష విధించాం. ఇది మా న్యాయం విధించిన శిక్ష. మీ రాజ్యంలో మా ప్రజల కెటువంటి న్యాయం జరుగుతోందో, మా రాజ్యంలో మీకు సరిగ్గా అదే న్యాయం జరుగుతుంది. బికారులూ చోరులకోసం ఎటువంటి శిక్షలు మీరు నిర్ణయించారో, మీకూ మా రాజ్యంలో అటువంటి శిక్షలే లభిస్తాయి. దీనికి తిరుగులేదు. నీకు పడిన శిక్ష ఇంత క్రూరంగా ఉందంటే కారణం మీరే. ఉరితాడులో బిగిసి చచ్చేది ఎప్పుడూ మేమే అయితే బాగుండదు. అప్పుడప్పుడు నీతైన పెద్దమనుషులు, పరువుగల నాగరీకులు కూడా చిక్కుకుంటే గాని ఉరిస్తంభానికి గౌరవం మన్ననా లభించవు. ఊ! సిద్ధపడు. మర్యాదగా ముందే నీ దుస్తులు తీసి ఇక్కడవాళ్ళకి పంచిపెట్టు. నీ జేబులో డబ్బు తియ్యి. మద్యం కొని వీళ్ళందరికీ ఇయ్యి. తరవాత నిన్ను ఉరితీస్తుంటే వీళ్ళంతా చూసి వినోదిస్తారు. పారిస్ నగరవీధుల్లో మావాళ్ళని ఉరితీసేటప్పుడు ఎంతమంది జనం మూగి అల్లరి చేస్తారో చూశావా? మా ప్రజలు అంతమంది ఇక్కడ చేర లేకపోవచ్చును. కాని అంత అల్లరీజేసి అంతకంటె అధికంగా వినోదించగలరు. ఉరితీసేముందు దైవప్రార్థన ఏదేనా గొణుక్కోవలసివుంటే కింద సామానుగదిలోకి పో! చర్చిలోనించి ఎత్తుకొచ్చిన రాతిసిలువ ఉంది అక్కడ. నీ దేవుడితో వ్యవహారం ముగించుకోడానికి నీకు నాలుగు నిమిషాలు వ్యవధి ఇస్తాం. పో."

గ్రింగైర్ నోరు మెదపక, కన్నార్పకచూసి విన్నాడు.

వెనుక చప్పట్లు వినపడ్డాయి "ఓహో హో! ఏమి అద్భుతంగా ఉపన్యసించావోయ్ క్లోపిన్! రోమ్ చర్చి సర్వాధికారి పోప్‌లాగా మాట్లాడావ్!" అన్నాడు పండితుడైన అశ్లీల భాషానుశాసకుడు.

గ్రింగైర్‌కి అమాంతంగా రసావేశం పుట్టుకువచ్చింది. "ఓ మహాచక్రవర్తీ! పొరపాటు అనేది ఎరగని మీ గాంగో పొరపడ్డారీమాటు. నా పేరు పీర్ గ్రింగైర్! ఇవాళ ఉదయం న్యాయసభా మందిరంలో ప్రదర్శించబడిన నాటకం నాచే రచించబడింది. వినండి..."

"ఓ! నేనూ ఉన్నానక్కడ" అన్నాడు క్లోపిన్. "పొద్దున్న అక్కడ నీనాటకంతో మమ్మల్ని విసిగించింది చాలక ఇక్కడ కూడా బాధపెట్టదల్చుకున్నావా? లాభంలేదు. నీ కీరాత్రి ఉరి తప్పదు."

"అరె! ఎలాగిప్పుడీఉచ్చులోనుంచి బైటపడ్డం?" అని ఆలోచించాడు గ్రింగైర్. మరొకసారి ప్రయత్నంచేశాడు.

"అయ్యా నా దొకమనవి! కవీశ్వరుల్ని కూడా బికారులకింద ఎందుకు జమకట్టకూడదో తెలియదు. ఇతిహాసకర్త హోమర్ ముష్టివాడు. చిత్ర కథానిర్మాత ఈసోప్ బికారి. మహావక్త మెర్క్యూరీ చోరుడు."

"ఆపు ఆపు" అన్నాడు క్లోపిన్. "మమ్మల్ని మోసంచెయ్యాలని చూస్తున్నావ్! ఇదేంసాగదు. ఆట్టే అల్లరిచెయ్యక నడు ఉరిస్తంభందగ్గరికి."

"క్షమించండి మహారాజా! ఒక్క క్షణం వినండి! అసలింత శిక్ష నావంటివాడికి తగునా అని నా మనవి! అహహా! వినండి నా సమర్థన వినకుండానే శిక్ష..."

కాని కవిమాట వినేదెవరు ? అందరూ కోలాహలం చేస్తూ లేచారు. ఒక బాలుడు నిశ్చింతగా మేజాపైన గీరుతూ చప్పుడు విని ఆనందిస్తున్నాడు.

క్లోపిన్ కొంతసేపు, 'పండితుని'తోనూ, జిప్సీల రాజుతోనూ సంప్రదింపులు సాగించాడు. "అల్లరి చేయకండి" అని అరిచాడు జిప్సీలరాజు. అందరూ నోళ్లు కటుకున్నారు. కాని ప్రక్కన మరుగుతున్న నీళ్లు, పెనంపైన మాంసంముక్క రాజాజ్ఞ మన్నించ లేదు. మహారాజుకి కోపంతో మొఖం ఎర్రబడిపోయింది సింహాసనంమీదినుంచి ఒక్క ఉదుటున దుమికి నీళ్ళగిన్నెనూ, పెనాన్నీ ఒక్క తాపు తన్నాడు. దగ్గర మేజాపైకూర్చున్న బాలుడు కిందపడి ఏడువ నారంభించాడు. పెనంపెన మాంసంముక్క నిప్పులోపడి పోయింది. తరువాత శాంతించి మహారాజు సింహాసన సమధిష్ఠించాడు.

మహారాజు సంజ్ఞ చేశాడు. సామంతులు అతనిచుట్టూ మూగారు. అందరికీమధ్య గ్రింగైర్ నిలబడే ఉన్నాడు. వికృత ముఖాలు, క్రూరదృష్టులు, పేలికలైన దుస్తులు, ఆచ్ఛాదనలేని చేతులు, కాళ్లు, చిక్కి శల్యాలైన దేహాలు, తుప్పుపట్టిన విరిగిన కత్తులు, ఇనుపముక్కలు ఇవన్నీ చూసేసరికి కవి భయభీతుడైనాడు. అందరిమధ్యా మహారాజఠీవితో క్లోపిన్ అధికారం వెలగబెడుతున్నాడు. మహారాజుముఖంలో క్రౌర్యం, దౌర్జన్యం మూర్తీభవించినాయి.

క్లోపిన్ తన వంకరగడ్డాన్ని మొరటువేళ్లతో తాటిస్తూ గ్రింగైర్ వంకచూసి ఇలా అన్నాడు: "ఒరే! నిన్నెందు కురి తియ్యకూడదో నాకు కారణం కనపడదు. నీకిది బొత్తిగా రుచించటంలేదని తెలుస్తూనే వుంది. అది సహజమే. పారిస్‌లో నీవంటివా ళ్లెప్పుడూ ఇటువంటివి రుచి చూడలేదు. మీకు ఉరి అంటే మరీ భయం ఎక్కువ. ఇంతా చేస్తే మాకు నీమీద ఏమీ కోపంలేదు. ఇందులోనించి తప్పించుకోడానికి నీకొక్కటే ఉపాయం ఉంది. నువ్వు మాలో చేరిపోతావా?"

ఉపాయం లేదనుకున్న గ్రింగైర్ చెవులకీ మాటలు అమృతంలా సోకాయి. వెంటనే అంగీకరించాడు.

"తప్పకుండా! ఓ! తప్పకుండా చేరిపోతాను" అన్నాడు తడబడుతూ.

"అయితే నువ్వొప్పుకున్నావన్న మాట! మావృత్తులవలంబించి మా శాసనాలకి తలొగ్గుతున్నావు!"

"తప్పకుండా! నేను మీలో ఒకణ్ణి."

"బికారివి?"

"బికారిని"

"దొంగవు?"

"దొంగని"

"వంచకుడవ్?"

"వంచకుణ్ణి."

"మనస్ఫూర్తిగా?"

"మనస్ఫూర్తిగా"

"భేష్! అయినాసరే నీకు ఉరి తప్పదు."

"అదేమిటి మళ్ళీ?"

"అంటే, అప్పుడే నిన్ను ఉరితియ్యడం లేదు. ఈమాటు పారిస్ నగరంలో పరువుగలవారిమధ్య బహిరంగంగా పారిస్ పోలీసుల సహాయంతో నగరాధికారుల అజమాయిషీలో తలారిచేత ఉరి తియ్యబడతావ్!"

"ఓ అదా! అందుకు సిద్ధమే!"

"అది కొంత నయమేకదా! ఇంతే కాదు. పారిస్ నగరవాసుల మాదిరిగా పన్నులు చెల్లించే బాధనీకింక లేదు."

"మరీ మంచిది. నేనూ ఒక బికారినే. అసలు ఇంతకుముం నేను బికారిని. తత్వవేత్త తత్వమే అటువంటిది."

"తత్వం చాలదోయ్"అన్నాడు క్లోపిన్. "ఊహాలో అవ ముందుకి రాదు. మాలో చేరాలంటే ఏదో ఒక వృత్తి నీకు సవుసని చూపించుకోవాలి. ఏదీ జేబు లెల్లా కొట్టగలవో మచ్చు చూపించు."

క్లోపిన్ సంజ్ఞ చేశాడు. సంజ్ఞ గమనించి ఇద్దరు రెండు పైన పొడుగు కర్రలు తీసుకువచ్చారు. రెండు కర్రలకూ చెక్కలు నాటబడి ఉన్నాయి. చెక్కలపైన వాటిని నిలబెట్టా పై చివరలు రెండింటినీ కలిపి ఒక కర్ర అమర్చారు. తన ఎదుట అమర్చబడుతున్న ఈ యేర్పాటు గ్రింగెర్‌కి ఉ స్తంభంలా కనపడింది. పైకర్ర కొక ఉచ్చు వ్రేలాడతీయబడిం అంతా క్షణంలో ఏర్పాటయిపోయింది. దిష్టిబొమ్మ నొకదాని తెచ్చి ఉచ్చులో వ్రేలాడతీశారు. దిష్టిబొమ్మనిండా చిన్న చి గంటలు కట్టబడ్డాయి. త్రాడు ఊపు ఆగి గంటల గణగణ మణగడా కొంతసేపు పట్టింది. దిష్టిబొమ్మ కింద ఎత్తైన ఒక ముక్కాలి ఉంచబడింది.

క్లోపిన్ ముక్కాలిపీటవంక చూపుతూ అన్నా[illegible] ఊఁ!"

"ఆ పీట కాళ్ళు సరిగా లేవు. చాల ఎత్తుగా ఉంది. ద మీదినించి కింద పడితే మెడ విరుగుతుంది" అన్నాడు గ్రింగై

"ఎక్కరా ముందు" అని బెదరించాడు క్లోపిన్.

గ్రింగైర్ ముక్కాలిపీటఎక్కి నిలబడ్డాడు. ముక్కాలి ఊగిసలాడింది. పడిపోకుండా నిలవడానికి కతడికి కొంతసేపుపట్టిం

"ఆ! ఇప్పుడు. కుడికాలెత్తి ఎడమమోకాలికానించు. ఎ కాలి బొటనవేలిమీద నిలబడాలి. ఊఁ" అని ఆజ్ఞాపించాడు క్లోపి

"ఓయ్ భగవంతుడా! ఇంక నేను పడిపోక తప్పదన్నమా నాకు కాలో చెయ్యో విరక్కుండా వీల్లేదన్నమాట"

"వీలేదు" అన్నాడు క్లోపిన్ విసుగుతో. "ఇదిగో ఇటువి నీవాగు డెక్కువగా ఉంది. పనికిరాదు మాదగ్గరది. రెం ముక్కల్లో చెప్తున్నాను. ఎడమకాలి బొటనవేలిమీద నిల దిష్టిబొమ్మ జేబు సందుకోవాలి నువ్వు. ఆ జేబులోఉన్న ప లాగాలి. ఆగంటల్లో ఒక్కటీ మోగకుండా నువ్వా పర్సు తీశా సరే. నువ్వు మాలో చేరిపోవచ్చు. అప్పుడు నీకు వారంరో శిక్షణ ఇస్తాం—ఒళ్లు చితకబొడిచి."

"బాగుంది! నామాట వినకుండా ఆగంటలు మోగితేనో" అని అడిగాడు గ్రింగైర్.

"ఏముంది! నిన్ను ఉరితీసేస్తాం. అంతే! తెలిసిందా?"

"ఉహు! తెలియలేదు."

"అయితే మరోసారి చెప్తున్నా విను. ఆ దిష్టిబొ జేబులో పర్సు కొట్టెయ్యాలి నువ్వు. గంటలుమోగితే మట్ట అక్కడికక్కడేనిన్ను ఉరితీసేస్తాం. నువ్వు పీటదిగవలసిన పనిలే ఇప్పుడు తెలిసిందా?"

"ఇదేం తెలియడం? నన్ను ఉరైనా తీస్తారు, లేకపోతే చితకబొడుస్తారా ?"

"చితకబొడుస్తాం! మారాజ్యంలో స్వేచ్ఛగా బికారివాళ అది చాలదూ నీకు? నీకోసమే నిన్ను చితగ్గొట్టాలి తెలు పారిస్‌లో రక్షకభటులు ఇంక ఎంతచితగ్గొట్టినా ఫరవాఉండ

"అవును ఫరవాలేదు" అన్నాడు గ్రింగైర్. అస లేమి అతడికి తెలియలేదు.

"ఊఁ కానీ! కాలెత్తు" అన్నాడు క్లోపిన్ గద్దిస్తూ.

(54-వ పేజీ చూడుడు)

దరఖాస్తుఫారం

[ఆంధ్రదేశపు ఒకానొక మారుమూల పల్లెటూళ్ళో పొద్దున్న పదిగంటలవేళ - కాగా బతికి ఇప్పుడిప్పుడే చితుకుతున్న సంసారి ఆదిశేషయ్యగారి భార్య సీతామమ్మ, ఆవిడ మేనగోడలు అందరూ చిన్నమ్మ అని పిలిచే విశాలాక్షి వడ్లు దంపుతున్నారు.]

సీతా: సువ్విసువ్వన్నలారా -

సువ్వన్నలారా!

మళ్లిసువ్వన్నలార -

మా యన్నలారా!

పొద్దున్న రాముడు పాల మెల్లినాడు

ఇంటికొచ్చి దేవివేవేమి పనులూ?—

సువ్వి—

కొట్టొద్దు అదేమిటే మా అమ్మా! అంత బలంగా పోటువేస్తే పొత్రం ఊడేను. కొంచెం సత్తువ తగ్గించి పోటు వెయ్. మరేం చేతులు ఊడిపడిపోవు.

విశా: ఏమోనమ్మ. ఎంత బలంగా దంచినా ఏదో ఒక వంక పెట్టకుండా ఉండవు కదా.

సీతా: బాగుందేవ్. రేపు పట్నంలో మా రాజుగాడితో కాపరం పెట్టాక కూడా ఇలాగే పనిపాట్లు చేస్తావన్నమాట!

విశా: స్వర్గానికెళ్ళినా సవతిపోరు తప్పలేదని - పట్నానికెళ్ళినా ఈ దంపుళ్లు తప్పవా?

సీతా: పనిపాట్లు చేసుకొంటే తప్పేముంది? సంసారులం కావూ? సర్లే దబదబా నాలుగు పోటులు వెయ్యి. ఎసరు మరుగుతూ ఉంటుంది. ఈ పూటకి నాలుగు గింజలు తిరిగి ఉడకెయ్యాలి.

సువ్వి సువ్వన్నలారా! సువ్వన్న లారా...

మళ్లి సువ్వన్నలారా...మాయన్న లారా...

మంగళంపాడుతూ మేడపైనుండే

ఆడేటి బాలుడూ ఇళ్లకొచ్చేను

ఇళ్లకొచ్చిన బాల కల్లోకొచ్చేను-

సువ్వి—

పాట నువ్వూ అందుకో - ఒకర్తెనే ఎంతని పాడేది.

విశా: ఈ పాటలేవిటో నాకు రావు.

సీతా: రావంటే సరిపోతుందా ఏమిటి? నేర్చుకో.

విశా: నాకీ పాటలేం అక్కర్లేదు.

సీతా: అక్కర్లేదంటే సరిపోతుందా ఏమిటి? రేపు మా రాజుగాడితో...

విశా: ఈ పాటలు నేర్చుకోకపోతే బావకి నన్ను చేసుకోవు అంతేగా—పీడా పోయె.

సీత: ఔవ్వ, ఔవ్వ అదేంమాటే.

విశా: మరి లేకపోతే ఏమిటి? పొద్దున్న లేచింది మొదలు కళ్లాపు జల్లకపోతే, రేపు మా రాజుగాడితో కాపరం ఇలాగే చేస్తావా అంటావు. గొడ్లకి కుడితి, గడ్డీ చూడకపోతే, రేపు మా రాజుగాడితో ఇలాగే సంసారం చక్కబెట్టుకొంటావా అంటావు. వడ్లు దంచడం నాకురాదో మొర్రో అంటే విన వాయె. చెరగడం జల్లించడం రాదంటే ససేమిరా చెవిని పెట్టవాయె. ఇలాగే నా దుంప తెంపితే నా ఎత్తు ధనం పోసినా ఈ పెళ్ళి నాకొద్దు అని మా నాన్నతో చెప్పేస్తా.

ఆరుద్ర

సీతా: సరి, సరి. ఆ౹౹ మరి ప్రేమించాను, బావనే పెళ్ళిచేసుకొంటాను అని పట్టుపట్టావే...

విశా: ఏం, ఇప్పుడుమటుకు కాదన్నానేమిటి? ఇప్పటికీ బావనే ప్రేమిస్తున్నా.

సీతా: మరి తెగతెంపులేమిటి?

విశా: నీ కోసం ప్రతీకం చూడబోతే బావ నాకు పుస్తికట్టినా నువ్వే నాతో సంసారం చేసేటట్టున్నావ్. బావతో కాపరం చేద్దామని సంబరపడుతున్నా గాని నీతో ఎవరు వేగగలరు నా తల్లీ...

సీతా: ఎంతదానివయ్యావే మా అమ్మా.. ఏదో కాలేజీలో బుద్ధిగా చదువుకొంటున్నావ్. తక్కిన ఇంగిలీషు చదువుతున్న రంగేళీ అమ్మాయిలమల్లే కాక కుదురుగా ఉన్నావని మీ అమ్మా నాన్నా చెపితే ఏవిటో అనుకొన్నా. నువ్వూ ఇంతే నన్నమాట!

విశా: నేనూ చెడిపోయానని వేగం తేల్చుకో...

సీతా: తేల్చుకోడం ఏమిటి నా మొహం. ఎదురుగుండా అద్దముంది, మొఖముంది. ఇంతకీ ముంజేతి మురుక్కి అద్దమెందుకూ? కచ్చితంగా కనబడుతూంటే.

విశా: ఏమిటమ్మా కనబడుతూంది? నేనేవిటి చెడిపోయానో చెప్పు. వింటా?

సీతా: నేను తొలిదగ్గర్నుంచి మొత్తుకొంటూనే ఉన్నా. మీ నాన్న వింటేనా ఒద్దు ఒద్దంటే ఈ ఇంగిలీషు చదువు పెట్టాడు. ఆడవాళ్ళకి అందులోకి మన లాంటి సంసార్లకి.

విశా: ఇంగ్లీషు చదువుకొన్న ప్రతిఆడదీ చెడిపోయినదే! పుట్టి బుద్ధెరిగాక కళ్ళాపులు జల్లడం చేతకాకపోతే చెడిపోయినట్లా, పాలుపితకడం తెలీకపోతే చెడిపోయినట్లా, వడ్లు దంచడం పట్టుబడకపోతే చెడిపోయినట్లా? చెడిపోటానికి ఇంగ్లీషే చదవక్కర్లా.. ఏ చదువు చదివిందని మీ మూడో తోటి కోడలు.........

సీతా: నీతో దండంతల్లీ. అవేం కదిలించకు; నాది బుద్ధిపొరపాటు. మాటలు నేర్చిన కుక్క ఉస్కో అంటే ఉస్కో అందట.

విశా: నేను కుక్కనా...

సీతా: నువ్వు కాదే మా అమ్మ నేనే ఆ కుక్కని. ఇంతకీ కొంచెం సాయం చేస్తావా చెయ్యవా.

విశా: నేను చెయ్యను.

సీతా: మా అమ్మవు కావూ? ఈపూట భోజనానికి గింజల్లేవు...రా...రెండు పోట్లేసి—

విశా: ఊరికే మాటకి మాట పెంచి నన్ను సాధించను అంటే సాయంచేస్తా!

సీతా: బుద్ధి గడ్డితిని అన్నాను. మరి మాట్లాడను రా...

(వడ్లు దంచుతున్న చప్పుడు అరనిముషం)

విశా: అత్తా...

సీతా: (మాట్లాడదు).

విశా: అత్తా...నిన్నే.

సీతా: మాట్లాడొద్దన్నావుగా...

విశా: సాధించవొద్దన్నాను గాని మాటామంతీ ఒద్దన్నానా.

[పనివాడు వెంకాయి]

వెంకా: అమ్మగోరూ...అమ్మగోరూ...

సీతా: అట్టె అట్టె.. అక్కడే ఉండరా.. మడిగట్టుకు ఒడ్లు దంచుతూఉంటే...

వెం: సర్లెండి...

సీతా: సర్లెండి అని కదలవే! ఏం కర్మొచ్చిందిరా భగవంతుడా...మడీ మంటి గడ్డలూ...

విశా: వాడక్కడ నిల్చున్నంతమాత్రానే మడి తగలడిపోతుందా ఏం...ఇంతకీ మడి కట్టుకు ఒడ్లు దంచడమెందుకూ?

సీతా: గడిగడిక్కి స్నానంచేసే ఓపి

కెక్కడ వచ్చింది. మళ్ళా మడికట్టుకు వంటచేసే బాధ తప్పుతుందని. ఏంరా... అంట్లపీనుగా. అలా నోరు వెళ్ళబెట్టుకు నించుంటావేం, వచ్చిన పనేదో అఘోరించు...

వెం : మరేనండి... చిన్నమ్మగోరూ... అబ్బాయిగోరికి కాఫీ కావాలంట. మరగేసి పంపిమంటుండారు.

సీతా : ఈ కాఫీకో వేళాపాళా లేదా ఏమిటి. మొఖం కడుక్కోకుండా కాఫీ, మొగం కడుక్కొని కాఫీ, ఎనిమిది గంటలకి కాఫీ...

విశా : పోనీ అత్తా, కాఫీయేకదా. ఏం భాగ్యం.

సీతా : ఏం కర్మ...చెయ్యి వీల్లేదని చెప్పరా...

విశా : ఉండత్తా. ఎసరు మరుగుతున్నదన్నావుగా. నిమిషంలో కాఫీ పెట్టిఇస్తాను. ఉండరా వెంకాయి.

సీతా : అదేవిటే. మా అమ్మ. మైలపడతావటే...నువ్వుముట్టుకూ ... అరగా అరగా స్నానా లెక్కడచెయ్యగలవు?

విశా : కాఫీ కలిపినంతమాత్రాన మైలపడిపోతానా ఏమిటి?

సీతా : కాదటేమరి. ఆ వెధవ దిక్కుమాలిన అప్రాచ్యపు కాఫీ పొడుం ముట్టుకొంటే స్నానం చెయ్యక్కర్లా. ఆ చేతులతోనే వంటచేస్తే దేవతార్చనకి నైవేద్యానికి సరిపోతుందా?

విశా : ఐతేసరి. నీమడికూడా కుక్కముట్టుకుంది.

సీతా : అదేమిటే తల్లీ అదేమిటి?

విశా : ఇందాకల నువ్వు ఏటికి నీళ్ళు తెచ్చేందుకు వెళ్ళినప్పుడు ఒకసారి బావకి కాఫీ పట్టుకెళ్ళా. మళ్ళా స్నానం చెయ్యలేదు.

సీతా : అయ్యొ రాతా......నయం చెప్పావ్...లేకపోతే ఎంత ఘోరం జరిగేది.

విశా : బతికించావులే ఎలాగా మడిబియ్యం కావు. కాబట్టి వెంకాయి పెళ్లం చంద్రమ్మని కేకేస్తా. అది దంపిపోతుంది. ఒరే వెంకాయి! నీ పెళ్లాన్ని కేకేసిరా. ఈలోపున కాఫీ తయారుచేసి ఉంచుతా.

సీతా : ఏమిటో మడి మడి అని నేను వాపోవమేగాని. ఒరే వంకాయి. వేగం రమ్మను - నీ దొరసాన్ని.

[పక్కింటి సూరయ్య, చలపతి వస్తారు.]

సూ : ఒరే బాబూ...రాజా...

సీతా : ఏమిటి సూరయ్య బాబూ...... అలా ఒగర్చుకొంటూ వస్తున్నావ్...... కూర్చో మరేం ప్రమాదం...

చల : జరిగిందో లేదో అని లేచ్చుకొం దాకుని వచ్చాం. అదీ సంగతి.

సూ : రాజేడీ? వదినా...

సీతా : మేడమీద చదువుకొంటున్నాడు. కూర్చో...ఏమిటి గడబిడ...

సూ : ఎలా కూర్చోను వదినా...

చల : నిజమే ఎలా కూర్చోమంటారు. అదేమిటో తేలకపోతే మనసు కుదుటపడుతుందా. పడదు. అదీ సంగతి.

సీతా : ఇంతకీ...ఏమిటి సంగతి.

సూ : టెల్లిగ్రా మొచ్చిం దొదినా... టెలిగ్రాం......ఏం పాడు కబురో అని ప్రాణాలు కొట్టుకొంటున్నాయి. రాజు చదివి చెప్తాడని.

సీతా : ఉండు కేకేస్తా......ఒరే రాజా గా......రాజా......ఏం సూరయ్య బాబూ......మీ వంకటరత్నం ఏవయ్యాడూ...వాడూ చదివేడుగా ఎఫ్ఫే ఇంగ్లీషు...ఇంకా టెల్లిగ్రావులు చదివి అర్థం చెప్పేపాటి చదువుకోలేదా ఏమిటి? ఏం చలపతీ......నువ్వూ చదివేనన్నావ్. యింగ్లీషు నువ్వు చదివి చెప్పకూడదూ...

చలపతి : అc. ఏదో తెలుగువాళ్లతో ఇంగ్లీషు మాట్లాడ్డం నాకొచ్చుగాని అదీ కాక టెల్లిగ్రాములు దొరల దస్తూరీలో రాస్తారు. అదీ సంగతి. నేను చెన్నాపట్టణం వెళ్లేను గనుకనా దొరల దస్తూరీ పోల్చుకోడానికి.

సూరయ్య : రాజు రాడేవమ్మా...

సీతా : దిగిరావాలా...అc. మీ వెంకటరత్నం కూడా చెన్నాపట్నంలో చదువుకోలేదుకదూ...అందుకేగాబోలు దొరలదస్తూరీ తెలిసుండలేదు అంతేనా...

చలపతి : అదీ సంగతి.

సూర : ఇదిగో...చలపతీ...మా వేంకటరత్నం ఇలాటి బోడి ముంకన్నర టెల్లిగ్రాములు సవాలక్షన్నర మంచినీళ్ళప్రాయంగా చదివి అరటిపండు వొలిచినట్టు అర్థం చెప్పగలడు; ఏమనుకొన్నావ్. నీలాగ బోట్లరు ముక్కల చదువు అనుకొన్నావా ...బి. య్యే. తప్పాడు.

సీతా : మరైతే...మావాడిదగ్గరికి పరిగెత్తుకొంటూ వచ్చావేంబాబూ...మీవాడిచేతే చదివించుకోలేకపోయావా.

సూర : అయ నేడుంటే నాయీ బ్రాహ్మడెందుకూ అని. మావాడు ఊళ్ళో ఉంటే ఇక్కడదాకా వస్తానా.

చలపతి : అదీ సంగతి...

సీతా : ఏం ఏ ఊరెళ్లాడేం...

సూర : ఉద్యోగంకోసం చెన్నాపట్టం వెళ్ళాడు. రాజురాడేం...

సీతా : వస్తాడు. మేడమెట్లన్నీ దిగాలామరి. అయితే వెంకటరత్నం పాటచేస్ట్ పట్టుకు...

(55-వ పేజీ చూడండి)



విజ్ఞానవీధులు

"డాక్టర్"



156. చనిపోవుట

అనగా నేమి? అది ఎట్లు జరుగును? అని 'కినాడనుంచి తోట వెంకట పద్మనాభము రు అడుగుతున్నారు.

స్మృతి తప్పిపోవుట, ఊపి రాగిపోవుట, ౹డెకాయ కొట్టుకొనక నిలిచిపోవుట, రము బిర్రబిగుసుకొనుట అన్నవి మనకి బడే మరణలక్షణాలు. స్మృతి తప్పుట ణము కాదని మనకి తెలుసును. నీటిలో నిగిపోయినవారికీ, ఎలెక్ట్రిక్ షాకు దెబ్బ వారికీ ఊపిరాగిపోతుంది. బోరగిల్లా పడుకోబెట్టి నడ్డిమీద ఉండీ ఉడిగీ నొక్కి, హాస్పిటలులో 'ఐరన్ లంగ్' అనే యంత్రంవల్ల కృత్రిమశ్వాసని కల్పిస్తే (మూడు నాలుగు గంటలసేపుకూడా అవసరమైన కేసులున్నాయి) ఆ 'రోగి' మళ్లీ బ్రతకడమూ ప్రసిద్ధములే. గుండె ఆగిన రోగులుకూడా గుండెకు ఇచ్చిన ఇంజక్షనులవల్లా, ఇతర పద్ధతులవల్లా, కొందరు బ్రతికినట్టు వింటున్నాము. ఇదివరకు కల్పితశ్వాస పద్ధతి తెలియని రోజులలోనూ, చోట్లలోనూ ఊపిరాగిపోడమే సగము చావుగా గణించబడేది. ఈ విజ్ఞానము లభించిన తర్వాత గుండె ఆగిపోవడమే చావు అనిపించింది. సుదీర్ఘమైన హృదయచికిత్స తెలిస్తే (తాత్కాలికంగా) గుండె ఆగిపోవడము చావుకాదని తేల్తుంది. అయితే బిర్రబిగుసుకునిపోయిన శరీరములో జీవను రావడ మింకా తెలియలేదు. కనక "(గుండె ఆగిన అనంతరము) శరీరము బిర్రబిగుసుకుపోవడమే చావు" అన్నదే ఈనాడు చావంటే చెప్పవలసిన అర్థము. అది ఎట్లు కలుగును? అంటే మాత్రము కారణాలు చాలా చెప్పవలసివస్తుంది. చివరకి కనబడే లక్షణాలు మాత్రము ఊపిరీ, గుండె, ఆగిపోవడమూ, శరిరము బిర్రబిగుసుకుపోవడమూను, అవే.

క్షయరోగికి ఊపిరితిత్తులు చెడిపోయి మృత్యువు సంభవిస్తుంది. టైఫాయిడ్ రోగికి పేగులు పాడై మృత్యువు వస్తుంది. పక్షవాత రోగికి మెదడులో నెత్తురు కాలవలు చిట్లిపోయి మృత్యువువస్తుంది. వైద్య శాస్త్రము ఏమంటుందంటే, ముందుముందు ఈ వ్యాధులకు చికిత్సలు సులువౌతాయంటుంది. కళ్ళలోని 'కటకములు' ఒకరివి ఇంకొకరికి అమర్చుతున్నారు. ఒకరి నెత్తురు ఇంకొకరికి ఎక్కించి బ్రతికిస్తున్నారు. అలాగే క్షయరోగికి మరియొకరి ఊపిరితిత్తులూ, టైఫాయిడ్ రోగికి ఇంకొకరి పేగులూ, పక్షవాత రోగి మెదడుకి శుభ్రస్నానమూ, ఇవ్వగలిగిన నాడు మృత్యువు దూరంగాపోయి స్వర్గము భూమిమీదికి దిగుతుందంటుంది వైద్య శాస్త్రము.

"శరీరములో ఒక అవయవము చెడిపోవడమువల్ల సర్వాంగ సంక్షోభానికి ముప్పు వచ్చి, మృత్యువు కలుగుతున్నట్టు నేడు తెలుస్తోంది. కనక మన దృష్టి కేంద్రీకరణ ఆ రోగావయవముమీదనే చేసి దాని రోగము నివారణచేస్తే మృత్యువునే నివారించినట్లవుతుంది." అన్నది జీవశాస్త్రజ్ఞుల సుందర స్వప్నము. కలరారోగి శరీరములో, కండరాలలో, నరాలలో నున్న తడి అంతా విరేచనము ద్వారానూ వాంతులవల్లనూ పోతుంది. ఇది తెలిసి, నేటి వైద్యులు ఆ రోగులకు వంట్లో నీరు హరించిపోకుండా ఉప్పునీరు ఎక్కించుతున్నారూ. కలరా నివారణ చేస్తూనూ వున్నారు. అలాగే, "అవయవ ఆరోగ్యము నిలబెట్టినట్టయితే మనిషినే నిలబెట్టగలము, అంటే మర్త్యులను అమరులనుగా చెయ్యగలము" అని జీవశాస్త్రజ్ఞులు కలలు కంటూన్నారు. నేటికలలే రేపటికి సాధ్యాలు అవుతూన్నాయి. ఇదికూడా అవాలి. ఎందుకు కాదూ?

ఆరోగ్య సూత్రాలను అమలులో పెట్టినందువల్ల పాశ్చాత్యదేశాలలో ఆయుఃప్రమాణము ఎక్కువైంది. (లేకుంటే భగవంతుడు హెచ్చు ఆయుస్సు పోసినవారిని పశ్చిమ దేశాల్లో పడేస్తున్నాడనాలి.) దోమల్ని హతమారిస్తే సైప్రస్‌నించి మలేరియా పారిపోయింది. తగిన జాగ్రత్త తీసుకోడమువల్ల గోదావరి పుష్కరాలలో కలరా రాకుండా ఆగింది. "కాబట్టి సరిగ్గా చెయ్యగలిగితే మృత్యువుకూడా నశించిపోతుంది" అన్నది ఊహాగానము. వట్టి గానము మట్టుకు కాదు. శాస్త్రజ్ఞుల, మేధావుల ఊహాగానము. (అమృత ముంటుందని నమ్మేవాళ్ళ మీది నమ్మలేమూ?)


చిట్టిప్రశ్నలకు జవాబులు

—అవును. మంచుగడ్డ నీటికన్న తేలిక. అందుకే మంచుగడ్డ ముక్కలు నీటిలో తేల్తాయి. ముక్కలే కాదు. దక్షిణ ధృవ ప్రాంతమున మంచుగడ్డ కొండలు సముద్రములో తేలుతూ జరుగుతాయి. చిత్ర మేమిటంటే ఏడువంతుల మంచుగడ్డ ఆరువంతుల నీటి బరువుకి సమానము. అందువల్ల మంచుగడ్డలో ఆరు వంతులు నీటిలో మునిగి, ఒక వంతు మాత్రమే తేలుతుంది. నీటిపైన కనపడే పరిమాణానికి ఆరు రెట్లు నీటి అడుగున వుంటుందన్న మాట మంచుకొండకి. కనకనే చేపలు పట్టే పడవవాళ్ళు చిన్న మంచుగడ్డ మాత్రమే తేలుతూ వచ్చినట్లు కనబడినా, దానికి ఆరురెట్ల కొండ నీటి అడుగున ఉన్నదని గ్రహించి అది పడవని ఢీకొట్టకుండా తొలగిపోతారు.

—ఆదివారము, సోమవారము, మంగళవారము అని రోజులకు వారాలపేర్లు పెట్టుకోడమువల్ల లాభ మేమిటంటారా? పెద్ద లాభము ఏదీ లేదు. ఏదేనా ఒకరోజు ఈ ఏడు రోజులలోనూ ఎన్నవ రోజో తెలుస్తుంది. మన పూర్వుల శాసనాలలో శక సంవత్సరాలూ, మాసమూ, పక్షమూ, తిథీ, ఉదాహరించేవారు. తద్వారా ఆ శాసనము రాయించిన రోజు ఫలాని రోజు అని నిర్ణయించవచ్చును. శక సంవత్సరాలిన్ని అని చెప్పకపోతే,—నలనామ సంవత్సర ఆశ్వయుజ బహుళదశమి అనిమాత్రమే రాస్తే— ఆరోజు ఫలానిది అని తెలియదు. నలనామ సంవత్సరము 60 ఏళ్ళ కొకమారు వస్తుంది. ఈశాసనంలోది ఏ నలనామసంవత్సరమో? తెలియదు గదా? అయితే, ఈ సంవత్సరపు పేరూ, మాసమూ, పక్షమూ, తిథీ కాక వారము కూడా రాస్తే ఆ రోజు ఫలానా అని నిర్ణయమైపోతుంది. ఏమంటే, సంవత్సరమూ, మాసమూ, పక్షమూ, తిథీ, వారమూ అన్నీ ఏ రెండు రోజులకీ సమానముగా ఉండవు. వారభేదము రోజుని నిశ్చయిస్తుంది. కాని ఒక రోజుని నిర్ణయించడానికి, శక సంవత్సరమూ, మాసమూ, పక్షమూ, తిథీ చాలు. తారీకు వేస్తే ఆఖరి రెండింటి పనీ చేసేస్తుంది. ప్రస్తుత వ్యవహార మిదే.

—ఆ, మనదేశపు గడియారాలు నీటి గూనలో అర్ధ చంద్రాకారపు గిన్నెకు అడుగున రంధ్రముచేసి ఆ నీటిలో వేసి, ఆ గిన్నెలోనికి చేరే నీటియొక్క మట్టమువల్ల గడియలను తెలిపే గడియారాలేనని సాక్ష్యమున్నది. ఇంతమాత్రమే కాదు. ఆ నీరు గంగాజలమనీ, ఆ కుండకము బంగారు కుండకమనీ కూడా చెపుతుంది స్త్రీలు పాడుకునే శ్రీరామ పట్టాభిషేకపు పాట. జైమిని భారతములోని "జడముడి జాహ్నవీ తట నిశాకరపోతము చూచి ఎవ్వరీ, కొది మెలుగట్టి పెండ్లికొడుకుం గడియారము మోవజేసిరం, చదుగ" అన్న పద్యానికి కూడా పై పాటలోని గడియారపు వర్ణన వ్యాఖ్యానముగా సరిపోతుంది. ఆపాట ఏ కాలపుదో నిర్ణయించడానికి ఆధారాలు లేవు.

—నాలుక కింద ధర్మామీటరును పెట్టుకున్నప్పుడు, చంకలో చేతికింద పెట్టినప్పటికంటె ఒక డిగ్రీ ఎక్కువ జూపడానికి, నాలుక కిందిచోటు ఎప్పుడూ మూతపడే వుండడమూ, చంకలు అంతకంటె తక్కువకాలమే మూతపడి ఉండడమూ కారణము. చంటిపిల్లలకూ, జంతువులకూ ఆసనములో చూస్తారు ఉష్ణాన్ని.





—ఒక పొడుగాటితాడునిఒక కొసకిటికీ ఊచకి కట్టి రెండో కొసని పట్టుకుని పైకీ కిందకీ జోరుగా ఊగిసలాడిస్తే, కెరటములాంటి వంపులు బొమ్మలో చూపినట్లు తాటిమీద సాగిపోతాయి. తాటికి స్థితిస్థాపకశక్తి ఉండడమువల్ల ఇది సాధ్యమౌతోంది. నీటిమీద పలాచటి పొర ఉంటుంది. నీటిలో ఒక రాతిని వేస్తే అది తన బరువు ఈ పొరని అడుక్కి నొక్కుతుంది. రాయి అడుక్కి దిగిపోగానే అడుక్కు దిగిన భాగము రబ్బరులాగ పైకి వచ్చేసి ఊగిసలాడుతుంది. అందువల్ల పొర మీద అన్ని వైపులకీ అల వ్యాపిస్తుంది.

—అవును 'మన మాటలవల్ల గాలిలో కలిగిన సంచలనము తీవ్రత తగ్గిపోయినా, ఎల్లకాలమూ గాలిలో వుంటునే వుంటాయ'న్న పలుకులు చాలామంది శాస్త్రజ్ఞులే రాశారు. అయితే మనము ఇసక పర్రమీద నడిచివెళ్ళిన అడుగు జాడలుకూడా, ఎంత చెరిగిపోయినా సూక్ష్మప్రమాణాలతో వుండాలిగదా? మనము భూమిని కాలితో గట్టిగా తన్నితే ఆ అదురు - ఎంత సూక్ష్మమైనదేనా వుండితీరాలిగదా? ఇలాగ రాస్తూపోతే అన్నీ ఉంటాయనే చెప్పాలి. అయితే ఈ వున్నందుకు ఫలితమేమిటో? శూన్యం. ఆ ఆలోచనలకి మాత్రము?

—వస్తువుల బరువు వాటిలోని పదార్థపు దట్టింపునిబట్టే వుంటుంది. నక్షత్రాలలో అత్యధిక పీడనమువల్ల పిడికెడు వస్తువు కొన్ని టన్నులుంటుందంటే ఆశ్చర్యమెందుకూ? ఆ వస్తువు భూలోకవాసులకు తెలిసిన 96 మూలపదార్థాల వస్తువు మాత్రం కాదు. ఈ వస్తువుకి అంత సాంద్రతలేదు.

—ఆలోచనా, విచక్షణా చెయ్యని మానవుని బుర్రకు పుట్టిన బుద్ధి కుడికలతో గాని పోదన్నది ఎప్పటికి నిజమే. ఈ రెండు ప్రవృత్తులనూ చక్కగా పెంచుకోడమే బుద్ధి మార్చుకోడానికి మార్గం. ★





వానపాట

జ. శ్రీరామమూర్తి

★

వర్షించు వర్షించు అందాల
మేఘమా
వర్షించు కర్షకుడు హర్షమందే
లాగు

చిటపటా తటతటా
జల్లుగా వెల్లువగ
జోరుగా హోరుగా
వర్షించు వర్షించు

వాన వల్లప్పలు
కప్ప కామప్పలు
కాగితపు తెప్పలు
సాగిపోయేలాగు
వర్షించు వర్షించు

ఆకొన్న భూముల
చీకు దీరేలాగు
పచ్చని పైరులు
పెచ్చు పెరిగేలాగు
వర్షించు వర్షించు

గౌతమీ కృష్ణాది
జీవనదులన్నీను
నిండుగా ప్రవహించి
తిండి పెట్టేలాగు
వర్షించు వర్షించు అందాల
మేఘమా
వర్షించు కర్షకుడు హర్షమం
లాగు



(సీరియల్)

మనిషిలో మనిషి

DR. JEKYLL AND MR. HYDE

R-L. STEVENSON



1

ఇంటిగుమ్మం వింతవిషయం

అట్టర్సన్ మంచి లాయరు. ముఖంమాత్రం చెకుముకిరాయిలాగున గండ్రగా ఉంటుంది. ఆముఖంలో నవ్వు అనేది నహీ. మాట్లాడేటప్పుడు అతనిమాటలు తుంపులుతుంపులుగా అతుకులబొంతలాగున ఉంటాయి. అభిమానాలూ, అనురాగాలూ అంతగా అతనిని బాధించవు పొడుగ్గా, సన్నగా ఉంటాడు. అయితే నేం? మనిషిదగ్గర ఆకర్షణశక్తి ఉంది. స్నేహితుల సమావేశాలలో మంచి ద్రాక్షారసం నోటికింపుగా బల్లమీద పెట్టినట్లయితే, అతనిలో కొంత సరదా ఉన్నట్లుగా అతనికళ్ళల్లోనే కన్పిస్తూ ఉంటుంది అటువంటి సరదా గుణం అతనిసంభాషణలో వెల్లడి కాకపోయినప్పటికీ, అతనియొక్క సత్కార్యములలో స్పష్టంగా కన్పిస్తూ ఉంటుంది. స్వవిషయములో కొంత కట్టుదిట్టంగానే ఉంటాడు. త్రాగుడువిషయములో అతనికి ఉన్నటువంటి దిలాసా కొంతవరకు అణచివేయడానికి చాలా ప్రయత్నించేవాడు ఒంటరిగా ఉన్నప్పుడు ఘాటులేని సారా కొంత త్రాగేవాడు నాటకములు చూడడం అతనికి యిష్టమే—కాని, ఇరవైఏళ్ల యీ మధ్యకాలములో నాటకశాలలోనికి అతడు అడుగుబెట్టి యుండలేదు. ఇతరుల విషయములో చాలా సహనం ఉండేది అతనికి—ఇతరులు ఏవైనా పాడుపనులుచేసి, తామేదో ఘనకార్యం చేసినట్లుగా ఎగిరినప్పుడు అటువంటివాళ్లను చూచి ఆశ్చర్యపడడు. మొత్తముమీద అట్టువంటి వాళ్ళను నిందించడంకంటె వాళ్ళకు ఏదైనా కించిత్తు మేలుచేసేవాడు. "నా సోదర మానవుడు తప్పుచేస్తే వాడి పాపకర్మమున వాడే పోతాడు" అనే మాటలు తరుచు అంటూ ఉండేవాడు. ఇటువంటిమనిషి తన వద్దకు వచ్చిన మనుష్యులయొక్క తత్వాలను స్వభావాలను మార్పు చేయగల్గినంత ప్రభావం కలవాడు కాడు. తాను ప్లీడరు అగుటవల్ల తనవద్దకు ఏవైనా వ్యవహారాలనిమిత్తమై చాలామంది వచ్చిపోతూ ఉండేవారు. అటువంటి వారితో మాట్లాడేటప్పుడుకూడా ఆయన తీరులో మార్పు ఉండేది కాదు.

ఈవిధంగా ప్రవర్తించడం అట్టర్సన్‌కు సులభసాధ్యమే. స్నేహితులను ఆకర్షించే ఆడంబరలక్షణాలు అతనిలో లేకపోయినప్పటికీ, అతనికి చిరమిత్రులుగా ఉన్నవారు అతని మంచిహృదయం గ్రహించి అతనికి స్థిరమిత్రులైనారు కాకతాళీయంగా తనతో స్నేహంచేసి తన స్నేహబృందంగా ఏర్పడినవారినే, తన కూటంగా ఏర్పరచుకొనడం ఆయన తత్వం. ఆయన మిత్రులలో చాలామంది ఆయనతో బంధుత్వ ఉన్నటువంటివాళ్లు, లేదా చిరకాల పరిచయం ఉన్నటువంటివాళ్లు - కంచెలమీద తీగెలు ప్రాకినట్లుగా ఆయన పరిచితులు దీర్ఘకాల పరిచయంవల్ల అతనికి స్నేహితులైనారు. "రిచర్డు ఎన్‌ఫీల్డు"తో ఆయనకు దోస్తీ ఉంది. అతడు లాయరుగారి సన్నిహిత జ్ఞాతి. ఊళ్ళో పేరుప్రసిద్ధి గలవాడు. వీళ్ళిద్దరికీ ఏవిధంగా శ్రుతి కలిసిందో ఊహించడం కష్టం వారిద్దరిలో ఒకరిలో ఇంకొకరికి కన్పించిన మహత్తర విషయమేమిటో ఎవరికీ తెలియదు. ఆదివారం వచ్చిందంటే ఇద్దరూ కలిసి సాయంకాల సమయంలో షికారు వెళ్ళేవారు.

మూలం రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ ★ అనువాదం : దాసు వామనరావు

మనిషిలో మనిషి

అప్పుడు వారిద్దరూ మాట్లాడుకొనే విషయాలు ఏమీ ఉండేవికావు. మూగనోము పట్టినట్లుగా నడిచేవారు. కాని, త్రోవలో ఎవరైనా స్నేహితుడు కన్పిస్తే ఇద్దరూ సరదాగా "ఓహోహో!" అనేవారు. ఇంత మౌనంగా వారు కలిసి నడిచినప్పటికిన్నీ, యీ ఆదివారం షికారు అంటే వారికి ప్రాణం లేచివచ్చేది. ఆనాడు ఇతర పనులు ఎన్ని ఉన్నప్పటికీ, అవన్నీ మానుకొని, ఇతర వినోద కాలక్షేపములను కూడా వదలుకొని, యీ సాయంకాలం షికారు నిర్విఘ్నంగా సాగించేవారు.

ఈరీతిగా ఒక ఆదివారం సాయంకాలం వారిద్దరూ షికారుగా నడిచిపోతూఉన్నారు. లండను నగరంలో బాగా వ్యాపారపు సందడి ఉన్నటువంటి ప్రాంతంలో ఒక ప్రక్క వీధిగుండా నడిచిపోతున్నారు. వీధి చిన్నదే. ప్రశాంతంగా ఉందని చెప్పవచ్చు. మామూలు రోజులలో ఇక్కడ వ్యాపారం చురుకుగానే సాగుతూ ఉంటుంది. ఈ వీధిలో ఉండేవాళ్లు మంచి స్థితిపరులే. వ్యాపారం మరింత ఎక్కువగా చేసి ఎక్కువ లాభాలు గడించాలనే ఆశ కలవారుకూడా-- ఎందుచేతనంటే, తమ దుకాణాలకు బయటివైపున జనాన్ని ఆకర్షించే షోకులు అలంకారాలు చాలా చేశారు. ఆ షాపులన్నీ సింగారించిన అంగనలవలె ఉన్నాయి. ఆనాడు ఆదివారంరోజున ఆ వీధిలో బండ్ల రద్దీ గాని, జనసమ్మర్దంగాని లేకపోయినప్పటికీ, ఆ చుట్టుప్రక్కల ప్రాంతంకంటె ఆ వీధి చాలా శోభాయమానంగా ఉంది. అడవిలో పోతూఉంటే, ఆలయం కన్పించినట్లుగా ఉంది. వీధివైపుతలుపులు చక్కగా రంగులువేయబడి ఉన్నాయి. చక్కగాతోమి తుడుచిన ఇత్తడి గుబ్బలు, కమ్మీలు బంగారంలాగున మెరుస్తున్నాయి. మొత్తంమీద వీధి అంతా తీర్చి దిద్దినట్లుగా తాజాషోకుగా కళకళలాడుతూ ఉంది.

వీధిలో ఒకమూలనుంచి తూర్పువైపుగా ఎడమవైపు యిండ్లశ్రేణిలో రెండుయిండ్లు దాటగానే, సందు ఒకటి ఉంది. అక్కడనే ఒక పెద్ద భవనం వీధిమీదకు త్రోసికొని వచ్చినట్లుగా కన్పిస్తుంది. అది రెండంతస్తుల భవనం. క్రింది అంతస్తుకు ముందరివైపున కిటికీ ఏమీ లేదు. ద్వారం ఒకటి మాత్రం ఉంది. పైఅంతస్తుకు రంగువెలిసిన గోడమాత్రము తెర కట్టినట్లుగా ఉంది. చాలాకాలంనుంచీ యీ యింటివిషయమై ఎవ్వరూ శ్రద్ధవహించడంలేదని దాని ముఖం చూస్తేనే తెలుస్తోంది. ఇంటిలోనివారిని పిలవడానికి తలుపునుకొట్టేటందుకు కొక్కెంగాని, బయట ఏదైనా గంటగాని ఏమీ లేదు. తలుపుమీద రంగుపూత చిట్లి, పగుళ్లు ఇచ్చింది. వీధిలో తిరిగేటటువంటి సోమరిపోతులు భవనం బయటభాగంలో హాయిగా పవళిస్తూ ఉంటారు. ఆ కిటికీలమీద నిప్పుపుల్లలు గీస్తూఉంటారు. అక్కడ ఉండే తిన్నెలమీదను దిమ్మలమీదను బడిపిల్లలు తమ పేనాకత్తులకు పదునుపెట్టూ ఉంటారు. రమారమి ఒక పురుషాంతరం యీ మధ్యకాలంలో, యీ చిల్లరజనాన్ని తరిమి వెళ్ళగొట్టినవాడెవ్వడూ లేడు. ఆ భవనమునకు వాళ్లుచేసిన పాడు పనులకు ప్రతిక్రియగా మరమ్మతులుచేసినవాడుకూడా ఎవ్వడూ లేడు.

ఎన్‌ఫీల్డునూ, లాయరునూ ఆ సందు మొదట్లోకి రాగానే, ఎన్‌ఫీల్డు తన చేతిలోఉన్న కర్ర పైకెత్తి ఆయింటివైపు చూపించాడు.

"ఆ ద్వారబంధం ఎప్పుడైనా నీవు శ్రద్ధగా గమనించావా?" అని ప్రక్కనున్న తన స్నేహితుణ్ణి ప్రశ్నించాడు. అతడు అవునని చెప్పగానే, "ఒక విచిత్రమైన విశేషం యీ ద్వారబంధం చూడగానే నామనస్సుకు జ్ఞాపకం వస్తూఉంటుంది" అని ఎన్‌ఫీల్డు అన్నాడు.

"నిజంగా! ఏమిటది?" అని అట్టర్సన్ స్వరం మార్చి ప్రశ్నించాడు.

"ఆ విషయం ఏమిటంటే" అని ఎన్‌ఫీల్డు అందుకొని ఆరంభించాడు. "ఒకనాడు శీతకాలం నేను అంతులేని దూరం వెళ్ళి తెల్లవారుజామున మూడు గంటలకు తిరిగి యింటికి వస్తూఉన్నాను. చీకటిగా ఉంది. ఈ నగరంలోని ప్రాంతంలోనే నేను నడిచి వస్తున్నాను కాని, ఆ ప్రదేశంలో దీపాలు దీప స్తంభాలు తప్ప ఏమీ కన్పించలేదు. వీధివెంటవీధి దాటి నడుస్తున్నాను. జనం గాఢనిద్ర పోతున్నారు. వీధులలో

దీపాలు బారులుతీర్చి ఊరేగింపుకు నిలువబడినట్లున్నాయి. రైలు వెళ్ళిన తర్వాత రైలు ప్లాటుఫారం ఉన్నట్లుగా వీధి అంతా నిర్జనంగా నిశ్శబ్దంగా ఉంది. వినిపించిన శబ్దములన్నీ ఆలకించి ఆలకించి, ఆఖరుకు ఎక్కడైనా ఒక పోలీసువాడు కన్పిస్తే బాగుండు ననే ధోరణిలో పడ్డాను. అప్పుడు హఠాత్తుగా రెండు ఆకారాలు నాకు కన్పించాయి. ఒక చిన్నసైజు మనిషి తూర్పుదిశగా చకచకా నడుస్తూ వస్తున్నాడు. ఎనిమిదేళ్లు ఉంటాయో, పదేళ్లుంటాయో, ఒక ఆడపిల్ల అడ్డంగా పోతున్న మరొక రోడ్డుమీద గబగబా పరుగెత్తుకుంటూ వస్తోంది. అడ్డరస్తా నిలువు రస్తా కలిసేచోట, ఒకరినొకరు ఢీకొట్టుకొన్నారు. అప్పుడే అమితఘోరమైనపని జరిగింది. ఆ మొగవాడు, క్రింద పడిపోయిన పిల్లనుపచ్చడిపచ్చడిగా త్రొక్కుకుంటూ, నడిచి వెళ్ళాడు. నేలపైన పడిఉన్నపిల్ల కాకి గోల పెట్టి ఏడ్చింది. అది మాటలతో చెప్పితే అర్థమయ్యేది కాదు. అది కేవలం నరకవేదన అంటే నమ్ము. వాడు చూస్తే మనిషిలాగున లేడు. జగన్నాథ రథంలాగున నడిచి వెళ్ళాడు. వెంటనే నేను అరెరే అని ముందుకు పరుగెత్తుకొని వెళ్లి ఆ పెద్దమనిషి గొంతుక లంకించుకొని వెనుకకు లాగుకొని వచ్చాను. అప్పటికే కొంతమంది జనం, ఏడ్చి గోలపెట్టుతున్న ఆపిల్ల చుట్టూ చేరారు. ఇంతపని చేసిన ఆ పెద్దమనిషి అదరూ బెదరూ లేకుండా నిల్చున్నాడు. అతడు నన్ను ఎదిరించడానికికూడా ప్రయత్నించలేదు. నావంక మాత్రము ఒక రాక్షసపు చూపు చూచాడు—దానితో నాకు ఒళ్లు చెమటలుపోసింది. అక్కడకు వచ్చిచేరిన జనం ఆపిల్ల బంధుజనమే—ఆపిల్లను డాక్టరుకోసం పంపించారట. ఆ డాక్టరుకూడా అప్పుడక్కడకు హాజరైనాడు. పిల్లకు ఎక్కువ దారుణమైన దెబ్బలు తగులలేదు. "సాబోన్సు" అనే యింటిపేరుగలవాళ్ల పిల్ల అది. సాబోన్సు కుటుంబంవాళ్లు చెప్పినదానినిబట్టి ఆపిల్ల పూర్తిగా బెదిరిపోయింది. ఇంతటితో ఈకథ పూర్తిఅయిందని నీవు భ్రమపడవద్దు. మరొక విచిత్రవిషయంకూడా జరిగింది. ఆ పెద్దమనిషినిచూస్తే మొదట్లో నాకు బలే రోతపుట్టింది ఆపిల్ల తాలూకు బంధువులకుకూడా రోత పుట్టింది. అక్కడకు వచ్చిన డాక్టరు వైఖరి మాత్రం నాకు చోద్యంగా ఉంది. అతడొక చిన్న డాక్టరు. ముక్తసరిగా కట్టెవిరిచినట్లు మాట్లాడే మనిషి ఎడింబరో నగరపు యాస అతని మాటలలో ఉంది. స్కాట్లండు దేశపు సన్నాయి తిత్తిలాగున ఆయనకు ఆవేశం కూడా వస్తుంది. నాచేతజిక్కిన దొంగవంక అతడు పరికించి చూచినప్పుడెల్ల, సాబోన్సు కుటుంబం తాలూకువారు ఆ దుర్మార్గుణ్ని హతం చెయ్యాలన్నట్లుగా కోపంతో కంపించారు. ఆ డాక్టరు మనస్సులో ఉన్నదేమిటో నేను గ్రహించాను. నా మనస్సులోది అతను గ్రహించాడు. హతమార్చడం అనేది అసంభవం. అందువల్ల చేతనైనదానిలో ఉత్తమమైన పని చేశాం. ఆ పెద్దమనిషితో స్పష్టంగా చెప్పివేశాం. ఇప్పుడు జరిగిన యీ పనికి అతనిని తల ఎత్తుకొని తిరుగనివ్వకుండా లండను నగరం అంతా అతనిని అల్లరిచేసి అప్రతిష్ఠపాలు చేయగలమని తెలియబరిచాము. ఎవరైనా పెద్దమనుష్యులు అతనికి స్నేహితులుగా ఉన్నట్లయితే, అతనికి యీ వూళ్ళో ఏమైనా పలుకుబడిగాని పరపతిగాని ఉన్నట్లయితే, వాని కన్నింటికీ నీళ్లు వదులుకోవలసిందే అన్నాము. అతనితో యీ మాటలన్నీ మేము కాల్చి వాతబెట్టినట్లుగా చెప్పుతూఉన్న సమయంలో, ప్రక్కనున్న ఆడవాళ్ళను దగ్గరకు రానీయకుండా దూరంగాఉంచాము. ఎందుచేతనంటే ఆడవాళ్లు లంకిణీల లాగున అతని చుట్టూ చేరి అతనిని మింగివేసేటట్లుగా ఉన్నారు. అంత కోపం కక్కుతూఉన్న ముఖాలు నేను ఎప్పుడూ చూడలేదు. వాళ్లందరి మధ్యనూ ఆ పెద్దమనిషి కొరివిలాగున వెకిలినవ్వు నవ్వుతూ నిల్చున్నాడు. మనిషి లోలోపల జంకుతూనే ఉన్నాడు. కాని, సైతాను లాగున కదలకుండా నిల్చున్నాడు. "ప్రమాదవశాత్తుగా జరిగినదానిని పట్టుకొని మీరు నన్ను పిండి సాధించ దలచినట్లయితే, నేను ఏమీ చేయలేను. అల్లరి చెయ్యాలనీ అల్లరిపాలు కావాలనీ ఏ పెద్దమనిషీ కోరడు" అని అతడు అన్నాడు. "నీ బేరం ఏమిటో లెక్కతేల్చి చెప్పు" అని అతనిని బొడ్డులో చెయ్యివేసి నిలువబెట్టి, ఆ పిల్ల తాలూకు కుటుంబానికి వంద పౌనుల మొత్తం పరిహారం యిచ్చేటట్లుగా ఒప్పించాము. కొంచెం దేహశుద్ధికి సిద్ధమయ్యేవాడే. కాని, అతనిని చిక్కులలో బెట్టి నొక్కుదామనే సంకల్పం మాలో చాలామందికి కలిగింది. అందువల్ల

★ మనిషిలో మనిషి ★

ఆఖరుకు అతడు ఆ బేరానికి ఒప్పుకొన్నాడు. ఇక తర్వాత జరగవలసిన పని ఏమిటంటే పైకం వసూలు చేయడం. మమ్మల్ని వెంటబెట్టుకొని అతడు ఎక్కడికి యీడ్చుకొని వచ్చాడో తెలుసా? ఈ గుమ్మందగ్గరికే తీసికొని వచ్చాడు. జేబులో నుంచి ఒక తాళంచెవి తీశాడు. వెంటనే లోపలికి వెళ్ళి, పది బంగారు నవరనులు పట్టుకొనివచ్చి, మిగతా 90 పౌన్లకు కూట్సుబ్యాంకుకు ఒక దర్శన హుండీ (చెక్కు) వ్రాసి యిచ్చాడు. ఆ హుండీమీద అతను సంతకంచేసిన పేరు సుప్రసిద్ధమైనది. తరచు పత్రికల్లో కూడా కన్పించేది. ఈ కథలో ఆ పేరు ముఖ్యాంశమేగాని ప్రస్తుతం నేను వెల్లడించడానికి వీలు లేదు. మనిషి ఖడాయించి ఉన్నాడు. సంతకంకూడా బాగానే చేశాడు. అది సరియైన సంతకం అవునో కాదో అనిపించింది. ఆ పెద్దమనిషితో స్పష్టంగా అన్నాను. "అయ్యా! మీ వ్యవహారం అంతాచూస్తే నమ్మడానికి అవకాశంలేకుండా మిధ్యగా ఉంది. నిజమైన వ్యవహారప్రపంచంలో చీకట్లో తెల్లవారుజామున నాలుగుగంటలకు ఎవ్వడున్నూ ఒక మారుమూల యింట్లోకి చొరబడి వందపౌనుల మొత్తమునకు మరొకని పేరుతో హుండీ వ్రాసియివ్వడం జరగదు." అతడు నామాటలకు ఏమీ తోణక లేదు. కాని వెక్కిరించినట్లుగా పండు ఇకిలించాడు. "నీవు ఏమీ గాబరాపడకు. బ్యాంకులు తెరచేవరకు నేను మీతో ఉండి ఈ హుండీని నేనే రొక్కంగా మార్పించి పెడ్తాను" అన్నాడతను. అటుపిమ్మట, నేనూ, డాక్టరూ, పిల్లతండ్రీ, మా మిత్రుడూ కలిసి బయలుదేరి, తెల్లవారేవరకూ నేనుఉన్న ఇంటిలో సే గడిపి తెల్లవారినతర్వాత, రవ్వంత అల్పాహారం పుచ్చుకొని, మేమందరమూ ఒక్క ముఠాగా బ్యాంకుకు వెళ్ళినాము. రొక్కంకోసం ఆ హుండీని బ్యాంకులో నేనే సమర్పించాను. అది దగా హుండీ అని నేను అనుమానించాను. కాని, అది ఎంత మాత్రమూ అటువంటిది కాదు. అది నికరమైనహుండీ.

"చా! చా!" అని అట్టర్సను ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును. యీ కథంతా నాకు ఎట్లా కన్పిస్తున్నదో నీకు కూడా అదేవిధంగా కన్పిస్తోంది" అని ఎన్ఫీల్డు అతని మాట అందుకొని యిల్లా అన్నాడు. "అవును. యిదంతా చాలా అధ్వాన్నపు అవకతవక కథ నిజమే. ఎందుచేతనంటే నేను ప్రస్తావించినమనిషిని చూస్తే ఊరుపేరు లేని నట్టి బేవారసు, కోన్‌కిస్కా మనిషిగా కన్పించాడు. కాని, అతనికి ఎవడో యింకో పెద్ద మనిషి వంద పౌనులకు బ్యాంకుహుండీ యిచ్చాడు. హుండీ వ్రాసియిచ్చినటువంటి వాడెవరోగాని చాలా ఆస్తిగల ఆసామీలాగున కన్పించాడు. అంతే కాదు. పుణ్యకార్యాలు చేసే పెద్ద ఘరానా ఆసామీలాగున మీ సమానధాయీ మనిషిలాగున

కన్పించాడు. ఒక దగుల్బాజీవాడు చేసిన పాడుపనికి పరిహారంగా మరొక మర్యాదస్థుడు పైకం కుమ్మరించడం చూస్తే, పరువు తీస్తానని బెదరించి పైసా లాగినట్లుంది. అందుచేత యీ గుమ్మంగల యీ యింటిని, పరువుతీసి పైసాలాగే అప్రతిష్ఠ వ్యాపారపుకొంప అని నేను అంటాను. కాని, అంతమాత్రముచేత యీ యింటిమర్మం అంతా విశదమైనదని భావించవద్దు" అని ఎన్ఫీల్డు తన కథ ముగించి, ఏదో ఆలోచనలో పడ్డాడు.

"అయితే, ఆ బ్యాంకుహుండీని స్వదస్తూరీతో వ్రాసియిచ్చిన ఆసామీ యీ యింట్లో ఉన్నాడో లేదో నీకు తెలియదంటావా?" అని అట్టర్సన్ వెంటనే ప్రశ్నించాడు.

"ఇది మొత్తంమీద అటువంటి కొంప అవునంటావా? లేదా? హుండీ వ్రాసిన ఆసామీయొక్క చిరునామా నేను చూచినట్లే జ్ఞాపకం. అతడేదో స్క్వేరుదగ్గర కాపురం ఉంటాడు" అని ఎన్ఫీల్డు ప్రత్యుత్తరమిచ్చాడు.

"అయితే, యీ గుమ్మంగల యింటి సంగతి ఏమైనా నీవు అడుగలేదా?" అని అట్టర్సన్ అన్నాడు.

"అదిమాత్రం నేను అడుగలేదు. నాకు అది సున్నితమైన అమర్యాదవిషయంగా కన్పించింది. ఇతరులను నిలువబెట్టి సోదా చేసినట్లుగా ప్రశ్నలు వేయడం నాకు మనస్కరించదు. ఒక ప్రశ్న వేయడం ప్రారంభిస్తే కొండమీదనుంచి బండరాయి దొర్లినట్లుగా ఉంటుంది. ఆ రాయివెంట యితర రాళ్ళు కూడా దొర్లుకుంటూ వస్తాయి. అది వెళ్ళి వెళ్ళి తలవని తలంగాపు ప్రక్కతోటలోని ఏ ముసలివాని నెత్తిమీదనో విరిగిపడుతుంది. ఇంటివాళ్ళకు చెడ్డపేరు వస్తుంది. అందువల్ల ప్రశ్నలు అడగడం అంటే సూదికోసం సోదిఅడిగినట్లుగా అవుతుంది. అందువల్ల నాకు ఏదయినా "వింత వీధి"గా తోస్తే దాని వివరమే అడగను" అని ఎన్ఫీల్డు అన్నాడు.

"ఇది మంచిపద్ధతిగానే ఉంది" అని లాయరు అట్టర్సన్ అందుకున్నాడు.

ఎన్ఫీల్డు తిరిగి యిలా ప్రస్తావించాడు. "నేను ఈ కొంపసంగతి కొంత పరిశీలించాను. ఇది కాపురండుండే యిల్లులాగున లేదు. దీనికి రెండో ద్వారం కన్పించదు. ఈ ఒక్క ద్వారంగుండా అయి

(43-వ పేజీ చూడండి)

పవిత్రం

షావుకారు కన్నయ్య, చీకటి కోణాల్లో, చడీ చప్పుడూ లేకుండా లక్షలార్జించాడు. లక్షలల్లా కోటివరకూ దేకింది!...... అసలు రెండేళ్ల క్రితం ఎర్రని ఏగానికి కొఅగానివాడు యీనాడు, కోటికి పడగెత్తాడంటే, అది యేనాటి ఈశ్వరకృపో యీనాటికి ఫలించింది! మొదట్లో కన్నయ్య కన్నా అతిసంపద కలవారుగూడ యీనాడు కన్నయ్య ఆస్తినిచూసి ఆశ్చర్యపోయి, కళ్లు తేలవేయడంలో యేమైనా ఆశ్చర్యం వున్నదా!...

తోటివాళ్లు ఎంత పొగిడినా, లోపల వుబ్బిపోయి, బయటకు చప్పగా "అబ్బే! నేనేపాటివాడినండీ! ఏదో మీ అందరిదయవల్ల యిలా కాలం వెళ్లిమార్చుతున్నాను! చూశారూ!...పోయి నేడు వ్యాపారంలో మూడులక్షలు నష్టంవచ్చింది ...ఛా...ఛా...వ్యాపారమంతా దగాలా కనబడుతూ వుంది." అనేవాడు. అసలుసంగతి అందరికీ తెలిసినా, కన్నయ్యగుణం తెలిసినవారు కాబట్టి గప్‌చిప్‌గా వూరుకునేవారు.

అంతఆస్తిలేకపోయినా కన్నయ్య తర్వాత ఆవూళ్లో చెప్పుకోతగ్గవాడు రంగయ్య. రంగయ్యగారు ఓనాడు కన్నయ్యగారిని కల్సుకున్నారు. కుశలప్రశ్న లనంతరం రంగయ్య "ఏమోయ్! బావా!... ఒకవిషయం అడుగుతాను చెప్పు! ఇంతడబ్బు సంపాదించావ్! యిన్నేళ్లలో, ఒక్కసారైనా, ఆ పరాత్పరుని తలుచుకున్నావా!...ఒకరికింత పెట్టగలిగావా!...అదీ లేదు! ...పాపమో పుణ్యమో డబ్బు సంపాదించావ్! ఆపాపం పోడానికైనా, పుణ్యం సంపాదించడానికైనా, ఏమైనా చెయ్యాలా, వద్దా, చెప్పు?" ఇంతా చెప్పి, కన్నయ్యగొంతులో వెలక్కాయ అడ్డంగానెట్టి, జవాబుకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు రంగయ్య! రంగయ్యకు పరాత్పరుని మీద పరమభక్తి పుట్టుకు రావడం నిజంగా ఆశ్చర్యమే!

"నన్ను దెప్పి పొడుస్తున్నావ్! నీ వేమాత్రం పుణ్యం సంపాదించావ్!...తీర్థయాత్రలు చేశావా! తిరునాళ్లకెళ్లావా! గుడి కేనాడైనా పోయెరుగుదువా! ... మొన్న మా చంటాడికి వొళ్లు తెలియకుండా జ్వరంకాస్తే, ఐదు కొబ్బరికాయలు కొడ్తానని మొక్కుకున్నాను... తెలుసా!" అన్నాడు కన్నయ్య! నిజంగా అతను గుడికి వెళ్లాడో, లేదో, కొబ్బరికాయలు కొట్టించుకొని తిన్న దేవుడికే తెలియాలి!

"నేనూ అదే అనుకుంటున్నాను! ...ఏతీర్థయాత్రకైనా వెళ్తే ఎంతైనా పుణ్యం వస్తుందని రామయ్య శాస్త్రిగారు చెప్పాడు కష్టమో, నష్టమో పుణ్యం సంపాదించితీరాలి. మనకు బోలెడు ధనం వుంది ఇహంలో యిది చాలు! పరానికి పుణ్యం తప్పకుండా కావాలి. ఏమంటావ్!...నిజమా! ... కాదా!..." అన్నాడు రంగయ్య.


ఇదివిన్న కన్నయ్యకు...నిజంగా అతనిమనసు ఏ శివునిసాన్నిధ్యంలో వున్నదో కాని...రంగయ్య చెప్పిన దాంట్లో సత్యం వున్నదనిపించింది. ఎంగిలిచేత్తో కాకినితోలితే మెతుకులు రాలిపోతాయని భయపడే ఘనుడు యాత్రచేసి వున్నధనంతో పాటు, పుణ్యంకూడ సంపాదించాలనుకున్నాడు.

"అయితే మరి ఏవూరువెడదాం తీర్థయాత్రకు?" అనడిగాడు కన్నయ్య!...

...రంగయ్య ఆశ్చర్యపోయాడు ...'ఏమిటీ! కన్నయ్య వప్పుకున్నాడా!'...అనుకున్నాడు మనసులో! అంటే కన్నయ్య వప్పుకోడని ముందే రంగయ్య వూహించాడు.

"మనం ఏపనిచేసినా ఘనంగా వుండాలి! కాశీమైనా, రామేశ్వరమైనా వెడదాం కష్టమో నష్టమో పుణ్యం సంపాదించితీరాలి." అన్నాడు రంగయ్య!

కన్నయ్యకు అన్నీ నచ్చాయిగాని, కాశీ అనగానే కాళ్లవణుకు పట్టుకుంది. ఆరోజుల్లో రైళ్లులేవు కాబట్టి ... పోసి డబ్బిచ్చె వానసరే నాటుబండిమీద వెళ్దామా అంతే,. సరైనదారిలేదు కాబట్టి ... కాశీకి వెళ్లిన కాకిగూడ తిరిగి యింటికి



శివ పార్వతులు

చిత్రకారిణి:—అమ్మనబోలు భారతి (14) (విజయవాడ)

రా లేదనే సామెత ప్రబలంగా వ్యాపించివున్నరోజులు కాబట్టి,... పరచింతతోపాటు యిహచింతకూడ కన్నయ్య ఎముకల్లో జీర్ణించుకొని పోయింది కాబట్టి భార్యాపిల్లల్ని, ఐశ్వర్యాన్నివదిలి అంతదవ్వు వెళ్ల లేక "కాశీ ఎందుకులేవోయ్! రామేశ్వరం వెళ్దాం! త్వరగా తిరిగి రావచ్చు!'' అని తేల్చేశాడు... సరేనంటే సరేననుకున్నారు.

మర్నాడు వూరంతా ప్రాకి పోయింది కన్నయ్య రంగయ్యల రామేశ్వర పుణ్య తీర్థయాత్ర!... అంతా ఆశ్చర్యపోయారు!...కదూ మరి!!! కష్ట నష్టాలకోర్చి, ధనం ఆర్జించినవాళ్లు, దేవుడిమీద అకారణభక్తికలిగి యాత్రకు వెళ్తున్నారంటే నిజంగా ఆశ్చర్యమే!...

"అంతటి కుబేరులు! ... తీర్థయాత్రకు వెళుతున్నారు!! మనం వాళ్ల వెంట వెళదాం...తప్పకుండా మనకు పుణ్యం లభిస్తుంది! ఏజన్మలోనో ఎంతపుణ్యం చేసుకున్నారో, యిప్పుడు యింత ధనం, వైభవం సంపాదించ గలిగారు. మనం యీ జన్మలో పుణ్యం సంపాదించుకుంటే వచ్చే జన్మలోనైనా ధనవంతుల మౌతాం! అదీగాకుండా మనం చేసుకున్న పాపం కాస్తా పటాపంచలైపోతుంది'' అని ఓ ఏడుగురు పెద్దలు ఆలోచించి, కూర్చుండి కూడబలుక్కొని వెంట వస్తామని రంగయ్య కన్నయ్యలకు విన్నవించుకున్నారు. మొదట రంగయ్య తనవంటిహోదాగలవాళ్లతో, తక్కువ రకం షావుకార్లు రావడం వప్పకో లేదుకాని "వాళ్లనీ రానివ్వోయ్! మనకు చేదోడు వాదోడుగా వుంటారు...ఒకోచోట అడవుల్లోంచి వెళ్లాల్సి వుంటుంది...దొంగలు కూడ వుండొచ్చు'' అని కన్నయ్య చెప్పే

సరికి, రంగయ్యకు ఒప్పుకోక తప్పిందికాదు.

ఇహనేం! ... అంతా తయారయ్యింది! ... మంచి ముహూర్తం నిశ్చయించుకున్నారు ... పుష్కలంగా, ఎవరి కిష్టమొచ్చినంతడబ్బు వారు తేడానికి ఏర్పాట్లు జరిగాయి. ప్రయాణం రేపనగా...యీవాళ! ...అందరికీ ఆనాడు చెప్పలేనంత ఆరాటం పట్టుకుంది!...ఏ ఒక్కరికీ, రామేశ్వరానికి, సరైననాటుమార్గం తెలియదు. తీరా బయలుదేరిం తర్వాత, రామేశ్వరానికి కాకుండా, దారితప్పి యే అవాంతరానికి గురి కావలసివస్తుందో ... మళ్లా యింటి ముఖం చూస్తామో, చూడమో. కాబట్టి దారులన్నీ తెలిసిన ఒకడు వుండడం యెంతైనా మంచిదనిపించిందందరికీ!

సరే వాకబుచేశారు...ఆ చుట్టుపట్ల పదామడవరకూ ఎవరూ లేరు కాని, మాదిగ వెంకడుమట్టుకు రెండుమార్లు రామేశ్వరం వెళ్ళొచ్చాడని, వాడికి అన్నిదార్లూ క్షుణ్ణంగా తెలుసునని, మన తొమ్మిదిమంది భక్తాగ్రేసరులకు తెలిసిపోయింది. తలా కొంత డబ్బు యిచ్చి, వెంకడిని వెంట తీసుకు వెళ్లడానికి తీర్మానించారు... "ఛా! ...మాదిగవాడిని వెంబడి తీసుకు వెళ్లడమేమిటి!...మహా పాపం!... పాపాలన్నీ మనకే చుట్టుకుంటాయి ...వద్దు!...వద్దు! ... వాడ్ని రానీ వద్దు!" అన్నాడేగాని, తర్వాత యిహ నెవరూ దార్లు తెలిసిన దాతలు లేరు కాబట్టి నోరు మూసుకుని వూరుకున్నాడు రంగయ్య!

సర్వ సన్నాహాలతో శకునం చూసుకొని, బ్రాహ్మడి చేత మంత్రోచ్చారణచేయించుకుంటూ, వూరి వెలపలవరకూ పదిమందీ రామనామం జపించుకుంటూవచ్చి బ్రాహ్మడికి పరమ భక్తితో రూపాయి సంభావన యిచ్చి అతగాడ్ని వెనక్కి తిరిగి పంపించివేసి, ఒక్కసారే "జై సీతారామ్" అని, దారినిపడ్డారు.

"మనం బయలుదేరిన వేళా విశేషం! ఏమీ విఘ్నాలు లేవు" అన్నాడు కన్నయ్య దార్లో!

"అహహా!...అదేంమాట!తమవంటి, శ్రీముఖంకలవారు బయలుదేరడమేమిటి!...విఘ్నాలు రావడమేమిటి!...కల్లోమాట! ... మీకు ఎక్కడైనా జయమే!...ఎదురంటూ లేదు!" అన్నారంతా! కన్నయ్య వుబ్బి తబ్బిబ్బై, హాయిగా, గాలి లోనకు పీల్చుకొని పొట్ట రెండంగుళాలు పెంచి గర్వంగా అందరివంకా చూశాడు!

నీలాకాశము దూరాన ఏనుగుల్లా వింతగొల్పే ఆకారాలు గల పర్వతాలు, దట్టంగా అల్లుకొనివున్న చిట్టడవులూ, వాటి పైనుంచివచ్చే వింతైన పుష్పపరిమళాలు, ఆకాశాన్నంటుకునే ఎత్తైన చెట్లు, పక్షుల కిలకిలలూ, మృగాల వింత అరుపులు, చూస్తుండగానే ఎదురుగుండా ప్రాకిపోయే పాములు... వీటన్నిటినీ చూస్తూంటే పదిమందికీ ఒకోసారి హాయిగా, ... ఒకోసారి ప్రాణాలు పోయేటంత భయంగా వుండేది ... అందరికన్నా కన్నయ్యకు మరీనూ! "ఎందుకు వచ్చానా! లేనిపోంది తలకు రుద్దుకున్నాను. పెళ్ళాం ఎలా వుం పిల్లలు ఎలా వున్నారో!...అదీగాక కూడబెట్టిన ధనం కుర్రకుంకలేం ఖర్చు చేసిపోతాడో ననేభయం!... కన్నయ్యకు దారిపొడుగునా మకాం చేసినచోటల్లా యిదే చింత!...పైకి మట్టుకు డాబుసరిగా రామకీర్తనలూ:...కళ్లు మూసుకొని సర్వం త్యజించిన సన్యాసిలా జపతపాలూనూ!...

కన్నయ్య భక్తి పారవశ్యతను జూచి తక్కినవాళ్లంతా ముక్కుమీద వేలేసుకునేవారు. ఎంతలో ఎంతమార్పు! ... "నిన్న మొన్నటి వరకూ నానాగడ్డితిని లక్షలార్జించాడు. కాని యిప్పుడు రామభక్తుడై పోయాడు ... అదంతా,

తండ్రి:— (ఏడుస్తూవున్న కొడుకుతో). వెధవా! అనవసరంగా అల్లరిచేసి నాచేత రెండుదెబ్బలు తిన్నావా! అల్లరి ఎందుకు చెప్పు! యింద, యీ బేడ పట్టుకెళ్లి ఏమైనా కొనుక్కో.

కొడుకు:— (ఇంకా ఏడుస్తూనే) ఐతే! యింకో రెండు దెబ్బలు కొట్టి ఏకంగా నాలు గణాలు యిచ్చేసెయ్యి! పక్కింటి రామంతో సినిమాకు వెడతాను.

—బి.వి.వి.ఆర్. సుబ్బారావు-సింగవరం.

ఆ కోదండపాణి కృపా విశేషం!... మనకు లభిస్తుందా!" అనుకునేవారు తక్కిన భక్తశిఖామణులు! ఇలా వాళ్ళయాత్ర తొమ్మిదిరోజులు నిర్విఘ్నంగా సాగింది! పదోనాటికి ఒక చిట్టడవి చేరుకున్నారు ... దూరంగా, చెట్లసందుల్లోంచి వూరు కనిపిస్తున్నది.

"మనం రామేశ్వరం వచ్చేసినట్లేనా! ఏమైనా అనుమానం వున్నదా!" అని అడిగాడు రంగయ్య వెంకడిని!

"చిత్తం! యింకో రెండుకోసుల్లుందండీ! వచ్చేసినాము! అడుగు దబ్బునెయ్యండి! కానొస్తున్న వూళ్లోకి చేరుకుంటాం! ... మబ్బులొస్తున్నాయ్! వర్షం వస్తాది కామాల్న" అన్నాడు వెంకడు!

అన్నట్టుగానే మిలమిల మెరిసే నీలాకాశము నల్లటి కారుమేఘాలతో కమ్ముకుపోయింది. చిట్టడవి యీకోణంనుంచి, ఆకోణంవరకూ చిమ్మచీకటైపోయింది... గాలివాన ప్రారంభమైంది! గాలి రంయ్‌మని, యీదురోమంటూ అడపా, తడపా, రెండువైపులా విసురుగా కొడ్తూవున్నది. వర్షం కుండపోతగా కురవడం ప్రారంభించింది. కన్నయ్య రంగయ్య వగైరాలు, దిక్కుగానక, రామనామం వదిలేసి, "రక్షించేవాళ్లులేరా! ఇహ దిక్కు లేదా! గాలి గట్టిగా విసిరినా, పిడుగు పడినా, చచ్చూరుకుంటాం!" అనుకుంటూ, పిక్కబలంకొద్దీ పరుగు ప్రారంభించారు ... ఆశ్చర్యం! ... ముందు ఒకమున్నె గజాలదూరంలో ...దశరామభక్తులకు, దశరథ రాముడు దయదలచి, నిర్మించాడా అన్నట్టు ఒక గుడి కన్పించింది... ఇహ నేం, అంతా అందులో చొరబడ్డారు. గుడంతా చిమ్మచీకటి... అది పగలైనా రాత్రిలా తయారైంది. ఉరుములూ, మెరుపులూ కలసి భూమ్యాకాశాల్ని దద్దరిల్లజేస్తున్నాయి...లోపల వున్నవారు, ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని, కంట్లో వత్తులు పెట్టుకొని, యీ భీభత్సం ఎప్పుడుపోతుందాఅన్నట్టు చూస్తూవున్నారు...

ఇంతలో అమాంతంగా గుడికెదురుగావున్న ఓ పెద్దచెట్టుమీద పిడుగుపడి ... అంత పెద్ద చెట్టూ

★ పవిత్రులు ★

ఒక్కసారి మాడిపోయింది. పౌగ మట్టుకు గాలివానలో వ్యాపించి పోయింది. గుడికి తలుపులు లేక పోవడంవల్ల యీ భయానకదృశ్యం స్పష్టంగా చూసేసరికి, అందరి గుండెల్లో ఆరాటం నిముష, నిముషానికిఎక్కువకాజొచ్చింది, ఎక్కడ గుడిమీద పిడుగు పడుతుందోనని!

"అన్నట్టు గుడిమీద పిడుగు పడితే మనగతేంగాను!...సుబ్బయ్య రెండు వేలివ్వాలి! కామయ్య ఖచ్చితంగా వడ్డీ అణా పైనలతోసహా నాలుగు వందల యాభై ఆరున్నర యివ్వాలి! నేనిక్కడున్నాను!...నే చస్తే వాళ్లు బాకీ యిస్తారో, ఎగ్గొడతారో యేమొ! ... అయ్యో నేనేంగాను! చావొచ్చింది!" ముందతనిచావు సంగతి అలా వుంచి, బాకీగురించి బాధపడుతున్నాడందులో ఓషావు కారు!

"పవిత్రమైన గుడిమీద పిడుగు పడడమే!...అలా అంటే దేవుడే లేడన్నమాట!" అని సర్ది చెప్పాడు రంగయ్య!

ఎంత చెప్పినా అంతా తలో విధంగా యింటివిషయాలు వూహించుకొని బెంబేలెత్తిపోతున్నారు. ఎటూ ఆలోచన లేక, చలికి ముణుచుకొని మూల కూర్చున్నది వెంకడొక్కడే! పైన పిడుగుల సింహగర్జనలుమట్టుకు విని ఒకో సారి అదిరిపోతున్నాడు.

మరుక్షణంలోనే పిడుగుగుడి ప్రక్కగా దూసుకుపోయి, చెట్టునవంతా అల్లకల్లోలంచేసి పొగలు చిమ్మించేసింది. పవిత్రమైన గుడి మీద పిడుగులు పడవని చెప్పిన రంగయ్యకే ఎందుకో ప్రాణాలు గుటగుటమన్నాయ్!

మళ్ళీ ఒక నిశ్చయానికివచ్చాడు రంగయ్య "పవిత్రమైన గుడికి అర మైలువరకూ పిడుగుపడానికి వీలు లేదు! ... కాని ఎందుకు పడిందో ఆశ్చర్యంగా వుంది...అంటే మనలో ఎవడో ఒకాడు అపవిత్రుడు వున్నాడన్నమాట! కాబట్టి వెంటనే అతడ్ని యిక్కడ్నుంచి బయటకు గెంటెయ్యాలి! లేకపోతే వాడి మూలంగా అంతా నాశనమై పోతాం!" న్యాయాధికారిలా తీర్పు ఇచ్చాడు రంగయ్య...

బాగుంది! ... కాని అపవిత్రుడెవరు?...పదిమందిలో 'నివ్వు అపవిత్రుడవ'ని వేలెట్టి ఎలా చూపించ

ఒకరోజు పార్కులో బెంచి మీద కూర్చొని, ఏదో ఆలోచిస్తూండగా వెనుకనుంచి,ఏదో గొడుగుదెబ్బ గట్టిగా తగిలింది. వెనక్కు తిరిగిచూస్తే, ఎవరో సుందరాంగి "క్షమించండి, పొరపాటు- మా ఆయన అనుకున్నాను." అంటూ వెళ్లిపోయింది—

—ఎ. సాంబశివరావు-తెనాలి.

గలరు? ... అంతా ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

"ఎవరు పవిత్రులో...ఎవరు అపవిత్రులో ... ఎలా చెప్పగలం!" "సాధ్యంకాదే!"అన్నాడొక షావుకారు.

నిజమే! ... పిల్లి మెడలో గంట కట్టేదెవరు?...అన్నతంతులావుంది!... మెరుపు మెరిసింది...పదిగజా దూరాన ఒకచెట్టు కన్పించింది.

"అలాకాదు! అక్కడ చెట్టు వుంది చూశారా! ప్రతివాడూ అక్కడకువెళ్ళి దానిచుట్టూ ప్రదక్షిణంచేసి, తిరిగి సురక్షితంగా యిక్కడకు వచ్చినవాడు నిజంగా పవిత్రుడే! ··· ఎందుచేతనంటే, బయట ఎవరినీ ఏమీ చెయ్యలేని పిడుగు గుళ్లోకూడ ఏమీ చేయదు" అన్నాడు రంగయ్య!

అంతా యీ తీర్పుకు అంగీకరించారు··· తీర్పు చెప్పినవాడు తనుగాబట్టి రంగయ్య గుండెల్లో బితుకుబితుకుమంటున్నా చెట్టువద్దకు వెళ్ళి ప్రదక్షిణచేసి సురక్షితంగా తిరిగి వచ్చాడు ··· ఇహ కన్నయ్య! ··· ఎలానూ తను నలుగురిచేత పుణ్యా

"ఏమేవ్ !... ఈ కుంకాయ్ ఎక్కడికెళ్లాడే ?"

"ఎక్కడికెళ్లాడో ఏమో... ఎందుకండీ ?"

"నా కోటుజేబులో కొంత చిల్లరడబ్బు మాయమైందే!"

"ఏంపోయినా వాడిమీదే పెట్టారు..పోనీ నేను తీశానని మీ రెందుకు అనుకోకూడదండీ? "

"కొంత చిల్లరడబ్బు మిగిల్చిపోతేను, వాడే ననుకున్నా."

—జి. వి. జి. కృష్ణ-(మద్రాస్)

తున్నాడనిపించుకున్నాడు కాబట్టి, వెళ్ళకపోతే బాగుండదని అదీగాక రంగయ్యలాంటివాడు వెళ్ళిరాగా తను వెళ్ళలేడా!....అనుకొని,అతనుగూడ వెళ్ళి వచ్చాడు! ··· తక్కినవారుగూడ వెళ్ళి ప్రదక్షిణచేసి వచ్చారు···అంతా సురక్షితంగానే చేరుకున్నారు····ఇహఁ వెళ్ళనిదల్లా వెంకడుమట్టుకే! వాడికివేమీ పట్టపట్టు పరుపుచుట్టలా ఓ మూల కూర్చున్నాడు పైగుడ్డ వళ్లంతా కప్పుకొని!...

"నీవంతు వచ్చింది వెళ్లరా!.... వెళ్లి ప్రదక్షిణచేసిరా!" అన్నాడు కన్నయ్య గర్వంతో ఎలానూ తను పుణ్యాత్ముడైనట్టూ ··· పిడుగుల భయం లేనట్టూనూ!

"ఏమిటి వెళ్లడం బాబూ! చలి వణికించేస్తోంది! చస్తే చస్తాన్లే! నా మానాన్న నన్నుండనియ్యండి! భయంగావుంది" అన్నాడు వెంకడు!

"···నే ముందే చెప్పాను! ····వీణ్ణి వెంట తీసుకువస్తున్నారు, ఏదో అనర్థం మూడుతుం దనుకున్నాను!



ఎండవేళ

చిత్రకారుడు:—పోట్లూరి రామారావు (15) (వినుకొండ)

అలానే అయింది! .... బయటకు తోసెయ్యండి వీణ్ణి, ఊ!".... అన్నాడు రంగయ్య!

"అలాకాదు!···ఒకవేళ నీవే అపవిత్రుడవైతే, బయటనే తప్పకుండా నాశనమైపోతావ్! కాకుంటే నీమూలాన్న మేమంతా నాశనమవ్వాలి! ··· వెళ్లి ప్రదక్షిణ చేసిరా!" అన్నాడు కన్నయ్య వెంకడితో!

★ పవిత్రులు ★

వీళ్లందరి వాలకం చూస్తుంటే వెంకడికి తనను ఎలానూ బయటకు గెంటడానికే ఆలోచిస్తున్నా రనుకున్నాడు! ఇహ జబరదస్తీ చేయక పోతే లాభం లేదనుకుని దిట్టంగా భీష్మించుకొని కూర్చున్నాడు… పైన ఆకాశం చిల్లులుపడేటట్టు పిడుగులు గర్జిస్తున్నాయ్! … అందరికీ భయం పట్టుకుంది. పత్తేదారుల్లా ఏదో వాడిని (వెంకడిని) వదిలేసి, తొమ్మిదిమందీ రహస్యంగా ఏదో ఆలోచించారు … తర్వాత వెంకడి దగ్గరకు వచ్చారు. "ఏరా చెట్టుకు ప్రదక్షిణచేసివస్తావా! లేదా!" గర్జించాడు రంగయ్య! … మళ్లా పైన పిడుగు పెళ, పెళ మంది! … మళ్లా వెంకడికి చెప్పిచూశారు వెళ్ళిరమ్మని! …వీళ్లెంత చెప్పినా వెంకడు వెళ్లి రాదలచుకోలేదు … చూస్తూ చూస్తూ వెంకడు ప్రాణంపోగొట్టుకో దలచుకోలేదు! చస్తే అందరితో పాటు చావడానికే నిశ్చయించుకున్నాడు.

మాటలతో చెప్తే వెంకడు వెళ్లేట్టు లేడని, మాదిగవాడైతే అయ్యాడు బ్రతికి బయటపడితే తర్వాత స్నానంచేసి మైల పోగొట్టుకోవచ్చు నని అందరూ కంసి, వెంకడిని కాళ్లూ చేతులూ కలిపి పట్టుకొని తీసుకువచ్చి గుడిమెట్లమీదినుంచి క్రిందికి త్రోసివేశారు. వెంకడు అమాంతంగా క్రిందికి దొర్లిపోయాడు. ఎప్పుడైతే వెంకడు మాటా మంతీ లేకుండా క్రిందికి దొర్లిపోయాడో, ఒక పెద్ద పిడుగు ప్రళయకాలరుద్రుడిలా వచ్చి గుడి మీద పడిపోయింది. అంతే! … పవిత్రమైన గుడి…పవిత్రమైన షావుకార్లతో సహా నేలమట్టమైపోయింది.

వెంకడు లేచి నిల్చొని చూసే సరికి…వట్టిపొగతప్ప… గుడి కన్పించకపోయేసరికి తనను అపవిత్రుడని త్రోసేసిన పవిత్రులు యేమయ్యారా! అని ఆశ్చర్యపోయి అలా చూస్తూవుండిపోయాడా మాదిగ వెంకడు! ★

(35-వ పేజీ తరువాయి)

నప్పటికీ, వచ్చిపోయేవా రెవ్వరూ కన్పించరు. ఎప్పుడో ఒకనాడు నాకథకు సంబంధించిన మనిషి మాత్రము ఆయింట్లో ప్రవేశిస్తూ ఉంటాడు. క్రింది అంతస్తులో మూడుకిటికీలు ఉన్నాయి. అవి యీసందు వైపుకు తిరిగి ఉన్నాయి. ఇంటిక్రిందిభాగంలో కిటికీలు లేనేలేవు. ఈ కిటికీలు ఎప్పుడూ మూసిఉంటాయి గాని శుభ్రంగానే ఉంటాయి. ఇంటికి పొగగూడు ఉంది. దానిలోనుంచి పొగపైకి లేస్తూనే ఉంటుంది. కాబట్టి యింట్లో ఎవరో కాపురం ఉంటున్నారని అర్థం—! కాని, అదికూడా నిర్ధారణగా చెప్పలేము. ఈచౌకులోఉండేయిళ్లన్నీ ఒకదానిమీద యింకొకటి క్రిక్కిరిసి ఉంటాయి. అందువల్ల ఏ యింటి హద్దు ఎక్కడివరకో చెప్పలేము."

పైరీతిగా ఎన్ఫీల్డు ముగించిన తర్వాత ఎన్ఫీల్డున్నూ అట్టర్సనున్నూ కలిసి కొంతసేపు మౌనంగా నడక సాగించారు. అప్పుడు అట్టర్సను యిలాఅన్నాడు. "ఎన్ఫీల్డు! నీపద్ధతిమాత్రం మంచిపద్ధతి."

"నా అభిమతంకూడా అంతే" అని ఎన్ఫీల్డు అన్నాడు.

"అదంతా సరేగాని, ఒక్కవిషయం నిన్ను అడుగవలెననుకొన్నాను. ఆ పిల్లమీదనుంచి నడచి వెళ్లిపోయిన మనిషి పేరేమిటి? అదే నిన్ను అడుగవలెననుకున్నాను" అని అట్టర్సన్ అన్నాడు.

"సరి. పేరుచెప్పితే వచ్చినప్రమాదంఏముందిలే. —అతడు 'హైడ్' అనే పేరుగల పెద్దమనిషి."

"అట్లాగా! అత డెట్లా ఉంటాడు చూడడానికి?" అని అట్టర్సన్ ప్రశ్నించాడు.

"అతన్ని వర్ణన చేయడం తేలికైన పనికాదు. అతని ఆకారంలోనే ఏదో అవకతవక ఉన్నట్లుగా కన్పిస్తుంది. ఏదో అసహ్యంగా, రోతగా ఉంటాడు. ఎందుచేతనో చెప్పలేనుగాని అంత వెగటైన మనిషిని నాజన్మలో చూడలేదు. అతని రూపురేఖలలో ఎక్కడో వికృతలక్షణం ఉంది. ఎక్కడ ఉన్నదో ఆ వికృతం వివరించలేను. చాలా విపరీతమైనరూపం అతనిది. ఆ వైపరీత్యం ఏమిటో వేలుపెట్టి చూపలేను. అతని రూప మేమిటో నాకు అంతు చిక్కడంలేదు. వివరంగా వర్ణించలేను. అతని ఆకారం నాకు జ్ఞాపకం లేకపోవడం కాదు. ఇప్పుడు కూడా నా కండ్లకు కట్టినట్లుగా ఉన్నాడు" అని ఎన్ఫీల్డు సమాధానమిచ్చాడు.

అట్టర్సన్ తిరిగి కొంతదూరం మౌనంగా నడక సాగించాడు. బహుశః ఏదో ఆలోచనలో పడ్డాడు. "అయితే, అతడు తాళంచెవిని ఉపయోగించిన మాట నిశ్చయమేనా?" అని ఆఖరుకు ప్రశ్నించాడు.

"బలేవాడివి నీవు!......" అని ఎన్ఫీల్డు ఆశ్చర్యసూచకంగా అన్నాడు.

అట్టర్సన్ అందుమీదట అంది పుచ్చుకొని, "ఇదంతా వింతగానే కన్పిస్తుంది—నాకు తెలుసు. రెండోఆసామీపేరు నిన్ను అడుగుటలేదు. ఎందుచేతనంటే, ఆ రెండోఆసామీపేరు నాకు అప్పుడే తెలిసింది, రిచర్డు ఎన్ఫీల్డు! నీవు చెప్పిన కథంతా నాకు అంతు చిక్కింది. నీవు చెప్పిన విషయములలో ఎక్కడైనా తేడాలుంటే సరిచూచుకో" అన్నాడు.

"ఎందుకైనా మంచిదని నీవు నన్ను హెచ్చరించవచ్చు. కాని, నేను చెప్పిన విషయాలన్నీ తూచాలు తప్పకుండా వ్యాసప్రోక్తంగా చెప్పాను. అతనివద్ద తాళంచెవి ఉంది—అంతే కాదు. అతనివద్ద అది యిప్పటికీ ఉంది—వారంరోజులుకూడా కాలేదు. తిరిగి అతడది ఉపయోగిస్తూఉండగా నేను కళ్లార చూచాను" అని ఎన్ఫీల్డు జవాబు యిచ్చాడు.

అట్టర్సన్ దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచాడు. కాని ఏమీ మాట్లాడలేదు. అప్పుడు ఆ యువకుడు ఎన్ఫీల్డు యిలా అన్నాడు. "మరొక్క నీతిపాఠం నేను నేర్చుకోవాలి. నేను నాలుక బుజాన వేసుకొని వాగుతూవుండడం నాకే బాగాలేదు. ఈ విషయమై మనం తిరిగి ప్రస్తావన చెయ్యకూడదనే ఒప్పందం ఒకటి చేసికోవాలి."

"నా మనస్ఫూర్తిగా నీకు ఆ ఒప్పందంచేస్తాను. రిచర్డ్! ఇదిగో నీ చేతిలో చేయి వేస్తాను" అని లాయరు వాగ్దానంచేశాడు. [ఇంకా వుంది]



సారథీవారి "అంతా మనవాళ్లే'లో కృష్ణకుమారి.



కీ॥ శే॥ ఘంటసాల బలరామయ్యగారు

సుప్రసిద్ధ ఆంధ్రచిత్రనిర్మాత శ్రీ ఘంటసాల బలరామయ్యగారు అక్టోబరు 29వ తేదీ రాత్రి అకస్మికంగా పరమపదించారనే వార్త సినిమారంగంలోని వారికి, తదభిమానులకు విచారకారణమై వినవచ్చింది. 48 సంవత్సరాల కొద్ది వయస్సులోనే, డైరెక్టు చేస్తూ వున్న చిత్రాన్ని విడిచిపెట్టి వారు కాలధర్మం చెందడం మరింత విచారకారణమైంది. వీరి జన్మస్థలం నెల్లూరు.

తెలుగు టాకీలు ప్రారంభమైన తొలి రోజులనుంచీ వీరికి సినిమారంగంతో పరిచయం వున్నది. 1936 లో శ్రీరామఫిలిమ్స్ తరఫున "సతీతులసి" పౌరాణికచిత్రం ప్రథమంగా నిర్మించారు. కుబేరా ఫిలిమ్స్ స్థాపించి 1938 లో "భక్త మార్కండేయ" చిత్రం నిర్మించారు. 1940 లో "మైరావణ" అనే మరొక చిత్రం నిర్మించారు. "భక్త మార్కండేయ"లోనే మార్కండేయుడుగా జి. ఎన్. స్వామి అనే బాలనటుణ్ణి ప్రవేశపెట్టారు.

1941 లో బలరామయ్యగారు ప్రతిభా పిక్చర్సు అనే కంపెనీ స్థాపించారు. ఈ కంపెనీ నేటివరకూ అవిచ్ఛిన్నంగా చిత్రాలు తయారుచేస్తూనే వున్నది. మొదటగా "పార్వతీపరిణయం" నిర్మించారు. 1943 లో తీసిన "గరుడగర్వభంగం"లో భానుమతి, వేదాంతం రాఘవయ్య మున్నగువారు నటించారు. 1944 లో ఎ. నాగేశ్వరరావును రాముపాత్రధారిగా మొదటిసారిగా సినిమారంగానికి పరిచయం చేస్తూ "సీతారామజననం" నిర్మించారు. తరవాత 1946 లో "ముగ్గురు మరాఠీలు" నిర్మించారు. అయితే తెలుగు సినీలోకంలో కీర్తికేతను చిరస్మరణీయం చేయగలిగిన చిత్రం 1948 లో విడుదలైన "బాలరాజు." ఈ చిత్రంలో నాగేశ్వరరావు, ఎస్. వరలక్ష్మి నటించారు. ఇది గొప్ప ఆర్థిక విజయం పొందింది. ఈనాటికీ ఆబాలగోపాలాన్ని ఆనందింపజేసే మధుర సంగీతం "బాలరాజు" ద్వారా బలరామయ్యగారు మనకు అందించారు. తరవాత చిత్రాలు "శ్రీ లక్ష్మమ్మకథ," "స్వప్నసుందరి," "చిన్నకోడలు."

మొన్న మొన్ననే బలరామయ్యగారు మరొక చిత్రం ప్రారంభించి, కొద్ది షూటింగ్ జరిపారు. ఈ చిత్రం ముగియకుండానే వీరు స్వర్గస్థులయ్యారు. ఆరోజు సాయంత్రంవరకూ పనులు చక్కబెట్టుకుంటూ శుభ్రంగా తిరుగుతూ వున్నవారల్లా కొద్దిసేపు బాధపడి, హృదయచలనం ఆగిపోయి కాలం చేశారు. వారి భౌతికకళేబరాన్ని పలువురు తెలుగు, తమిళ నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, తదితరులు వచ్చి దర్శించి సానుభూతి తెలిపినారు. ★



కీ॥ శే॥ ఘంటసాల బలరామయ్యగారికి అంజలి సమర్పించడానికి వచ్చిన నాగేశ్వరరావు, రామారావు, తదితర సినీప్రముఖులు.

భారతీయచిత్రాల్లో దృశ్యాలు తగ్గిపోయాయి

కె. శ్రీనివాసన్ అభిప్రాయం

భారతీయ చిత్రాల్లో అభ్యంతరం చెప్పదగిన దృశ్యాల సంఖ్య, సంభాషణల సంఖ్య తగ్గిపోతున్నదని, అయినా చిత్రాలస్థాయి చెప్పుకోదగినంత పెరగలేదని కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు తాలూకు పరిశీలక సంఘాలవారు అభిప్రాయపడుతున్నారు. కలకత్తా ప్రాంతీయ సెన్సార్ అధికారి కె. శ్రీనివాసన్ కలకత్తాలో పత్రికావిలేఖరులతో మాట్లాడుతూ పై విషయం వెల్లడించారు.

వివిధచిత్రాలను పరిశీలించడంలో ఒకే మాదిరి నిబంధనావళిని అనుసరించవలెనని, భారతీయచిత్రాన్నొకవిధంగాను, విదేశీయచిత్రాన్నింకొకవిధంగాను విచక్షణ చేసి పరిశీలించరాదని కేంద్రసెన్సార్ బోర్డు ప్రాంతీయ పరిశీలక సంఘాలను ఆదేశించినదనికూడా ఆయన చెప్పారు.

బెంగాలీ చిత్రనిర్మాతలు 'సెంటిమెంటాలిజమ్' అధికంగావున్న చిత్రాలను, బాధలు, నిరాశ చూపించే చిత్రాలను నిర్మించడంలో ఆసక్తి చూపుతున్నారనీ, వీటివల్ల హాని కలుగుతుందనీ తాము వారిని హెచ్చరించినట్లుకూడా శ్రీనివాసన్ గారు చెప్పారు.

[illegible]

తెలుగు చిత్రరంగంలో ఆర్థికమాంద్యం ఇంకా తిష్ఠ వేసుకుని వున్నట్లే కనిపిస్తోంది. ఆగస్టు 28 న "చండీరాణి" విడుదల అయిన తర్వాత రెండు నెలలకు పైగా తెలుగు చిత్రం విడుదల కాలేదు. ఈ యేడాది యిప్పటికి 21 చిత్రాలదాకా విడుదలయ్యాయి. ఒక్కొక్క నెలలో నాలుగేసి చిత్రాల చొప్పున కూడా విడుదలయ్యాయి. హఠాత్తుగా సెప్టెంబరు, అక్టోబరు నెలలు వచ్చేసరికి ఒక్క చిత్రంకూడా ప్రజల కళ్లబడని స్థితి ఏర్పడింది. ఈ రెండు నెల్లోనూ విడుదల అవుతాయనుకున్న చాలాచిత్రాలు కారణాంతరాలవల్ల అలా కాలేదు. కొన్ని చిత్రాలకు సెన్సార్ అడ్డంకులు, మరికొన్నిటికి షెడ్యూలు ప్రకారం పని జరక్కపోవడం, ఇంకా కొన్ని ఇప్పుడు విడుదల చేయడమా మానడమా అని సందేహించడం కారణాలైవుంటాయి. ఏమైనా యీ యేడాదిలో విడుదలయే అవకాశంగల చిత్రాలు పెంపుడుకొడుకు, ప్రతిజ్ఞ, అంతా మనవాళ్లే, రోహిణి, చంద్రహారం మొదలైనవున్నాయి. వీటిలో చాలమటుకు కిందటియేడాది ప్రారంభించబడినవే. 'పెద్దమనుషులు' చిత్రం పూర్తయిందట కాని విడుదల ఆలస్యం చేయబడవచ్చునని తెలుస్తోంది. ఇంకా కొన్ని చిత్రాలు చాలాకాలం క్రితమే ప్రారంభించబడి ఆర్థికమాంద్యం మున్నగు కారణాలవల్ల నిలిచిపోయివున్నాయి. సక్రమంగా నిర్మాణం సాగుతున్న చిత్రాలు లెక్కబెట్టడానికి ఒక చేతివేళ్ళు సరిపోతాయి. కొత్తగా నిర్మాణం ప్రారంభించబడిన చిత్రాలు కూడా పూర్తయేసరికి ఎంతికాలం పడుతుందో ఎవరూ ఊహించలేరు. మొత్తానికి తెలుగు చిత్రసీమ ఎటుచూసినా నిరుత్సాహజనకంగా వుందని అంతా భావిస్తున్నారు.

'సలోమీ'

కొలంబియా పిక్చర్స్‌వారు టెక్నికలర్‌లో తీసిన 'సలోమీ' చిత్రం యీ నెల 6 నుంచి న్యూ ఎలిఫిన్‌స్టన్ (మద్రాసు) లో ప్రదర్శిస్తున్నారు. 1 వ తేదీన యీ చిత్రాన్ని పత్రికాప్రతినిధులకు గాను ప్రత్యేకంగా ప్రదర్శించారు.

క్రీస్తు మత ప్రచారకులలో ఒకడైన జాన్-ది-బాప్టిస్‌ను గెలీలీరాజు హీరడ్ అనే అతడు, భార్యా ప్రోద్బలంవల్ల చంపిస్తాడు. అన్నను చంపించి ఆయన భార్యతో కాపురంచేస్తున్న యీరాజు, ఆమె కుమార్తె సలోమీ ఒకానొకనాటి రాత్రివేళ చేసిన నృత్యం చూసి పరవశుడై అట్టి స్థితిలో జాన్-ది-బాప్టిస్ హత్యకు అనుమతిస్తాడు. ఇది క్రైస్తవలోకంలో ప్రచారమై వున్న కథ. దీనినే కొలంబియా పిక్చర్స్‌వారు 'సలోమీ' అన్న పేరుతో టెక్నికలర్ చిత్రం తీశారు.

ఇందులో 'సలోమీ' గా ప్రపంచ ప్రఖ్యాత తార రీటా హేవర్తు నటించింది. చివరఘట్టాల్లో యీమె చేసిన 'ఏడు ముసుగుల నృత్యం' బాగుంది. హీరడ్‌గా నటించిన చార్లెస్‌లాటన్ అసమానమైన ప్రతిభ కనుపర్చాడు. ★

★ సినిమా వార్తలు ★

సారథీవారి చిత్రం "అంతా మనవాళ్లే" నిర్మాణం చురుకుగా సాగుతున్నదని తెలుస్తోంది. కృష్ణకుమారి, జమున, సి. ఎస్. ఆర్., నరసింహారావు, ఎస్. వి. రంగారావు మున్నగు నటీనటులు పాల్గొంటున్న యీచిత్రానికి తాపీ చాణక్య దర్శకుడు. త్వరలో ఈచిత్రం విడుదల చేయబడుతుందని తెలుస్తోంది

*　　*　　*

మద్రాసు ప్రాంతీయ సెన్సార్ అధికారిగా శ్రీ జి. టి. శాస్త్రి నియమించబడి, అధికారం స్వీకరించారు. వీరిదివరకు ఆలిండియా రేడియోలో పనిచేశారు.

*　　*　　*

8, 9 తేదీలలో ఢిల్లీలో జరుగుతున్న సినిమాతారల క్రికెట్ ఆటలో బొంబాయి తారలు 35 మంది పాల్గొంటున్నారు. వీరిలో దిలీప్‌కుమార్, రాజ్ కపూర్, నర్గిస్, మోతీలాల్, నిమ్మి, నిరూపరాయ్, శ్యామ, సూర్యకుమారి, నిగార్ సుల్తానా, వైజయంతీమాల, కామినీకౌశల్, జైరాజ్, దేవానంద్, శేఖర్, డేవిడ్, ప్రాణ్, గోప్, ఆగా, ముఖేష్ ఉంటారట. ఒక జట్టుకు మోతీలాల్, మరొకజట్టుకు రాజ్ కపూర్ కెప్టెన్లుగా వుంటారట. భారత సర్వసేనాని పేరుమీద నెలకొల్పబడిన సైనిక క్షేమనిధికి సహాయంగా ఈ క్రికెట్ ఆట ఏర్పాటు చేయబడింది.

*　　*　　*

ఇండియాలో ఈ ఏడాది ప్రారంభం నుండి ఇప్పటివరకూ 194 చిత్రాలు నిర్మించబడ్డాయనీ, కిందటి ఏడాదిలో సరిగ్గా ఇదే కాలంలో 166 చిత్రాలు మాత్రమే వెలువడ్డాయని, కనుక ఈ ఏడాది చిత్రాలసంఖ్య ఇంతవరకూ 28 పెరిగిందనీ భారత చలనచిత్ర నిర్మాతల సంఘం (ఐ. ఎమ్. పి. పి. ఎ.) అంచనా తయారుచేసింది. బొంబాయిలో హిందీ చిత్రాలు ఈ సంవత్సరం 74 (నిరుడు 66) తయారయ్యాయి. తమిళ చిత్రాలు ఇప్పటికి 32 (నిరుడు 24), బెంగాలీ చిత్రాలు 38 (నిరుడు 31) మరాఠీ చిత్రాలు 14 (నిరుడు 9) తెలుగు చిత్రాలు 21 (నిరుడు 17) కన్నడ చిత్రాలు 4, పంజాబీ చిత్రాలు 2, ఇంగ్లీషు చిత్రాలు రెండు, అస్సామీస్ చిత్రం 1 ఈ ఏడాది తయారయ్యాయి. కలకత్తాలో కిందటేడు అయిదు హిందీచిత్రాలు తయారుకాగా ఈ యేడు మూడు, మద్రాసులో కిందటేడు మూడు హిందీచిత్రాలు తయారుకాగా ఈ యేడు రెండు (లడ్కీతో కలిపి) మాత్రమే తయారయ్యాయి. మళయాళ చిత్రాలు 1952 లో 8 తయారైతే ఈ ఏడు 6 మాత్రమే తయారైనవి.

ఈ యేడాది చిత్రాలసంఖ్య హెచ్చినా బాక్సాఫీసు వసూళ్ళుమాత్రం తగ్గేవున్నాయట. వినోదపుపన్ను వసూళ్లు ఈయేడు

ప్రశ్నలు..సమాధానాలు

గ్రోలి కేశవరావు—వడ్లమూరు.

దేవుడు రాముడని, ఏసుక్రీస్తు అనీ, అనేకవిధాల చెప్తారుకదా! ఐతే ఈగుడులలో ఉండే అమ్మవార్లెవరు? భగవంతుడికి వీళ్లకి ఉండే రిలేషన్‌షిప్ ఏమిటి? ఎవరి మాహాత్మ్యం ఎక్కువ?

—ఏసుక్రీస్తు దేవుడుకాడు. ప్రవక్తయై జన్మించిన దేవునికుమారుడట. అమ్మవార్లందరూ అల్పదేవతలు. వారిని కొలిస్తే వ్యాధులు రావనీ, అభీష్టాలు సిద్ధిస్తాయనీ కొందరి నమ్మకం. భగవంతుడికి పలువురు పలురకాల నిర్వచనాలిచ్చారు. అందుచేత ఆయనెవరో ఇప్పటికీ సహేతుకంగా తేలలేదు. ఇక ఎవరిమహత్తు ఎక్కువా అంటే ఎవరికెవరిమీద నమ్మకంవుంటే వారికి వారి మహత్తే ఎక్కువఅని చెప్పాలి.

*　　　*　　　*

కనుపర్తి విఠల్‌రావు—నెల్లూరు.

స్త్రీకి జీవితములో స్వేచ్ఛ ఎప్పుడండి?

—ఆర్థికస్వేచ్ఛ, విద్యాస్వేచ్ఛ లభించినప్పుడు.

మహారెడ్డి వెంకటేశ్వరరావు — మచిలీపట్టణము.

28-10-53 వారపత్రికలో వడ్డాది పాపయ్యగారి చిత్రమును ప్రచురించారు. దాని అర్థ మేమిటండీ?

—జీవన యాత్ర కత్తిఅంచుపై నడవడం వంటిదని ఆ చిత్రం అభిప్రాయం. దానిక్రింది శ్లోకపాద భాగం కఠోపనిషత్తులోనిది. "ఆ మార్గము మంగలికత్తి అంచువలె నిశితమైనది, నడవరానిది, గమింపరానిది..." అని అర్థం.

*　　　*　　　*

ఎస్. ఎం. బాషా—బద్వేలు.

ఒక సంగీత దర్శకుని ప్రతిభ అతను పాటలకు సమకూర్చే సంగీతాన్నిబట్టి నిర్ణయిస్తారా? లేక చిత్రానికి యిచ్చే 'బ్యాక్‌గ్రౌండ్' సంగీతాన్నిబట్టి నిర్ణయిస్తారా?

—మనదేశంలో సంగీత దర్శకుడు అంటే పాటలకు ట్యూనులు పెట్టేవాడనే అర్థం బాహాటంగా వున్నది. పాశ్చాత్య చిత్రాల్లో పాటలు లేని చిత్రాలే ఎక్కువగనక బాక్‌గ్రౌండ్ సంగీతం ఇచ్చేవాడినే సంగీత దర్శకుడంటారు.

చలనచిత్ర నిర్మాణంలో 'సహాయ సంగీత దర్శకుని' పని ఏమిటో తెల్పుతారా?

—సంగీత దర్శకుడికి ట్యూనులు కట్టడంలోను, నేపథ్యసంగీతం ఇవ్వడంలోను సహాయం చేసేవాడు సహాయ సంగీత దర్శకుడు.

*　　　*　　　*

ఎమ్. ఎస్. భాగ్యం—తిరుత్తని.

జర్నలిస్టు కావాలంటే, ఏ సర్టిఫికేట్టు కావలయునండి?

—'ఏ' సర్టిఫికెట్టు కావాలి.

*　　　*　　　*

పి. చెంచయ్య—బందరు.

అమియాచక్రవర్తి దర్శకత్వం వహించిన "పతిత" బాగులేదని విమర్శించారు. చూచిన ప్రజలంతా బాగుందనిపొగుడుతుంటే మీరు బాగులేదన్నారు. వాళ్లంటే మీకు పగా?

—మీ ఆరోపణ అనుచితంగా వుంది. కళావిమర్శకు ఆధారం సహృదయత, సత్యశోధన, తత్త్వాన్వేషణ. - పగకాదు. గ్రీకు వేదాంతి సోక్రటీస్ ఎవరేవిషయం చెప్పినా "*Let us investigate*"('ఇదిపరిశీలిద్దాం') అనేవాడు. అలాగ ప్రతివిషయాన్ని సహేతుకంగా పరిశీలించాలనే దృష్టి మాది. "పతిత" చూచిన ప్రజలంతా బాగుందన్నారనడానికి ఆధారంలేదు.

*　　　*　　　*

బి. వెంకటేశ్వరరావు—రాజమండ్రి.

విద్యార్థులు రాజకీయములలో పాల్గొనవద్దని చెప్పుతారు. రాజకీయములలో పాల్గొనిన తప్పా! ఎందుచేత?

—విద్యార్థిదశలో చెయ్యవలసిన పని విజ్ఞానం ఆర్జించడం. రాజకీయాల్లో ప్రవేశిస్తే విజ్ఞానార్జన దెబ్బతింటుందనే ఉద్దేశ్యంతో పెద్దలు అలా చెబుతారు. ప్రస్తుత స్థితి చూస్తే రాజకీయాల్లో ప్రవేశించిన తరవాత కొత్త విజ్ఞానం ఆర్జించకపోగా, ఆర్జించినది విసర్జించడం కూడా కనిపిస్తుంది. ★

నూటికి పదివంతులు తగ్గదల చూపడం దీనికి నిదర్శనం.

*　　　*　　　*

ఇటలీలో ఈ సంవత్సరారంభంనుంచి ఆగస్టునెల 1 వరకూ 105 చిత్రాలు సెట్స్‌కి వెళ్ళాయట. వీటిలో 33 వర్ణచిత్రాలు, 5 త్రీ - డీ మొదలైన పద్ధతుల చిత్రాలు ఉన్నాయట.

*　　　*　　　*

లండన్‌లోని ఏషియన్ ఫిలిం సొసైటీ వారు బిమల్‌రాయ్ తీసిన "దోబిఘా జమీన్" చిత్రాన్ని లండనులో ప్రత్యేకంగా కొందరు అతిథులకు ప్రదర్శించి చూపారట. వారిలో ఈజిప్టు, ఇండోనీషియా, బర్మా రాయబారులు, సింహళ హైకమీషనరు, సొహరాబ్ మోడీ, మెహతాబ్, భారత హైకమీషనర్ ప్రతినిధి ధర్మవీర మున్నగువారున్నారట. చిత్రం చూసి యావన్మందీ ఏకగ్రీవంగా హర్షం వెలిబుచ్చారట. భారతదేశంలోని పేదరికం సమస్యను చిత్రించే యీ చిత్రానికి వచ్చినంత ప్రశంస ఏషియన్ ఫిలిం సొసైటీ వారు ఇదివరలో ప్రదర్శించిన ఏ యితర చిత్రానికీ రాలేదట.

*　　　*　　　*

ఎస్. ఎస్. వాసన్‌గారు నిర్మించనున్న వర్ణచిత్రానికి హిందీ తార మధుబాల బుక్ అయిందట. ఈ చిత్రం అంతర్జాతీయ ప్రదర్శన దృష్టిలో పెట్టుకుని నిర్మించబడుతుందట.

*　　　*　　　*

విక్టర్ హ్యూగో నవల "హంచ్ బాక్ ఆఫ్ నాటర్ డామ్" ఆధారంగా అమియ చక్రవర్తి "బాద్షా" అనే హిందీ చిత్రం ఇటీవల ప్రారంభించాడు. గూనివాడుగా ఉల్లాస్, జిప్సీ యువతిగా ఉషాకిరణ్ నటిస్తున్నారు. కె. ఎన్. సింగ్, ఆగా, ప్రదీప్‌కుమార్, అచలా సచ్‌దేవ్, మాలా సిన్హా మున్నగువారు తదితర పాత్రధారులు. సంగీతదర్శకులు శంకర్‌జైకిషన్. ★

★ శనిదేవత రథచక్రం ★

(11-వ పేజీ తరువాయి)

మేడ కిటికీలోంచి చెత్తబుట్టలు కిందికి బోర్లించే సమయానికి సరిగ్గా అక్కడ హాజరుగా వుండేవాడు. అందుచేత దుస్తులమీద విధిగా దోసకాయతొక్కలు వగైరా చెత్త ధరించి తిరిగేవాడు. తను నడుస్తున్న వీథిలో ఏం జరుగుతోందో ఒక్క రోజు వన్నా అతడు గమనించిన పాపాన పోలేదు. అతని సహోద్యోగులు కనుచూపుమేర దూరంలో ఎవరి బొత్తాములు వూడిపోయాయో, ఎవరి చొక్కా చిరిగిపోయిందో ఇట్టే పసికట్టి ఆనందించేవారు. కాని అకాకీకి ప్రపంచంలో ఎక్కడచూసినా తను వ్రాసే అందమైన అక్షరాల నాట్యమే కనబడేది. ఎప్పుడైనా వెనకనుంచి ఏదో అశ్వశకటం వచ్చి ఆగి, దాని తాలూకు అశ్వరాజం ముట్టెతో అకాకీ చుబుకం చుంబించేదాకా, అతనికి తను రోడ్డు పక్కన నడవడం లేదనీ, రోడ్డుమధ్య సమ్మర్దంలో నిలబడిపోయాననీ తెలిసేది కాదు.

ఇంటికిరాగానే, బల్లముందు కూర్చుని, క్యాబేజీ పులుసు గబగబ జుర్రి, ఉల్లిపాయలతో సహా మాంసంముక్క మింగేసేవాడు. తినేదాని రుచినిగూర్చి కూడా అతడెన్నడూ ఆలోచించలేదు. తన ఎదురుగా పళ్లెంలో ఏది వడ్డించబడి వుంటే అది, అందులో దేవుడు దయతలచి ఈగలు, చీమలు వగైరా ఏ జంతువుల్ని పడేసినా చూసుకోకుండా తినేసేవాడు. పొట్టనిండిపోయిందని జ్ఞాపకం వచ్చినప్పుడు బల్లదగ్గిర్నుంచి లేచేవాడు. వెంటనే యింటికి తెచ్చుకున్న ఆఫీసు కాగితాలు కాపీ చేయడం ప్రారంభించేవాడు. ఒకవేళ కాపీ చేయవలసిన కాగితాలు లేకపోతే, తన కోసం, తన తృప్తికోసం కాపీ చేసిపెట్టుకునేవాడు. ముఖ్యంగా తన కిష్టమైన ఉత్తరమైతే, అంటే ఎవరైనా ఉన్నత పురుషునికి పంపించే ఉత్తరమైతే మరింత ఉత్సాహంగా సొంతానికి కొన్ని కాపీలు వ్రాసిపెట్టుకునే వాడు.

సాయంత్రాలప్పుడు అకాకీ ఎక్కడికీ కదిలేవాడుకాడు. సెంట్ పీటర్స్‌బర్గ్ నగరోపరి గగనతలంనుంచి అస్తంగత సూర్యుని అంత్యారుణకాంతులు అంతర్హితాలయ్యే సమయాల్లో, నగరంలోని ఉద్యోగులు ఎవరి తాహతుకు తగిన విందుల్లో వారు పాల్గొనే సమయాల్లో, రోజంతా పనిచేసి విశ్రాంతి కోసం, వినోదంకోసం ఎవరికి తోచిన చోటికి వారు పోయే సమయాల్లో అకాకీ ఏకాకియై తన గదిలో వ్రాసుకుంటూ కూర్చునేవాడు. కొందరు నాటకశాలకు వెళ్లేవారు. కొందరు బజార్లలో పచార్లు చేస్తూ అందమైన ఆడమొహాలు అన్వేషించేవారు. కొందరు తమ ప్రియురాళ్లను కలుసుకొని తమ ప్రేమనుగూర్చి కోతలు కోసేవారు. కొందరు తమ స్నేహితుల యిళ్లకు వెళ్ళి టీ తాగుతూ, పొడుగాటి పైపులు కాలుస్తూ, ఆ కబురూ యీ కబురూ చెప్పుకుంటూ, చెప్పుకోడానికి కొత్తవేమీ లేకపోతే పాతవే మళ్ళీ మళ్ళీ చెప్పుకుంటూ గడిపేవారు. ఇలా అందరూ ఏదో వినోద వ్యాపకంలో నిమగ్నులై వుండగా, అకాకీ మటుకు నిర్వికారుడై, తనివితీరా వ్రాసి నిద్రపోయేవాడు. నిద్రలోకూడా మర్నాడు తనకి దేవుడు ఏ ఉత్తరం కాపీ చెయ్యమని అనుగ్రహిస్తాడో తలుచుకుంటూ చిరునవ్వు నవ్వుకునేవాడు.

ఈవిధంగా ఈ గుమాస్తా జీవితం ప్రశాంతంగా వెళ్లిపోతోంది. అతని జీతం నాలుగు వందల రూబుళ్ళు. ఈ జీతంతో తృప్తి పడడం అతనికి ఉగ్గుతో పెట్టిన విద్యే గనక ఏ యిబ్బందీ లేకుండా రోజులు దొర్లిపోతున్నాయి. అలాగే వృద్ధాప్యంవరకూ దొర్లిపోవలసినదే గాని, ఆ తరగతి ఉద్యోగుల జీవితమార్గంలో ఎన్నో అపాయాలు పొంచి వుండి కాటేస్తుంటాయి.

సెంట్ పీటర్స్‌బర్గ్‌లో నాలుగు వందల రూబుళ్ళు, లేక ఆ దరిదాపుల్లోని జీతం రాళ్లు తెచ్చుకునేవారందరికీ ఒక ఉమ్మడి శత్రువున్నాడు. వాడి పేరు 'చలిగాలి'. ఈ చలిగాలి ఉత్తరదిక్కునుంచి వస్తుంది. అది ఆరోగ్యదాయకమని కొందరంటారు గాని బీదలపాలిటి యమపాశంలాగ అది సోకుతుంది. ఉదయం తొమ్మిది గంటలప్పుడు, ఉద్యోగులు ఎవరి ఆఫీసులకు వారు పరుగెత్తే సమయాల్లో యీ ఉత్తరపుగాలి సముద్రతీరం గాలవలె నిర్దాక్షిణ్యంగా ప్రసరిస్తూ, జనుల నాసికా శ్రవణ పుటాలను భేదిస్తూ, హోరున వీస్తూ, రక్తం గడ్డ గట్టిస్తూ, విజృంభిస్తుంది. అందుచేత గుమాస్తాలందరూ పల్చటి కోట్లలో ముడుచుకుపోయి సాధ్యమైనంత వేగంగా నాలుగైదు వీధులు నడిచి ఆఫీసులకి చేరుకుంటారు. గేటు బంట్రోతు కూర్చునే ముందరి గదిలో కాళ్లు వెచ్చబెట్టుకుని, దోవలో గడ్డకట్టుకుపోయిన తెలివితేటల్ని, శక్తి సామర్థ్యాల్ని కరిగించుకుని, తిరిగి ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు.

అకాకీ అకాకియెవిచ్ కొద్దిరోజుల క్రితమే వొక విషయం కనిపెట్టాడు. తను ఎంత వేగంగా వీధులు దాటేసి ఆఫీసు చేరుకుంటున్నా చలిగాలి తన్ను కొరుక్కు తినడం మానలేదు. తత్ఫలితంగా వీపు, బుజాలు నొప్పిపెట్టసాగించాయి కూడాను. ఈ అవస్థకంతటికీ కారణం తన పాతకోటు కాదుగదా అని అకాకీ అనుమానించాడు. ఒకరోజు యింటికివెళ్లాక కోటు యావత్తూ శోధించసాగాడు. రెండుచోట్ల, అంటే వీపుమీద, బుజాలమీద కోటుగుడ్డ దోమతెరలాగ కృశించిపోయిందని గ్రహించాడు. అసలు చాల యేళ్ళుగా అకాకీ సహోద్యోగులందరికీ యీ కోటును వేళాకోళం చేయడం పరిపాటి అయిపోయింది. దానికి 'కోటు' అనే గౌరవప్రదమైన పదం వాడడంకూడా అనవసరమని 'తుండుగుడ్డ' అని చాలరోజులుగా వ్యవహరిస్తున్నారు. నిజానికి ఆ కోటు ఏటేటికీ మారిపోతోంది. కాలరు కాల్రక్రమాన తగ్గిపోతూ, ఆ గుడ్డ యితర ప్రాంతాలకు అతుకువెయ్యడానికి ఉపయోగపడుతూ వస్తోంది. అతుకు వేసేదకూడా అతనే గనక, కోటు ఎంత లక్షణంగా తయారైందో చెప్పనక్కరలేదు. పరిస్థితులీ విధంగా ఉండడంచూసి అకాకీ అకాకియెవిచ్ ఇక దాన్ని పెట్రోవిచ్‌కి అప్పగించక తప్పదనే నిశ్చయానికి వచ్చాడు. పెట్రోవిచ్ దర్జీవాడు. చీకటి కోణంలాంటి మెట్లెక్కి నాలుగో అంతస్తు చేరితే పెట్రోవిచ్ ఆవాసం. అతడు ఏకనేత్రుడు; రుజా జర్జరిత గాత్రుడు; అయినా ఉద్యోగుల పంట్లాములు, కోట్లు మరమ్మత్తు చేసి, ధనం ఆర్జించడంలో విజయవంతుడైనాడు.

ఈ దర్జీవాణ్ణిగూర్చి ఎక్కువ వ్రాయవలసిన అవసరంలేదు. కాని కథలోని ప్రతి పాత్రయొక్క గుణగణాలను ఆమూలాగ్రం నిర్వచించడం సాహిత్యాచారం గనుక వ్రాయకతప్పదు. పెట్రోవిచ్‌ని ఇదివరకు వట్టి గ్రిగొరీ అని పిలిచేవారు; ఒక భూస్వామి కింద జానిసగా వుండేవాడు. అతనికి స్వేచ్ఛ రాగానే, ప్రతి పండగ తనపేరునాడూ తాగడం మొదలుపెట్టడమే కాక కూడా పెట్రోవిచ్ అని చెప్పుకోసాగాడు. అతనికొక భార్య వున్నది. ఆమెతో దెబ్బలాట వచ్చి తిట్టవలసివస్తే "జర్మన్!" అని తిట్టేవాడు. భార్యసంగతి ఎత్తేము గనుక ఆమెను గూర్చి రెండు మాటలు చెప్పడం మంచిది. దురదృష్ట వశాత్తు, ఆమె పెట్రోవిచ్ భార్య అని తప్పితే మన కెక్కువ తెలియదు. నీటైన బట్టలు ధరించినా అందగత్తె అని చెప్పడానికి వీల్లేదు. ఆమె ఎప్పుడైనా బజార్లో వెడుతుంటే సోల్జర్లు తప్ప మరి ఎవరూ ఆమెకేసి చూసేవారు కాదు.

అకాకీ పెట్రోవిచ్‌యింటికి బయల్దేరాడు. మేడ మెట్లమీద చీకటి రాజ్యం చేస్తోంది. పాత్రలు కడిగిన మురికి నీటితో మెట్లు జారుడుగా వున్నాయి. జాగ్రత్తగా మెట్లెక్కుతూ, పెట్రోవిచ్ ఏమాత్రం అడుగుతాడా అని అకాకీ ఆలోచించాడు. రెండు రూబుళ్ళకంటె ఎక్కువ యివ్వగూడదని తీర్మానించుకున్నాడు. పెట్రోవిచ్ గదికి పోవడానికి ముందు వంటగది వున్నది. వంటగదినిండా పొగ దట్టంగా లేస్తున్నందువల్ల తలుపులు తెరిచేవున్నాయి. అకాకీ నిశ్శబ్దంగా నడిచివెళ్లాడు. పొగమూలంగా అతడు రావడం పెట్రోవిచ్ భార్య చూడనేలేదు. పెట్రోవిచ్ గదిలోనే వున్నాడు; ఊగిసలాడే ఒక బల్లమీద మొగల్ పాదుషాలాగ కూర్చున్నాడు. అతన్ని చూడగానే ముందు దృష్టి పడేది అతని బొటనవ్రేలిమీద. దాని గోరు నల్లగా, వికృతంగా, తాబేటి డిప్పలాగ ఉబ్బి గట్టిగా వున్నది. బుజాలమీద దారాలు వేళ్ళాడుతున్నాయి. ఒళ్లో ఏదో పాతగుడ్డ వున్నది. గడిచిన మూడు నిమిషాలనుండి సూదిలోకి దారం ఎక్కించడానికి ప్రయత్నిస్తున్నాడు కాని లాభం లేకపోతోంది. చీకటిని చెడామడా తిట్టాడు. దారాన్ని, సూదిని కూడా మాటలు తిట్టాడు.

పెట్రోవిచ్ క్రుద్ధుడైవున్న తరుణంలోనే అక్కడ అడుగుపెట్టడం అపశకునంగా భావించాడు అకాకీ. పెట్రోవిచ్ కోపంగా వున్నాడంటే అర్థం, బ్రాందీకి కొరతలేదన్నమాట. బ్రాందీ దొరకని సమయాల్లో పెట్రోవిచ్ ప్రపంచంలో వున్న దైన్యం, నిస్సహాయత యావత్తూ గూడుకట్టినట్టు కుంగిపోయివుంటాడు. అటువంటప్పుడు ఎంత తక్కువ రేటుకైనా పనిచేసిపెడతాడు. ఎంతిస్తే అంతా పుచ్చుకుని కృతజ్ఞత కూడా తెలుపుతాడు. ప్రస్తుతం పెట్రోవిచ్ ఆ స్థితిలో లేడు. బెట్టుసరిగా, దురుసుగా, నోటికొచ్చినరేటు అడిగే మనిషిగా కనిపించాడు. ఎంతడుగుతాడో దేవుడికే తెలియాలి. అకాకీ ఇదంతా గ్రహించి వెనక్కి పోదామా అనుకున్నాడు గాని, తీరా వచ్చాక వెనుకంజ వేయడమూ అనిపించింది. పెట్రోవిచ్ కనుబొమలు చిట్లించి, ఏకనేత్రం పైకెత్తి అకాకీని మింగేసేట్టు చూశాడు. అకాకీ హడిలిపోయి అప్రయత్నంగా "కులాసాగా వున్నావా, పెట్రోవిచ్" అని పరామర్శించాడు.

పెట్రోవిచ్ దయతలిచి అంటున్నట్టు "గుడ్‌మార్నింగ్, సార్" అన్నాడు. అని అకాకీ ఏం పట్టుకొచ్చాడో నని చేతులు చూశాడు.

"ఆ. నేను, నీకు, పెట్రోవిచ్, ఇది—" అని అకాకీ మొదలెట్టాడు. పాఠకులకు ముందొక విషయం చెప్పాలి. అకాకీ అకాకియెవిచ్ మాట్లాడేటప్పుడెప్పుడూ సర్వనామాలు, అవ్యయాలు, విశేషణాలు, సగం విరిగిన మాటలు ఉపయోగిస్తాడు. వాటికి అర్థం ఊహించడం ఎవరితరమూ కాదు. మరీ కష్టమైన అభిప్రాయం వెల్లడించవలసివస్తే, వాక్యాలు పూర్తిచెయ్యకుండానే మధ్యలో ఆగిపోవడం అతని కలవాటు. తరుచు ఒక వాక్యం మొదలెట్టి "ఇది, నిజానికి, చాలా, మరి—" అని ఆగిపోయేవాడు, వాక్యం పూర్తయిందనుకుని.

"ఏమిటది?" అని పెట్రోవిచ్ ప్రశ్నించాడు. ఏకనేత్రంతో అకాకీని నఖశిఖపర్యంతం పరీక్షించాడు. కాలరు, గుండీలు, బుజాలు, చేతులు, అన్నీ చూశాడు. దర్జీలందరికీ ఇది అలవాటే; మనిషిని చూడగానే ముందు బట్టలవంక చూస్తారు.

"నేను, ఇది, ఇక్కడ, పెట్రోవిచ్, కోటు, గుడ్డ, ఇది చూశావా? అక్కడక్కడ, కొన్నిచోట్ల గట్టిగానే వుంది - కొంచెం దుమ్ముపడి, పాతబడింది. నిజంగా కొత్తదే. ఈ ఒక్కచోటా, కొంచెం వీపుమీదా, బుజాలమీదా, చిరిగింది, అదే, బుజాలమీదే,చూశావా?అంతే.చిన్న పని—"

పెట్రోవిచ్ ఆ కోటు తీసుకున్నాడు. ముందు బల్లమీద పరిచి పరీక్షించాడు. తలకాయ అడ్డంగా ఆడించాడు. కిటికీగూట్లో వున్న పొడుండబ్బా తీశాడు. కొంచెం పొడుం పీల్చి, కోటు ఎత్తిపట్టుకుని, వెలుగు కడ్డంగా పెట్టి పరీక్షించాడు. మళ్లీ తల అడ్డంగా వూపాడు. కోటు తిరగవేసి కుట్టులైను వెంబడే పరిశీలించి, ఇంకోసారి తల ఆడించాడు. పొడుండబ్బా తెరిచి ముక్కునిండా పొడుం దట్టించి, డబ్బా మూసి యథాస్థానంలోదాచేశాడు. "లాభంలేదు; గుడ్డ దరిద్రంగా వుంది," అని తేల్చాడు.

అకాకీగుండెలు కొట్టుకోడం మానేశాయి.

"ఎందుకు లాభంలేదు, పెట్రోవిచ్?" అని చిన్నపిల్లడిలాగ ఏడుపు గొంతిక పెట్టి అడిగాడు. "బాగానే వుందిగా; బుజాలమీదేగా చిరిగింది? నీదగ్గర పాతగుడ్డ ముక్కలు—"

"గుడ్డముక్కలకేం, కావలిసినన్ని వున్నాయి. కాని అవి అతికించేందుకు ఇక్కడేంలేదే? ఇది చాలా పాతగుడ్డ. సూదిపెడితే పిగిలిపోతుంది."

"పిగిలిపోతే పోయిందిలే. మళ్ళీ అతుకు వెయ్యొచ్చు."

"అతుకు వెయ్యడానికే ఏమీ లేదనేది. కుట్టడానికి వీల్లేనంత దరిద్రంగా వుంది. గాలి గట్టిగా వీస్తే చిరిగిపోతుంది."

"అయినా ఫరవాలేదు. ఎల్లాగో, నిజానికి—"

"ఉహు" అని ఖండితంగా అన్నాడు పెట్రోవిచ్. "ఇప్పుడేం చెయ్యడానికీ వీల్లేదు. పని దండగ. ఒకపని చెయ్యి. ఇంక కొద్దిరోజుల్లో చలిగాలి మొదలవుతుంది. కాళ్లకి నీ మేజోళ్లు ఎలాగు చాలవు. అందుకని యీ కోటుగుడ్డ కాళ్ళకి చుట్టబెట్టడానికి ఉపయోగించు. ఈ పద్ధతి జర్మనీవాళ్ళు కనిపెట్టారులే." పెట్రోవిచ్ అవకాశం దొరికినప్పుడల్లా జర్మనీవాళ్ళని ఏదో అంటూ నేవుంటాడు. "ఒకటిమాత్రం నిజం అకాకియెవిచ్! నువ్వు కొత్తకోటు కుట్టించాలి," అన్నాడు.

"కొత్త" అనే శబ్దం చెవుల పడగానే అకాకీ కళ్లకు చీకట్లు కమ్మాయి. గది అంతా గిర్రున తిరగసాగింది. అతని కళ్లకి స్పష్టంగా కనిపించిందల్లా పెట్రోవిచ్ పొడుం డబ్బా ఒకటే. నిద్రలో కలవరిస్తున్నట్టు "కొత్తకోటా! నాదగ్గిర డబ్బేది?" అన్నాడు.

"అవును, కొత్తకోటే," అన్నాడు పెట్రోవిచ్ నిర్దయగా.

"మరి, కొత్తకోటైతే, మరి, మరి—"

"ఎంత ఖరీదవుతుందనా నీ సందేహం?"

"ఆ, ఆ. అదే."

"బహుశా నూటయాభై రూబుళ్ళు అవుతుందనుకుంటా. ఇంకా ఎక్కువైనా కావచ్చు," అని పెట్రోవిచ్ పెదవుల్లో చిరునవ్వు బిగించాడు. అవతల మనిషిని హఠాత్తుగా హడలగొట్టడం, వాడు గుడ్లు తేలవేసి మూర్ఛపోతుంటే వాణ్ణి క్రీగంటితో చూసి ఆనందించడం పెట్రోవిచ్‌కి అలవాటు.

"నూటయాభై రూబుళ్ళా ఒక్క కోటుకి?"అని అకాకీ అరిచాడు. అలా అరవడం అతని కదే మొదటిసారి; అతని కంఠం సాధారణంగాదైన్యానికే పేరుపడింది.

"అవును, కోటు ఎలా కుట్టినా అంతే అవుతుంది. కాలర్‌లో బొచ్చుపెట్టాలన్నా, సిల్కుముక్కలు వేయాలన్నా రెండు వందలదాకా పోతుంది."

"పెట్రోవిచ్!" అని దీనస్వరంతో వేడుకోసాగాడు అకాకీ. "మంచివాడివికదూ, చూడు. కాస్త అతుకులు వేస్తే చాలు. ఇంకా కొన్నాళ్లపాటు వస్తుంది పెట్రోవిచ్!"

"ఉహు, లాభం లేదు. డబ్బు దండగ, పని దండగ," అని ఖండితంగా చెప్పేశాడు దర్జీవాడు.

చేసేదిలేక అకాకీ అకాకియెవిచ్ నిరుత్సాహంతో నీళ్ళు కారిపోతూ వచ్చిన దారిపట్టాడు. అతడు వెళ్ళాక కొంతసేపటిదాకా పెట్రోవిచ్ మూతి బిగించి ఆవేపే చూస్తూ నుంచున్నాడు. అకాకీ మరెవరిదగ్గిరికీ వెళ్లడనీ, తనదగ్గిరికే తిరిగి వస్తాడనీ అతనికి తెలుసు. (ఇంకా వుంది)

వర్ణార్ణవం ★ —వి. ఎస్.

చిత్రకారుల దృష్టిలో మద్రాసు మహా ఎడారి. మొన్న మొన్నటివరకు యిక్కడవుండే యిన్ని లక్షలమంది జనాభాలో ఏ వెయ్యిమందికో తప్ప, చిత్రకళా ప్రదర్శనానికి పోవాలని బుద్ధిపుట్టేదికాదు. ఆ వెయ్యిమందిలోనూ ఒకరో యిద్దరో వ్యక్తులు ఒకటో అరో బొమ్మ కొనటానికి ప్రయత్నం చేసేవారు చాలాభాగం బేరసారాల్లోనే ఆగిపోయేది. తత్ఫలితంగా కళా ప్రదర్శనం ఏర్పాటు కాబోతున్నప్పుడు బొమ్మలు అమ్ముడౌతాయనీ, పదిమందీ చూసి పొగుడుతారనీ, గంపెడు ఆశ పెట్టుకొన్న చిత్రకారులు కళాప్రదర్శనం ముగిసేనాటికూడా బొమ్మలు అమ్ముడుపోక పోవటం చూసి పుట్టెడు వగపు చెందుతూ వుండేవారు. కాని యిప్పుడిప్పుడు పరిస్థితి కొంచెం మారినట్టుకనిపిస్తున్నది ఇదివరకటికంటె ఎగ్జిబిషన్లూ ఎక్కువైనాయి ప్రతి ఎగ్జిబిషన్లోనూ ఏదో ఒక బొమ్మమీద '...వారికి అమ్మివేయబడ్డమైనది' అని వ్రాసి వున్న ఎర్రటి కాగితాలు కనిపిస్తున్నాయి. అట్లా వ్రాసివున్న బొమ్మల్లో ఎన్ని నిజంగా అమ్ముడుపోయినవో, ఎన్ని బొమ్మలు అమ్మకం అనే మంత్రకవాటం తెరుచుకునేందుకు ప్రయోగించిన సాధనాలో పైనుంచి చూసినవారు ఎవరూ కనిపెట్టలేరు. నామటుక్కు నాకు—'అమ్మివేయబడ్డమైనది' అన్న కాగితంతో సహా వుండే చిత్రాన్ని చూస్తే, ఎందుకనో - పెళ్ళి అయిపోయిన ఆడపిల్లలు జ్ఞాపకానికివస్తారు. మిగిలిన బొమ్మలని చూస్తున్నంతసేపూ, కట్నాలు యిచ్చుకోలేని తండ్రుల దగ్గిర తప్పనిసరిగా తిరుగుతూ వుండే ఎదిగిన ఆడపిల్లలు జ్ఞాపకం వస్తారు

అక్టోబరు 31న అభ్యుదయ చిత్రకారుల సంఘంవారు మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో కళాప్రదర్శనం ఏర్పాటు చేశారు. ఈ సంఘంవారు ఏడాదికొకసారి దాదాపు మూడువందల బొమ్మలతో ప్రదర్శనం పరిపాటిగా ఏర్పాటు చేస్తుంటారు.

అందులో వున్న బొమ్మల నన్నిటినీ ఒకటికి రెండుసార్లు సావధానంగా చూసిన మీదట యీ వ్యాసం రాయటానికి సాహసిస్తున్నాను.

మద్రాసులో చిత్రకారుల సంఖ్య ఏడాది ఏడాదికీ పెరుగుతున్నది. ఒక్కొక్క చిత్రకారుడు అభిమానించె బాణీల సంఖ్యకూడా పెరుగుతున్నది పాశ్చాత్యదేశాలలో రోజు రోజుకీ మారిపోయే చిత్రకళారీతుల న్యాయులు ఏనాటికానాడు ఇక్కడ తయారౌతున్న చిత్రాల్లో కనిపిస్తున్నాయి. ఈ విషయంలో మద్రాసు చిత్రకారులకంటెకూడా బొంబాయి చిత్రకారులు మరీ ముందంజ వేస్తున్నారు స్థూలంగా కంటికి కనిపించే వస్తుతత్వాన్నీ, రూపాన్నీ గుర్తించటంతో మాత్రమే ఆగిపోక, మానసికమైన సాంకేతికాలను నిర్ణయించుకొని, వాటిద్వారానే చిత్రరచన జరపటం వీరిపద్ధతి బొంబాయికి చెందిన కె. ఖన్నా, ఎం. సమంత్, కె. హెచ్. ఆరా మొదలైన అరుగురుచిత్రకారుల రచనలు యీ ప్రదర్శనలో వున్నాయి వాటిని చూసి ఆనందించటానికి మామూలు మానసికస్థితి పనికిరాదనిపిస్తున్నది

బొమ్మ వేయాలనుకొన్న ప్రతివారినీ ముందుగా ఎదుర్కొనే సమస్య ఎటువంటి బొమ్మ వెయ్యాలనేది. ఆ తరువాత ఏ రంగుల్లో ఏ బాణీలో వెయ్యాలనేది బొమ్మవేసిన తరువాత పేరు ఏం పెట్టాలనేది ఈ సమస్యలన్నీ చిత్రకారుణ్ణి ఎంతగా వేధిస్తాయో, ఏ చిత్రకళా ప్రదర్శనంలో చూసినా యిట్టె తెలిసిపోతుంది ఈ ప్రదర్శనంలోనూ తెలుస్తోంది. చాలా మందికి ఒక్క స్త్రీమూర్తిని చిత్రించటంతోనే అలసట వచ్చేస్తుంది. ఎప్పటి కేరంగు తోస్తే ఆ రంగును రద్ది అప్పటికా బొమ్మ పూర్తిచేశామనుకొంటారు పేరు పెట్టటం అనే సమస్య ఎదురౌతుంది. 'బావికి' 'బావి వద్ద' 'బావినుంచి,' 'నిరీక్షణ' 'ప్రతీక్షణ 'ఒంటరితనం' 'ప్రోషితభర్తృక' వగైరా వగైరా పేర్లు పెట్టేస్తారు ఇటువంటి బొమ్మలు వేసేసమయంలో, ఆ బొమ్మలు వేసిన వ్యక్తియే వివిధమైన ఆనందమూ పొందలేడు. కొబట్టి ఆ బొమ్మలు చూసిన వ్యక్తులుకూడా వివిధంగానూ కదలిక పొందలేకపోవటంలో ఆశ్చర్యంలేదు. ఇటువంటి అవస్థ తప్పించటానికి మొన్న మొన్నటివరకు దేవుళ్ళె ఆదుకొనేవారు. మాటవరసకి ఏ శ్రీ మహావిష్ణువు చిత్రాన్నో వేస్తే, ఎలా వేసినా, చూసేవారి మనస్సులో ఆ పేరు కొన్ని భయాలను, కొన్ని అనుమానాలనూ రేపుతుంది కొబట్టి, చూసినవారు చిత్రాన్ని అందులోని మంచి చెడులనూ మనసుకు పట్టించుకోకుండా వుండేవాళ్లు. అదేమి చిత్రమో-యిటీవల దేవుళ్ళబొమ్మలు వేసేవాళ్ళు తక్కువైపోతున్నారు; దేవుళ్ళకీ పలుకుబడి తగ్గిపోతున్నట్లుంది.

ప్రతి తరంలోనూ కొందరు చిత్రకారుల దృష్టి అప్పుడప్పుడూ మనుచరిత్రవంటి ప్రాచీన ప్రబంధాల్లోని శృంగార ఘట్టాలమీదికి పోతుంటుంది. ప్రస్తుత ప్రదర్శనంలో అట్లాంటి చిత్రం ఒకటి, టి వి రత్నంగారు రచించినది, వున్నది ఈ రకాలైన కథావస్తువులు తీసుకొని బొమ్మలుగా వేసినప్పుడు ఒక పెద్ద

ఫకీరు

పాస్టెల్స్‌లో రూపచిత్రం —జి. పద్మనాభపిళ్లై (అభ్యుదయ చిత్రకారుల సంఘ కళా ప్రదర్శనంలోనిది)





పైఠికురాలు —చిత్రకారుడు ఏ. వి. రామమూర్తి

చిక్కు వస్తుంది ఆ కావ్యం చదివిన ప్రతి వ్యక్తీ వారివారి మానసిక అనుభూతుల పరిమితికి అనుగుణ్యమైన వూహా చిత్రాలు కొన్ని యిదివరకే చిత్రించుకొని, మెదడు మడత్లో దాచుకొనివుంటారు మరెవరో చిత్రకారుడు వేసిన చిత్రం కళ్లఎదుట కనుపించగానే, ఆ వూహా చిత్రం వుజ్వలంగా వెలిగిపోతూ ఆ మెదడు మడతలనన్నిటినీ తప్పించుకొని వూడివచ్చి వారి మనోనేత్రాలముందు నిలుస్తుంది అట్టి మానసిక చిత్రంతో పోలిస్తే ఎంత మంచి చిత్రకారుడు వేసినచిత్రమైనా పేలవంగానే కనిపిస్తుంది

మామూలు మనుష్యులకే, మామూలుగా వుండేస్థితిలో చాలామంది చిత్రకారులకి కూడా, దృష్టి ఎల్లప్పుడూ ఆనందాన్ని అందాన్ని వెతుకుతూ వుంటుంది అందమైన మొఖాలనే చిత్రించటం జరుగుతుంది ఆనందానుభూతిని స్థూలంగానూ సూక్ష్మంగానూ వ్యక్తపరిచే యితివృత్తాలే బొమ్మలలోకి ఎక్కుతుంటాయి జీవితంలో మన కళ్లకు కనిపించే అందవికారం, మన మనస్సులని కలతపరిచే దుఃఖానుభవం - యిలాంటివి కూడా చిత్రాలలోకి ఎక్కినప్పుడు ఆ చిత్రాన్ని చూసినవారి మనస్సులో ప్రథమంగాకలిగేది విచారమే అయినా దాని మానసిక అనుభూతిలో విభిన్నమైన ఆనందాన్ని పొందగలం ఈ రకమైన దృష్టితో చూసినప్పుడు పణికర్ గారు ప్రదర్శించిన 'కుష్ఠురోగులు' బొమ్మ, ఏసుక్రీసుని శిలువ సెక్కించమని అరచిన జనసందోహ చిత్రం ప్రయోజనాత్మకమైనవని చెప్పక తప్పదు.

ఎల్లప్పుడూ ఒకే ధోరణి, ఒకే బాణీ అభిమానించి వూర్తుకోవటంకంటె రకరకాల బాణీలు ప్రయోగించటం ఆరంభదశల్లో చిత్రకారుడికి చాలా అవసరం ఆ దృష్టితో చూస్తే దినకర్ పాటిల్, సి జె ఆంథోనీ దాస్ ప్రభృతులు కొందరు సరైన మార్గంలో వున్నట్లు, త్వరలోనే వీరంతా తమను తాము కనుగొని విశిష్ట చిత్రాలు రచించబోతున్నట్లు తోస్తున్నది

ఒక్క సంవత్సరం వ్యవధిలో మన నంద

★ కాలక్షేపం ★

(౬-వ పేజీ తరువాయి)

భావజం రెండూ ఉండాలి. పేవభావలు రెండూ ఉండాలి. దానిని భేషజం అంటారు- తాను యిచ్చేమందు హిమాలయ పర్వతాలలోని మూలికలనుండి తయారుచేసి నట్లుగా వర్ణించాలి. వామునుపొడిచేసి కడుపు లోకి యిచ్చినప్పటికీ దానిపేరు "అజీర్ణ గజకేసరి" అని చెప్పాలి - "ఇదివరలో ఒక వైద్యుడు నాకు 'అజీర్ణగజకేసరి' యిచ్చా డండీ! కానిదానివల్ల ఏమీగుణమివ్వలేదండీ!" అని రోగి వాదించినట్లయితే, మందుపేరు మార్చివేసి, "ఇది "అజీర్ణతిమిర భాస్కరం". ఈ కొత్తమందు మీకోసం ప్రత్యేకంగా తెచ్చాను" అని చెప్పి పాతమందుకు పది రెట్లు ప్రభావం తనమాటలలో మూటకట్టి నట్లుగా చూపించి తినిపించాలి. అజీర్ణతిమిర భాస్కరం కూడా పనికిరానిపాత మందుగా ప్రజలు పరిగణిస్తే, దానినే "అజీర్ణ భుజంగ విహంగ రాజం" (అజీర్ణమనే సర్పమును హరించే గరుత్మంతుడు) అనవచ్చు. ఈమధ్య వెంకట రత్నం అనే భిషగ్రత్నం "మేహాంతకం" అనే మందుకు బదులుగా "మేహవృశ్చిక పాదరక్ష" (మేహమనే తేలుకు చెప్పు వంటిది) అనే కొత్తపేరుపెట్టి ప్రకటన చేశాడు. కాని, చాలామంది తమ పాద ముల ముద్రచిహ్నములను కాగితముల మీద గీసి, ఆయన తయారుచేసిన పాదరక్షలను వి. పి. పోస్టులో పంపవలసినదని ఆర్డర్లు యివ్వడం ప్రారంభించారు. మరి కొందరు కొంటె తుంటరివిద్యార్థులు తమ పాత చెప్పులను ఆయనకు బంగీచేసి పంపించి, "అయ్యా, దయచేసి వీటిని, "మేహవృశ్చిక పాదరక్షలుగా" మార్పించి తిరుగు టపాలో బంగీచేసి మజూరీ చార్జీలకు వి. పి. పోస్టులో పంపించవడి" అని ఉత్తరములు వ్రాశారు. ఇదంతా మాని ఆ భిషగ్రత్నం తన పాదరక్ష భేషజప్రమాదం గ్రహించి, తనభేషజం అతిభేషజం అనర్థకం అని అర్థంచేసికొని, తన భేషజం మోతాదు తగ్గించాడు. ఉమ్మెత్త ఆకులపొడిచేసి నిప్పుమీదవేసి ఆపొగపీల్చితే ఉబ్బసం దగ్గుకు ఉపశాంతి కలుగుతుంది. కాని, అది అంత తేలిక మూలిక అని చెప్పితే, ఆమందులో ఏముంది? అంటారు. "ధత్తూర చూర్ణం" అంటే కొంతవరకు దానిమీద గురి కలుగుతుంది. ఈ ఆకునే అమెరికావారు మన దేశం నుంచి తెప్పించుకొని, ఉమ్మెత్త ఆకును మెత్తని పొడిచేసి సొగసైన సిగరెట్లుగా చుట్టి, చక్కని పెట్టెలలో పెట్టి, మరల మనకు రవాణాచేస్తే అణా కొకటి చొప్పున అవలీలగా కొంటాము. అద్భుతంగా గుణ మిచ్చినదంటాము. ఆ సిగరెట్లకు పదిరెట్లు కిమ్మత్తు యిచ్చికొంటాము. అప్పుడు దాని గుణం దశగుణంగా ఉంటుంది.

ఎన్నిమాటలు చెప్పినా, మాటలలో ఉన్న ఘాటు మనస్సులో నాటుకుంటుంది. అశ్వపతి రామచంద్రమూర్తి రాజుగారు అనే క్షత్రియ పుత్రుడు విలాసపురంలో ఉండేవాడు. ఆయనకు పెద్దలిచ్చిన ఆస్తి అన్నవస్త్రాలకు లోపంలేకుండా ఉంది. సరదాగా ఖర్చుచేయగల్గిన సంపన్నుడు. ఆయనకు 'ల'కారంపైన ఉన్నదని పుకారు ఉంది. మనిషిమాత్రము సరసుడు - ఇంగ్లీషు మాటలు దొర్లించే బడాయి కోరుకాడు. ఆయన ఇంగ్లీషుభాష ఎన్నడూ నేర్చుకో లేదు సరికదా, ఎవరైనా ఆంగ్లం మాట్లా డితే ఆయనకు ఆగ్రహంకూడా. ఆంగ్ల భాష అంటే అది ఎంగిలి భాష అని ఎక్కి రిస్తాడు. రామచంద్రమూర్తిరాజుగారికి ఇంగ్లీషు రాకపోయినా, ఊళ్లో ఉన్న ఉద్యోగులకూ ఉన్నతాధికారులకూ సన్ని హిత స్నేహితుడై సకల సుజన మనోభి రాముడై, బుధజన విధేయుడై, "ఏమండీ! చంద్రయ్యరాజుగారూ!" అని తన్ను మన్ననచేసిన చిన్నపెద్దల కందరికీ ఆయన చేదోడువాదోడుగాఉండేవాడు. చంద్రయ్య రాజుగారికి చక్కని గుర్రం చూస్తే చంద్రునిలోని లేడివలె నాడి పరుగెత్తు తుంది. అయనకు గుర్రపు సవారీలో ఉన్న ఖులాసా మరెందులోనూ లేదు. అసలైన సిసలైన అశ్వం దొరికితే ఆయన విశ్వం మరచిపోతాడు. చంద్రయ్యరాజు గారి యింటిపేరే అశ్వపతివారు - ఆపేరు, ఆయనలో శాశ్వతంగా సార్థకమైంది - కొంతకాలంక్రిందట ఆయన శ్రేష్ఠమైన పంచకల్యాణి గుర్రమొకటి ఏరి కోరి ఎనిమిదివందలరూపాలయకుకొన్నాడు. అది గుర్రం అంటే గుర్రం కాదు. కదను తొక్కితే, నేలవిడిచి సాముచేసినట్లుండేది. తురగగతి రగడలాగున అడుగువేసి పరుగు లిడేగుర్రం అది. దానికోసం ప్రత్యేకంగా అందమైన గుర్రపుబండీ షోకైనది సికింద్రా బాదులో తయారుచేయించి తెప్పించాడు. అది టాపు(గూడు)ముడిచివేయుటకు వీలైన బండీ - గుర్రపువాడు బండీ వెనుకవైపున నిల్చుంటే, ఆయన బండీముందుసీటులో రథ సారథియై ఠీవిగాకూర్చుండి ఆగుర్రపు బండీని తానే స్వయంగా విలాసపురం రస్తాలమీద వివిధవింత విలాస విన్యాస దిలాసా ఖులా సాలతో పరుగెత్తించేవాడు. చంద్రయ్య రాజుగారు మీసాలు మెలియబెట్టి. జులపాలు వెనుకకు వంకరలుగా త్రిప్పి, శ్రీకాకుళం రవసెల్లాజుబ్బా తొడిగి ధోవతీకట్టి కూర్చుం టే చంద్రయ్యగారుఅచ్చంగాచంద్రవంశపు రాజు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అంత కళకళలాడుతూ ఉండేవాడు. త్రోవలో ఎవరైనా ఉద్యోగస్థులు కాలి నడకను పోవుచున్నట్లుగా కన్పిస్తే ఆయన వెంటనే బండీ ఆపి, "రండి ఎక్కండి తమ ఆఫీసులో దింపుతాను" అని మర్యాద చేసే వాడు. ఆ బండిలో ఎక్కినతర్వాత "మా కొత్తగుర్రాన్ని చూడలేదా ఏమిటి?" అని సంభాషణ ప్రారంభించేవాడు. "ఈ గుర్రం నడకలోఉన్న జీవకళ వేయిగాలన్ల పెట్రో లుతో పుటాలువేసినా మోటారుకారుకెట్లా వస్తుంది? బాణంలాగున పోయినా ప్రాణం లేని యంత్రం అది. కాని తురగం పరుగెత్తితే అందులో లయతాళతరంగాలు ఉంటాయి. భరతనాట్యం చేసే సురతాణి మా పంచ కళ్యాణి. అది మాగుమ్మంలో ఉంటేచాలు ఇంటికి సొమ్ములు పెట్టినట్లుగా ఉంటుంది." అని తనగుర్రం విషయమై గర్వంగా చెప్పే వాడు. విలాసపురంలో మేజస్ట్రీటుగా షేకు మీర్జాయిస్మాయిల్ సాహెబుగారు ఉండే వారు. ఆయన న్యాయంగా సూటిగా పోయే మనిషి. కాని ఆయనకూ గుర్రం అంటే వెర్రి ఖులాసా—అందువల్ల చంద్రయ్యగారి బండికన్పిస్తే ఆయన పిలిచిందే తడవుగా యీయన ఎక్కేవాడు. ఒక రోజున చంద్రయ్యగారి గుర్రం బండీ చాలా జోరుగా పెద్ద రస్తామీద పోతోంది. అక్కడ సమీపంలో ఒక మిషను కాలేజీ ప్రిన్సిపాలైన పాదరీ దొర యైన ఫాదరు ఫవుల్ గారి తాలూకు చిన్న కోడిపెట్ట రోడ్డు కడ్డంగా వెళ్లింది. గుర్రం బండీని తప్పుకొనలేకపోయి అది బండీక్రింద పడిపోయింది. చంద్రయ్యరాజుగారు మాత్రం ఆ ప్రమాదానికి ఏంచేస్తాడు? ప్రాణంపోయిన పెట్టనుచూచి "అయ్యో! పాపం!" అన్నాడు. కాని తన బండీ గుర్ర

వర్ణార్ణవం

కినీ ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా ఆశ్చర్య చకితులుగా చేయగలిగిన క్రొత్త చిత్రకా రులు కానీ, కొత్త చిత్రాలుకాని పుట్టుకు రావు. అయినప్పటికీ – యీమాదిరి ప్రదర్శ నలు ఏటేటా జరుగుతూ వున్నందువల్ల ఏ చిత్రకారుడు ఏ విధమైన పరిణామ దశలు పొందుతున్నదీ స్వల్పంగా నైనా తెలుసుకొనే అవకాశం నాబోటి జిజ్ఞాసువులకి కలుగుతున్నది. అటువంటి అవకాశం కల్పిస్తున్న అభ్యుదయ చిత్ర కారుల సంఘానికి నా ధన్యవాదాలు. ★

మాత్రం గిండీ గుర్రంలాగున పరుగెత్తింది. పాదిరీదొర ఫవుల్ గారికి కోపం వచ్చి పలికిన ఇంగ్లీషు మాటలు రాజుగారికి అర్థం కాలేదు. బండీని మితిమీరిన వేగంతో నలుగురూ నడిచే రస్తామీద నడిపించాడనే సెక్షను క్రింద ఆయనమీద కేసు పెట్టాడు. మేజస్ట్రేటు అయిన షేకు మీర్జాఇస్మాయిల్ గారి వద్దకు ఆ కేసు విచారణకై వచ్చింది. ఆ రోజున చంద్రయ్య రాజుగారు, ఆయన ప్లీడరుతో సహా కోర్టుకు హాజరైనారు. ఏమైనంత ఆలస్యంగా సాయంకాలం నాలుగున్నర గంటలకు చంద్రయ్య రాజుగారి కేసును విచారణకు తీసికొని మేజస్ట్రేటు గారు తీర్పు చెప్పారు. తీర్పును ఇంగ్లీషులో చదివారు కాని, చంద్రయ్య రాజుగారితో మీర్జా యిస్మాయిల్ గారు ఒక్క మాట తెనుగులో అన్నారు. "నేను కూడా లేచి వచ్చేవరకు మీరు వెళ్ళవద్దు. మన బండీ మీదనే మనం వెళ్ళవచ్చు" అని మేజస్ట్రేటుగారు అన్న మాటకు చంద్రయ్య రాజుగారు అమితానందభరితుడై కోర్టులో కూర్చున్నంతసేపూ మీసం మెలియ బెట్టుతూనే ఉన్నారు. సాయంత్రం 5 గం॥ లైన తర్వాత మేజస్ట్రేటుగారు కుర్చీలోనుంచి లేచివచ్చి చంద్రయ్యరాజు గారికి షేకుహాండు (కరస్పర్శ) చేసి "రండి! మన బండీలో మనం వెళ్లవచ్చు" అన్నారు. ఆ మరునాడు చంద్రయ్య రాజు గారు తనయింటికి వచ్చిన స్నేహితునితో మాట్లాడుతూ "సాహెబ్బులలో ఉన్న మర్యాద యింకెవ్వరిలోనూ లేదండీ! మన మేజస్ట్రేటు ఇస్మాయిల్ గారు నేను కోర్టుకు వెళ్ళితే ఎంత మర్యాద చేశారంటే అంత మర్యాద చేశారు. ఆయన కచ్చేరీ ముగించి లేచేవరకు నన్ను కుర్చీలోనుంచి కదలవద్దని బలవంతం చేశారు. ఆయన కుర్చీలోనుంచి లేచినతర్వాతనే నన్ను లేవనిచ్చారు. మర్యాదంటే మర్యాద అది" అన్నారు.

ఇంతకూ జరిగిన సంగతి ఏమిటని ప్లీడరు వద్దకు ఆ మిత్రుడు వెళ్లి అడిగితే, చంద్రయ్య రాజుగారికి "కోర్టువారు లేచేవరకు మాత్రమే శిక్ష విధించారు. (*Till rising of the Court*) అని ఆప్లీడరు అసలు విషయం విశదపరిచాడు.

ఏమైతేనేం?

సకల జనప్రియత్వము నిజంబుగ
గల్గిన పుణ్యశాలి కొ
క్కొకయెడ నాపదైనఁ, దడవుండదు;
వేగమె పాసిపోవుగా -

అది యెట్లన్నన్

చంద్రుణ్ణి రాహువు మ్రింగినప్పటికీ, అటు పిమ్మట కళకళలాడుతూ ప్రకాశించుటలేదా - ఎప్పటియట్లభాస్కరా! ★

సవరణ

21-10-53 వారపత్రిక 4 పేజీ. 3 కాలం. "కాలక్షేపం" 2 పేరా. 9, 10 పంక్తులలో "ఇంగ్లండు దేశానికికూడా పీరైతే వెళ్ళి స్కాట్లాండు శిక్షణా శిబిరంలో సాధకం చేసి" - అని యుండవలెను.

★ ఘంటారావం ★

(23-వ పేజీ తరువాయి)

మర్చిపోకు:ఒక్క చిన్న గంట గణగణమన్నా సరే,దిష్టిబొమ్మతో్లో నువ్వు వేళ్ళాడతావు!"

క్లోపిన్ పలుకులకు అతడి ప్రజ హర్షధ్వానాలు చేశారు. హర్ష ధ్వానాలు కుక్కలు మొరిగినట్లు, అడవిమృగా లరచినట్లున్నాయి. కవి హాస్యాస్పదుడైనాడు. సర్కస్ చూసినట్లు చూసి బికారులు వినోదం పొందుతున్నారు. కవికి హృదయంలో శూలం గ్రుచ్చుకున్నట్లయింది. చింతించాడు. బికారులు తొందరపెట్టసాగారు. గ్రింగైర్‌కి ఇదే ఆశాలేశం. గంటలు మ్రోగకూడదు.

దిష్టిబొమ్మ నొకసారి చూసి చేతులుజోడించి ప్రార్థించాడు. దిష్టిబొమ్మ ఒంటినున్న చిరుగంటలు సర్పజిహ్వాలవలె అతడికి గోచరించాయి తాను చెయ్యెత్తితే చాలు కాటువెయ్యగలవన్నట్లు భీతిచెందాడు. కాని తప్పదు. "ఒక్క చిన్న గంటలో నా ప్రాణం ఇమిడివుందా!" అని విచారించాడు. అతడి కొక ఊహ వచ్చింది.

"ఒకవేళ గాలివిసురొకటి వచ్చి గంటలు మోగితే?" అని అడిగాడు.

"అయినా నీకు చావు తప్పదు" అని గర్జించాడు క్లోపిన్.

ఇంక గత్యంతరం లేదని రూఢి అయింది. మెల్లిగా కుడికాలెత్తి ఎడమ ముంగాలి నానించాడు. కుంటి ముక్కాలిపీట గజగజలాడింది. అయినా కాలు దించలేదు. కొంతసేపటకి ఎత్తుపీట నిలకడకు వచ్చింది. మెల్లగా చెయ్యి చాచాడు. కాని చెయ్యి దిష్టిబొమ్మను తాకగానే ముక్కాలిపీట కదలాడ నారంభించింది. నిలకడ చెడింది. పడిపోతానన్న భయంతో అతడు బొమ్మను గట్టిగా పట్టుకున్నాడు. గంటలన్నీ కూడబలుక్కున్నట్లు ఒక్కసారి గణగణలాడాయి. గణగణలు వినేసరికి కవికి మతిపోయింది. నేలపైన కుప్పగా కూలిపోయాడు. దిష్టిబొమ్మ ఉచ్చులో గిరగిర తిరిగింది. తరువాత స్తంభాల మధ్య సవిలాసంగా ఊయలలూగ నారంభించింది.

బోరగిలపడిన గ్రింగైర్ చచ్చిపడినట్లు చలించలేదు. అయితే పైన చిరుగంటల గణగణలు, ప్రక్కన దాక్షిణ్యహీనులైన బికారుల కేరింతలు అతడి చెవులలో గింగుర్లెత్తుతున్నాయి.

"జుట్టుపట్టుకు లేవతీసి ఉరితియ్యండి వాణ్ణి" అని అరిచాడు క్లోపిన్."

గ్రింగైర్ అమాంతంగా లేచి నిలబడ్డాడు. అప్పటికే ఉచ్చులోనుంచి దిష్టిబొమ్మ తీసివెయ్యబడింది. కొందరు జుట్టు పట్టుకొని కొందరు రెక్కలూపట్టుకొని అతణ్ని బికారులు లేవతీశారు. ముక్కాలిపీటపై.నిలబెట్టారు. క్లోపిన్ స్వయంగావచ్చి కవి మెడకు ఉచ్చు తగిల్చాడు. భుజంమీద తట్టి "పాపం! సెలవుతీసుకో తీస్తున్నాను నీకు. నువ్వింక తప్పించుకోలేవు. నిన్నెవ్వడూ రక్షించలేడు."

గ్రింగైర్ చేతులు జోడించాడు. "దయ చూపండి..." ఇంక ఆపైన మాటలు పెగిలిరాలేదు. చుట్టూ చూశాడు, సానుభూతిపరు లెవరూ లేరా అని. ఎవరూ లేరు. అందరూ ఎగతాళి చేస్తున్నారు.

ఒకడు చరచర పాములాగ ఒక కర్రనెక్కి చివర కూర్చున్నాడు. గ్రింగైర్ భీతితో తలెత్తి చూశాడు.

"నేను చప్పట్లు కొట్టగానే ముక్కాలిపీట తన్నెయ్యండి. ఒకడు వాడి కాళ్ళుపట్టుకు వేళ్ళాడాలి, ఒకడు వాడి భుజమెక్కి కదం తొక్కాలి, అంతా ఒక్కసారి జరిగిపోవాలి, తెలిసిందా" అని అరిచాడు క్లోపిన్.

గ్రింగైర్ నిలువునా కంపించిపోయాడు.

"అందరూ సిద్ధమేనా?" అన్నాడు క్లోపిన్.

"ఆ" అన్నారు ముగ్గురూ.

క్లోపిన్ క్షణం ఆలోచించాడు. ఏదో గుర్తుకువచ్చింది. "ఆగండి! మరిచిపోయాను. మన ఆచారం మర్చిపోయాను. ఆడవాళ్ళ నడగందే గడ్డిపోచనికూడా మనం ఉరితియ్యం. ఎవత్తికైనా వీడు కావాలా? కవిగారూ! ఇదే మీ ఆఖరిఉపాయం."

గ్రింగైర్ ఊపిరి విడుచుకున్నాడు. అరగంటలో అతడికి రెండోసారి ప్రాణం లేచివచ్చింది.

క్లోపిన్ మళ్ళీ తన సింహాసనమెక్కి కూర్చున్నాడు. దర్జాగా, ఉదారబుద్ధి ఉట్టిపడుతూ చేయిచూపుతూ స్త్రీలనుపిలిచాడు. "ఇటు రండి. ఈ బానిస మీ కెవరికేనా కావాలా? ముందుకువచ్చి వాణ్ని చూసుకోండి. గవ్వ ఖర్చులేకుండా వరుడొస్తున్నాడు. ఎవరికొక్కావాలి?"

గ్రింగైర్ స్త్రీల నాకర్షించలేని అతిదీన దుర్భరపరిస్థితిలో ఉన్నాడు. స్త్రీలందరూ ముక్కాలిపీటవద్దకువచ్చి అతడివంక తేరి పారచూశారు. ఎవరిముఖంలోనూ ప్రసన్నభావంగాని, జాలిగాని కానరాలేదు. ఒకరివెంట ఒకరు వచ్చిచూసి పెదవి విరిచి వెళ్లిపోవడం దీనంగా గమనిస్తున్నాడు కవి. "అక్కర్లేదు. ఉరితియ్యండి వాణ్ని. ఆ వినోదం చాలు" అంటున్నారు.

ముగ్గురు స్త్రీలు తటపటాయించి చూశారు అతడివంక. ఒకామె అతడి చొక్కా పట్టుకొని చూసింది. తరవాత [illegible] తాకిచూసింది. భుజా లెగురవేసింది. "ఒట్టి పేలికలు. లాభంలేదు అని గొణిగింది. "నీ కోటెక్కడ?" అని అతణ్ని అడిగింది.

"పోయింది"

"నీ టోపీ?"

"లాక్కున్నారు."

"కాలిజోళ్ళో?"

"అడుగులు అరిగిపోయాయి."

"పర్సు?"

"అసలు లేనేలేదు."

"అయితే నోరుమూసుకుని చావు."

రెండో ఆమె వృద్ధురాలు. పీక్కుపోయిన ముఖం, చీపురువలె జుట్టు, వికృతంగా ఉంది. ఆమె గ్రింగైర్ చుట్టూ తిరిగి పరిశీలించింది. ఆమెను చూసి గ్రింగైర్ భీతిచెందాడు. 'ఈమె నాపైన మోజుపడదు గదా' అనుకున్నాడు. ఆమె మోజుపడలేదు. "ఒంటిలో గుప్పెడు మాంసంలేదు" అని పెదవివిరిచిందామె.

ఈమారు ఒక యువతి వచ్చి చూసింది. ఈ సమాజంలో కొత్తగా చేరినట్లుంది. అంత మొరటుగా లేదు. ఆమెను చూసి దీనంగా అర్థించాడు గ్రింగైర్: "అమ్మా! నన్ను రక్షించు! నీకు బానిసనౌతాను." జాలితో ఒకసారి అతడిని పరికించింది యువతి. తరువాత కళ్లు దించింది. క్షణంసేపు ఎటూ నిర్ణయించుకోలేక నిలబడింది. ఆమె నతిశ్రద్ధగా పరిశీలించాడు కవి. ఇదే తుది ఆశ. "లాభం లేదు" అన్నదామె పెదవి విరిచి, జాలిగా. "లాభం లేదు. మా కుంటివాడు నన్ను బతకనివ్వడు" అని ఆమె కదిలి గుంపులో కలిసిపోయింది.

"ఏమోయ్? నువ్వు దురదృష్టవంతుడవ్" అన్నాడు క్లోపిన్. సింహాసన మెక్కి నిలబడ్డాడు. ఏలంపాట పాడుతున్నట్లు బిగ్గరగా అరిచాడు: "ఎవ్వరూ లేరా? పందెం ఒడ్డి ఎవరూ వీణ్ని తీసుకో

లేరా? ఒకటోసారి! రెండోసారి! మూడోసారి! ఉహూఁ! లాభం లేదు. ఇంక పని పూర్తిచెయ్యండి."

ఇంతలో ద్వారంవద్ద బిగ్గరగా మాటలు వినవచ్చాయి. "ఎమరాల్డా! ఎమరాల్డా వచ్చింది" అన్నారు కొందరు. గ్రింగైర్ భీతితో ద్వారంవంక చూశాడు. బికారులు దారి యిచ్చారు. ఎమరాల్డా అంటే జిప్సీయువతి.

"ఎమరాల్డా!" అని గొణిగాడు గ్రింగైర్. జిప్సీ యువతిని చూడగానే అతడి కారోజు సంఘటనలన్నీ స్మృతికి వచ్చాయి. ఆ అపురూపసుందరిని చూడగానే అతని శరీరంలో విద్యుత్తు ప్రవహించినట్లయింది. ఆమె పేరు వినగానే బికారుల మధ్య సంచలనం బయలుదేరింది. ఆమె సౌందర్యం బికారులపైన ఆమెకు అధికారమిచ్చింది. ఆమె ప్రభావం ఆమె సమక్షంలోనున్న వారందరికి అనుభూతమౌతున్నది.

ఆమెను చూడగానే కవి నాటి తన బాధలన్నిటినీ మరచిపోయాడు. అందరూ గౌరవంతో తప్పుకుని ఆమెకు దారి యిచ్చారు. కఠోరం, వికృతమూఅయిన బికారుల ముఖాలలో ఆమెను చూసినంతనే ప్రసన్నత ద్యోతకమయింది. గాలిలో తేలుతున్నట్లున్న పదగమనంతో ఆమె ముక్కాలిపీటవద్దకు వచ్చింది. అప్పటికే యాతనలతో అతడు ప్రాణ ముడిగిపోయున్నాడు. అతణ్ని చూసింది.

"ఇతణ్ని ఉరితీస్తున్నారా?" అని అడిగింది.

"అవును చెల్లీ" అన్నాడు పండితుడు. "నువ్వు తీసుకుని పెళ్ళిచేసుకుంటే తప్ప" అన్నాడు క్లోపిన్.

పెదవి కరుచుకుని యోచించింది. "నేను తీసుకుంటాను" అన్నది.

ఉదయంనుంచీ ఏదో స్వప్నలోకంలోనే ఉన్నట్లు భావించాడు గ్రింగైర్. ఇది వాస్తవం కాదని నిర్ధారణకు వచ్చాడు. ఆ స్వప్నమే ఇంకా జరుగుతున్నదని ఊహించాడు.

సుందరివచ్చి తనను రక్షించడంతో అతడికి మతి భ్రమించింది. ఉచ్చుతాడు తొలగించబడింది. అతనికి కాలుచేతు లాడ లేదు. ముక్కాలిపీటపైనే చతికిలపడ్డాడు.

జిప్సీరాజు ఒక మట్టి కూజా తీసుకువచ్చాడు. దాని నందుకుని జిప్సీ యువతి గ్రింగైర్ చేతికిచ్చింది. "నేలమీద పడెయ్యి" అంది. గ్రింగైర్ అది పడవేశాడు. కూజా నాలుగు ముక్కలయింది. జిప్సీరాజు ఇద్దరి భుజాలపైనా చేతులుంచాడు. "అబ్బాయి. ఇకనించి ఆమె నీభార్య. అమ్మాయి, ఇతను నీభర్త. నాలుగేళ్ళవరకు మిమ్మల్ని విడిచిపెడుతున్నాను. వెళ్ళండి" అన్నాడు.

(ఇంకావుంది)

[illegible]

(25 వ పేజీ తరువాయి)

సూర : ఆదేవి టొదినా. అఘాయిత్తం మాటలంటావ్......పొట్ట చేత్తో పట్టుకు అంటావే...

సీతా : అయ్యోరాతా...కడకూ వినవేం. పొట్ట చేత్తో పట్టుకు ఉద్యోగాలకోసం పీడిపంచా వాడిపంచాతిరగవలసినకర్మం పట్టిందంటా...మహారాజులాగ...

సూరయ్య : ఎంత తాతలార్జించిన భూమి ఉన్నా......ఉద్యోగం పురుష లక్షణం అన్నారు.

చలపతి : అదీ సంగతి...

సీతా : ఏమోనమ్మా మా రాజుగాడు కూడా ఉద్యోగంచేస్తా...ఉద్యోగంచేస్తా ...అని పోరితే, ఒద్దురాబాబూ, ఉద్యోగం చెయ్యడం మన యింటా ఒంటా లేదురా, అసలు ఇంగ్లీషు చదువులే మనకు అచ్చిరావు అయినా ఏదో ఒక్కగానొక్క వలుసువి. ముచ్చటపడ్డావని చదివించాం. ఇంతవరకూ ఏగండం లేకుండా చదివేవు. అదే చాలు అనిచెప్పి ఒప్పించేసరికి నా తల ప్రాణం తోక్కి వచ్చింది.

సూర : రాజు ఎంతకి కిందకి దిగడం...

సీతా : వస్తాడు. గెడ్డం చేసుకొంటున్నాడో ఏమో...తొందర పడితే మరేమైనా ఉందా...పీక తెగిపోదూ...ఉద్యోగం చెయ్యనులే...అని అనిపించగలిగాను గాని ఈ సొంతక్షవరం మానిపించడం నాతరం కాలేదు...అయితే సూరయ్యబాబూ...వెంకటరత్నం ఉద్యోగం చేస్తాడన్నమాట.

సూర : ఏదో ముచ్చటపడుతున్నాడు. చెన్నాపట్నంలో ఉండాలని మోజు. సర్లే ఓ నాలుగురోజులపాటు అక్కడ ఉద్యోగం చేసి దగ్గరలోకి బదిలీ చేయించుకొంటాడని, సరే అన్నాను.

సీతా : మా వాడికీ...చెన్నాపట్నంలో కాపరం పెట్టాలని మా వేడుగ్గా ఉంది. పోనీ పెళ్ళయినాక ఓ రెండుమూడు నెల్లు ఇద్దరూ అక్కడఉండండి అన్నాను. అయితేవెంకటరత్నానికి ఎంత జీతమిస్తానన్నారేమిటి ?

చల : ఇంకా వాళ్ళేం అనడం లేదు. ఉద్యోగం యిస్తాం మూడురూపాయలు పంపు అంటున్నారు.

సీతా : అదేమిటి చలపతీ! మూడురూపాయలకి ఉద్యోగమేమిటి ?

చల : అంతే లే పిన్నీ... ఈ రోజుల్లో అన్నీ డబ్బుతో అవుతున్నయి. ధనమూలమిదం జగత్ అన్నారు, నేను కాదు, పిద్దలు. అదీసంగతి.

సీతా : చోద్యంగాఉంది. మూడురూపాయలు పుచ్చుకొని వందలుజీతం యిచ్చే ఉద్యోగాలు ఇస్తే, ఆ ఇచ్చేవాడికేం గిట్టుబాటవుతుంది ?

సూర : సూరయ్య ఉద్యోగం ఖరీదుకాదు ఒదినా! అది ఏదో ఎప్లికేసనుపారం ఖరీదుట.

సీతా : ఫారంఏమిటి. మీవాడు చెయ్యగా చెయ్యగా వెవసాయం వన్ను ఉద్యోగం చేస్తాడా ఏమిటి ? ఈపాటినానికి చెన్నాపట్నం వెళ్ళాలా ? మన ఊళ్ళో పొలాలు ఫారం లేదూ?

చల : ఫారంఅంటే, మన చిలకపల్లె ఫారంకాదు పిన్నీ, అర్జీకాగితం అన్నమాట. ఎప్లికేషను అంటే దరఖాస్తు అన్నమాట. చూశావా నాకు ఇంగ్లీషు రాదన్నావ్...

సీతా : అంటే మావాడుకూడా అడపాదడపా మూడేసి రూపాయలు పుచ్చుకొంటున్నాడు; కొంపతీసి వీడుకూడా దరఖాస్తులు పెట్టడం లేదుకద...

సూర : ఏమో ఎవరుచెప్పగలరు? ఇంతకీ దిగిరాడేం ?

[పోస్టుసుబ్బన్న]

సుబ్బ : సీతారావమ్మగారూ - రాజాబాబున్నారా. రిజిస్టరు ఉత్తరం ఉంది.

సీతా : ఉన్నాడు నాయనా ? పిలుస్తాను...బాబూ...ఓ రాజు...ఓ రాజిగా.

సుబ్బన్న : ఏం సూరయ్యగారూ...... పెలిగ్రాంవిశేషాలు మరేం ప్రమాదంకాదు కదా.

సూ : ఏమో నాయనా...ఇంకా చదివించలేదు. నా మనసు మనసులో లేదు సుబ్బన్నా...

సుబ్బ : మరి ఈ చలపతి బాబు ఏదో యింగ్లీషు చదువు ఊడబొడిచా వన్నావే చదివిచెప్పలా...

★ పరిహాసప్రహారం ★

చల : అదికాదు సుబ్బన్నా. సంగతేమిటంటే...

సుబ్బ : యిలా తెండి చదివిచెప్తా.

సీతా : కోలదస్తూరీ నీకేం తెలుసు సుబ్బన్నా. చెన్నాపట్టం వెళ్ళి చదువుకొన్నావా ఏం?

సుబ్బ : యింతోటి టెలిగ్రాం చదివి చెప్పటానికి చెన్నాపట్నం వెళ్లాలా ఏం? వైర్ — ఫిఫ్టీ — అర్జెంటు — వెంకటరత్నం.

సూ : అర్జెంటూ ఏమిటే బాబూ...... ఏమిటి అర్జెంటు? వెంకటరత్నానికేం ప్రమాదం లేదుకదా...

చల : ఏం లేదు, వైర్ అంటే, మొన్న మనం, మన చేనుచుట్టు వైరుతీగె వేద్దామనుకున్నాం కదూ... చెన్నాపట్నంలో చుట్ట్లవైరు వుంది. ఫిఫ్టీ అంటే యాభై గజాలు అర్జెంటుగా పంపిస్తా అని వ్రాశాడు, అది సంగతి.

సుబ్బ : తగ్గవయ్యా...... చదువుకొన్న పెద్దమనిషి తగ్గు. అదేం కాదు. సూరయ్యగారూ...యాభై రూపాయలు టెలిగ్రాం మనియార్డరు పంపమంటున్నాడు. అర్జెంటంట...

చల : మనియార్డరు అని మరి టెలిగ్రాంలో మాట లేదేం?

సుబ్బ : నీలాంటి వాడికి అది బోధపడదు ఇది దొరల దస్తూరీలే...

చల : నేను నమ్మను. సూరయ్య బాబాయి. సుబ్బడు నన్ను వెక్కిరించడానికి ఏవో చదివాడు. రాజు రానీ, నేను చెప్పిన అర్థం రైటో కాదో చెప్పిస్తా. ఇంగ్లీషంటే చదవలేను గాని అర్థం చెప్పలేం రాదా, మరీను...

[రాజు దిగుతూ]

రాజు : ఏమిటమ్మా......నన్ను ఊళ్ళో ఉండనిస్తావా లేదా 'రాజు...ఓ రాజుగా' అంటూ పెంకులెగరగొడుతున్నావ్...

సూ : బాబూ...రాజూ...ఈ టెలిగ్రాం కొస్తా చదివిపెడుతూ పుణ్యముంటుంది.

రాజు : ఇందుకా, కేకలేస్తున్నావు... ఇంటికి దింపారు. కిందనే చిన్నమ్మ ఉందిగా, దాని చేత చదివించుకోలేకపోయారా...

సీతా : అది కాఫీ కాస్తున్నాదిరా ..

సుబ్బ : నేను చదివి చెప్పానుగా...

రాజు : ఇంకేం...సుబ్బన్న చదివిచెప్పాడుగా...

చల : సుబ్బన్న అంతా తప్పుల తడిక చెప్పాడు. అదీ సంగతి.

రాజు : ఏయ్...చలపతీ నీ కెన్ని సార్లు చెప్పాను,మాయింట్లో అడుగు పెట్టవద్దని పో...

చలప : నేను నాకోసం వచ్చానా... ఏదో సూరయ్య బాబాయికి టెలిగ్రాం వచ్చింది కొంపతీసి వెంకటరత్నం ఏ రైలుకిందైనాపడి అఘాయిత్యం అయినట్టు వార్త వస్తే, ఆదుకోడానికి వచ్చాను గాని.

సూర : ఎంత గుండెలు తీసినమాట అన్నావురా...ఔరా ఔరా...

చల : ఉన్నమాట అన్నానయ్యా... యిందులో తప్పేముంది ..తంతా వేమిటి ఆఁ ఆఁ.

రాజు : తన్ను పెదనాన్నా ... వాణ్ణి తన్ను. వెంటపడు అదీ అదీ...పారిపోతున్నాడు పరిగెత్తు.

సీతా : ఏం సుబ్బన్నా. టెలిగ్రాం నిజంగానే చదివి చెప్పావా...అందులో మరేం చెడ్డవార్త లేదుకద. సూరయ్య ఇక్కడ లేడుగా...ఏదేనా అశుభం అయితే చెప్పు నేను మెల్లిగా ఆకబురు చెరవేస్తా.

రాజు : ఏమిటమ్మా ఈ వెర్రి......ఏం సుబ్బన్నా నాకేం ఉత్తరాలు లేవూ...

[విశాలాక్షి కాఫీతో]

విశా : కిందకి దిగావ్ ...యిదిగో కాఫీ...

సుబ్బ : యిదుగో బాబయ్యా మీకు ఉత్తరం...విశాలాక్షమ్మగారెవరు బాబూ ...మీ కేరాఫున...

విశా : ఆఁ ఆఁ...నాకే అని...

సుబ్బ : మీరుటమ్మా మీ పేరు విశాలక్షమ్మ! ఏదో చిన్నమ్మగారని అనుకుంటున్నాను గాని. ఇదిగో మీకు రిజిస్టర్డు ఉత్తరం సంతకం పెట్టండి.

సీతా : ఏమిటే...నీకూ ఉత్తరాలు వస్తున్నాయిటే...మా అమ్మా...కలికాలం...

రాజు : డామిట్ ......అనుకొన్నట్టే అయింది.

విశా : ఏమిటి బావా...

రాజు : ఉద్యోగానికి కాళీలు లేవట...

సీతా : ఆఁ ఆఁ...నామీద ఒట్టు పెట్టుకొనికూడా ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నావుట్రా...

రాజు : లేకపోతే ఈ నూతిలో కప్పలాగ పడుండమన్నావా ఏది [illegible] ఇటు ఇచ్చి ఉత్తరం నాకెట్టుకు [illegible]

విశా . అయినే నీకెం

రాజు. పెళ్ళాకాతున్న నీ కిచ్చుకుంకవాడు. కాబోయే పెళ్ళాం సంగతి సందర్భాలు తెలుసుకోవద్దూ.

విశా : అంతనమ్మకం లేనివాడివి నాతో నువ్వేం సంసారం ఈదగలవు.

రాజు : ఏదీ చూపెనీ

విశా : నేను చూపెనివ్వను.

రాజు : ఆ అలాగా అమ్మా దీన్ని పెళ్ళాడను. మా అన్నయ్యకే విషయం ఉత్తరం రాసిపడే సుబ్బన్న యిక్కడే పట్టుకెళ్లి మెయిలుబస్సు కందిస్తాడు.

విశా : బావా. బావా గుడ్ న్యూస్ ...ఈ ఉత్తరంలో ఏముందో చెప్పకో ..

రాజు : ఏముంటుంది. కాలేజీలో నీకు ప్రేమలేఖలు రాసిన సంగ్రటావు నువ్వు వాడి ప్రేమకోలన్నానని అమాంతంగా ఆత్మహత్య చేసుకొంటానని బెదరిస్తున్నాడా..

విశా : కాదు బావా.. నాకు ఉద్యోగం అయింది.

రాజు : ఆఁ ఆఁ

సీతా : ఇదేమిటే మా అమ్మా . నీకు ఉద్యోగం ఏమిటే

విశా : అవునత్తా.. కాలేజీలో పంతులమ్మ ఉద్యోగం

సీతా : అయ్యోఅయ్యో.. ఎంత ఘోరమైనమాట విన్నానే ఈ పాపం నిలువునా స్నానంచేస్తేగాని పోదు

విశా : పెద్ద వేగం నాకేదు చెప్పికూడా రెండు బాల్చీలు పోసుకో ..

సీతా : కలికాలం . కలికాలం. .

రాజు : ఏయ్.. విశాలా నీకు దరఖాస్తుఫారం ఎక్కడిదీ మూడు నెలలాయి ఇక్కడే ఉంటున్నావుగా..


విశా : ఈ జన్మలో ఉద్యోగం చెయ్యనని నువ్వు మీ అమ్మమీద ఒట్టు పెట్టుకొన్నావుకదా.. నీ పేర వచ్చిన దరఖాస్తు ఫారం ఎందుకు వృధాగా పోవాలి అని నీ మిసెస్‌గా అది నేను పూర్తిచేసి పంపించాను.

రాజు : అన్యాయం . అన్యాయం

విశా : ఏం నా మొగుడిగా ఉం[illegible] నీ కిష్టం లేదా. నాకు మట్టుకు నీ పెళ్ళా[illegible] ఉండేందుకిష్టమే. అన్నట్టు ఎంత [illegible] తల్లికి కొడుకువి కదా.. ఉద్యోగం చేస్తున్న ఆడదంటే నీకూ కోపం వస్తున్నాదా ఏం

రాజు : డామిట్.. పద...మరి కొంతసేపు యిక్కడుంటే కోపం వచ్చేటట్టుంది. పోయి మెయిల్ బస్సెక్కి పెళ్లిళ్ళ రిజిస్ట్రారు దగ్గరికి ఉడాయిద్దాం... ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras


పంచతంత్రం
సంధి-విగ్రహం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
పరిహాసం విని హిరణ్యగర్భుడు కోపోద్దీపిత మానసుడయ్యెను. తామ్రచూడుని మీదకు పోయెను. తామ్రచూడుడది గమనించి ఆతని తలపై ప్రహరించెను.
అవమానితుడగు హిరణ్యగర్భుని దుస్థితి జూచిన పక్షులన్నియూ మరియొకసారి పరిహసించినవి.
హిరణ్యగర్భుడు కడు రోషంతో తామ్రచూడుని మీదకు ఎగిరి ఒక్క పోటునా కూలనేసెను.
నాయకుడట్లూ నిహతుడు కాగా - సేనావాహిని చేష్టలు దక్కి - నిలచియుండగా హిరణ్యగర్భుడు - ఇదే యదనని మింటికెగసెనూ; - సమీపమున గల సరస్సు జొచ్చెను.
తరుముకు వచ్చిన సేనల జూచి సాహసికుడగు హిరణ్యగర్భుడు రౌద్రాకారం తాల్చినవాడై వారినెల్లరను యమపురికంపెను.
హిరణ్యగర్భుని ప్రతాపాగ్నికి తాళలేని ఆ శత్రుసేనలూ కొన వూపిరితో రాజును చేరి తమకు కలిగినా కష్టములన్నీ సవిస్తరముగా విన్నవించిరి.
సేనలు పొందిన పరాభవము - స్వయముగ వినినా చిత్రవర్ణుడూ - కోపోద్దీపిత మానసుడయ్యెను. - సేనలన్నిటిని హుషారు గొలిపి - మంత్రివర్యుని వెంటనిడుకొని - ఒంటరివాడగు సేనాపతిపై ఒక్కుమ్మడిగా దాడి వెడలెను.
అయ్యో పాపం, సేనాధిపతీ! చిత్రవర్ణుని దాడి కోర్వక, మొదలు నరికినా కదళీ తరువూ కూలినట్లుగా నేలరాలెను.
ఆతని చంపినా చిత్రవర్ణుడూ ఆనందముతో చిందులు త్రొక్కుచు సింహనాదమూ చేయదొడగెను
విజయగర్వమున చిత్రవర్ణుడూ - శత్రు దుర్గమునే ప్రవేశించెను. - రాచనగరునూ కొల్లగొట్టెను - విజయ దుందుభులు మ్రోగించుచును - సేనలన్నిటిని వెంటనిడుకొని - రాజధానికి వెడలిపోయెను.
(విష్ణుశర్మ: రాజకుమారులతో)
"విన్నారయ్యా విగ్రహమను - కథా భాగమును శ్రద్ధగ మీరు? - కయ్యానికి కాలు త్రవ్వక - ఎదిరి మనముల నొవ్వజేయక - కూరిమితో ప్రజ పరిపాలింపుడు."
"విగ్రహమునియెడ తంత్రమునెరిగి, ధన్యులమైతిమి గురువర్యా! సంధియనెడి ఆ తంత్రభాగమును దయతో తమరూ సెలవీయండి!"